తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

వరంగల్

: fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-6-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 148 పేజీలు: 8+16 వెల: 8.00







శనివారం చెన్నైలో భాగ్యరాజ్ భౌతిక కాయం వద్ద నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తమిళ సిఎం విజయ్

# భాగ్యరాజ్ కన్నుమూత

>> 73 ఏళ్ల భాగ్యరాజ్‌కు తెల్లవారుజామున ఛాతినొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. భాగ్యరాజ్‌కు భార్య పూర్ణిమ భాగ్యరాజ్, కుమారుడు శాంతను భాగ్యరాజ్, కుమార్తె శరణ్య భాగ్యరాజ్ ఉన్నారు. ఆయన ఆకస్మిక మరణవార్తతో తమిళ సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. మరో విషాదకర విషయం ఏమిటంటే భాగ్యరాజ్ గురువు, ప్రముఖ దర్శకుడు భారతీరాజా మరణించి కేవలం 17 రోజులకే ఆయన కూడా కన్నుమూయడం సినీ వర్గాలను మరింత కలచివేసింది. దేశవ్యాప్తంగా పలువురు సినీ నటులు, దర్శకులు, నిర్మాతలు, అభిమానులు భాగ్యరాజ్ మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తెలుగు హీరో వెంకటేష్ స్పందిస్తూ భాగ్యరాజ్ కథలు భాషలకు అతీతంగా కోట్లాది ప్రేక్షకుల హృదయాలను తాకాయని అన్నారు. సుందరకాండ, అబ్బాయిగారు వంటి చిత్రాల్లో నటించే అవకాశం తనకు దక్కడం అదృష్టమని పేర్కొన్నారు. భారతీయసినిమా గొప్పదర్శకుడిని కోల్పోయిందని, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. తమిళ దర్శకుడు ఎం. రాజేష్ కూడా భాగ్యరాజ్‌కు నివాళులర్పించారు. ఆయన కథనం, హాస్యం, స్క్రీన్‌ప్లే తరతరాల రచయితలు, దర్శకులకు స్ఫూర్తిగా నిలిచాయని కొనియాడారు. 1953 జనవరి 7న తమిళనాడులో జన్మించిన కె. భాగ్యరాజ్ 75కు పైగా చిత్రాల్లో నటించి, దర్శకత్వం వహించారు. సామాజిక అంశాలను హాస్యంతో మేళవించి ప్రేక్షకులను అలరించడం ఆయన ప్రత్యేకత. అందా 7 నాట్కల్, ముందానై ముడిచ్చు, తూరల్ నిన్ను పోచ్చు, డార్లింగ్ డార్లింగ్ డార్లింగ్, ఇదు నమ్మ ఆళు, ఇంద్రు పోయ్ నాళై వా, మోన గీతంగళ్, రుద్ర వంటి చిత్రాలు ఘన విజయాలు సాధించాయి. వీటిలో అనేక సినిమాలు తెలుగు, హిందీ, కన్నడ, ఒరియా భాషల్లో రీమేక్ లేదా డబ్బింగ్ అయ్యాయి. నటుడిగానే కాకుండా ప్రతిభావంతమైన రచయితగా కూడా భాగ్యరాజ్ ప్రత్యేక గుర్తింపు పొందారు. కమల్ హాసన్ నటించిన ఒరు ఖైదియిన్ డైరీ చిత్రానికి కథ అందించారు. అదే కథ ఆధారంగా హిందీలో తెరకెక్కిన ఆఖ్రీ రాస్తా చిత్రానికి భాగ్యరాజ్ స్వయంగా దర్శకత్వం వహించారు. ఆయన మరణంతో భారతీయ సినీ పరిశ్రమ ఓ విశిష్ట సినీ మేధావిని కోల్పోయింది.

**అధికారిక లాంఛనాలతో భాగ్యరాజ్ అంత్యక్రియలు...**

భారతీయ సినిమాకు భాగ్యరాజ్‌చేసిన సేవలకుగాను అధికార లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించాలని సీఎం విజయ్ ఆదేశాలు జారీచేసారు. ఆయన మృతిపట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తంచేసిన సీఎం భాగ్యరాజ్ మరణం తమిళ చిత్రపరిశ్రమకు, రాష్ట్ర సాంస్కృతిక రంగానికి తీరని లోటని అన్నారు. దర్శకుడుగా నటుడిగా కథా రచయిత, సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞ కనబరిచిన అరుదైన ప్రతిభాశాలి ఆయన అని కొనియాడారు. కాగా ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు చెన్నైలోని బీసెంట్‌నగర్ విద్యుత్ స్మశాన వాటికలో భాగ్యారాజ్ అంత్యక్రియలకు ఏర్పాట్లుచేస్తున్నారు. కాగా తమిళనటులు రజనీకాంత్, సూర్య, ఇతర ప్రముఖులు రాజకీయ రంగాలకు చెందినవారు భాగ్యరాజ్ భౌతికకాయంవద్ద నివాళులర్పించారు.

# నీటి మంత్రి పనికి రాడా?

>> సాధించిన పార్టీగా బిఆర్ఎస్.. రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు రాష్ట్ర నీటి హక్కులను హరిస్తానంటే చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. గోదావరి, కృష్ణా జలాల్లో ఒక్క చుక్క నీరు తగ్గినా, ఎక్కడ రాజీపడినా ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. గోదావరి నదిలో తెలంగాణకు 968 టీఎంసీల నికర నీటి కేటాయింపులు ఉండగా, బిఆర్ఎస్ హయాంలో 830 టీఎంసీలకు పూర్తి అనుమతులు తెచ్చుకున్నామని, మరో 138 టీఎంసీలకు అనుమతులు రావాల్సి ఉందని చెప్పారు. గతంలో 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, టిడిపిలు గోదావరిలో కేవలం 265 టీఎంసీలకే అనుమతులు తెచ్చాయని అన్నారు. అంటే అప్పుడు ఏడాదికి సగటున 4.48 టీఎంసీలు సాధిస్తే, బిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం తొమ్మిదిన్నరేళ్లలో 383 టీఎంసీలకు ఏడాదికి సగటున 40.36 టీఎంసీలు అనుమతులు సాధించిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా ఇప్పటివరకు ఒక్క టీఎంసీ నీటికి కూడా కొత్తగా అనుమతులు సాధించలేదని విమర్శించారు. నదుల అనుసంధానం జరగాలంటే ముందు తెలంగాణ 968 టీఎంసీల ప్రాజెక్టుల అనుమతులన్నీ క్లియర్ కావాలని బిఆర్ఎస్ నాడే కేంద్రానికి తేల్చి చెప్పిందని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులు సాధించకుండానే నదుల అనుసంధానానికి ఎలా ముందుకు వెళ్తోందని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అజ్ఞానం, గురువుకు గురుదక్షి ణ చెల్లించుకోవాలనే తపన.. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులకు శాపంగా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రతి దశలోనూ రేవంత్ రెడ్డి చంద్రబాబుకు సహకరిస్తూ, తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. రహస్య సమావేశంలో చంద్రబాబు నాయుడు, కేంద్ర కార్యదర్శి కాంతారావు ఏం చెప్పారో రేవంత్ రెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ముగ్గురు సీఎంల సమావేశంలో మాట్లాడిన అంశాలను వెంటనే శాసనసభలో పెట్టి చర్చించాలని అన్నారు. హైడ్రా విషయంలో హిట్లర్ స్ఫూర్తి అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి నీళ్ల విషయంలో రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన నీరో చక్రవర్తి స్ఫూర్తిగా తీసుకుని ఉండవచ్చని ఎద్దేవా చేశారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కనీసం ఒక నిరసన ఉత్తరం కూడా రాయడం లేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఏమో గురుదక్షి ణ, కర్ణాటకకేమో ఎన్నికల సహాయానికి ప్రతిఫలంగా దక్షి ణ చెల్లించుకుంటూ తెలంగాణ హక్కులను రేవంత్ రెడ్డి ధారపోస్తున్నారని ఆరోపించారు.

# భారత్ ట్యాక్సీ విస్తరణ

>> స్పష్టం చేశారు. మొబిలిటీ, రవాణా రంగాల్లో సహకార ఉద్యమాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. భారత్ ట్యాక్సీలో చేరడం ద్వారా డ్రైవర్లు తమ శ్రేయస్సు, గౌరవం, భద్రతకు మార్గం సుగమం చేసుకున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో భారత రవాణా రంగంలో భారత్ ట్యాక్సీ ఒక ప్రధాన సహకార సంస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# బాగున్నావా!

>> భారత్, సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల నిరోధం వంటి కీలక అంశాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. దౌత్యపరమైన పర్యటనలో ఇలాంటి ఆసక్తికరమైన సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ తాబేలును మోదీ వీక్షించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# భారీ వర్షాలు!

>> వర్షాలు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడతాయని, కొన్నిచోట్లు భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజాగా ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ నేపథ్యంలోనే ఆ రెండు ఉమ్మడి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే హన్మకొండ, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగాం, ములుగు, నల్గొండ, కొత్తగూడెం, ఖమ్మం, ఆసిఫాబాద్, మల్కాజిగిరి, మంచిర్యాల, రంగారెడ్డి, సంగారెడ్డి, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. ఈ క్రమంలోనే గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ వర్షాలు, గాలుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. ఇక హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సాయంత్రం 6 గంటల తర్వాత హైదరాబాద్‌లో వర్షం తీవ్రత పెరుగుతుందని వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే చోట, ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉండటంతో ప్రజలు అత్యవసరం అయితే బయటికి రావాలని, ముందుగానే ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జూలై 2 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

## వారం - వర్జ్యం

**28-06-2026, ఆదివారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం**
**గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె**
చతుర్దశి రా. 3.06
జ్యేష్ఠ రా. 1.08
వర్జ్యం : లేదు
దు.సా. 4.54-సా. 5.46
రాహుకాలం - సా. 4.30-6.00

## వారాఫలం

**మేషం:** సహోదర, సహోదరీ వర్గం వారికి విశేషంగా సహాయ సహకారాలు అందించవలసి వస్తుంది. వస్త్రలాభం.

**వృషభం:** భూముల విషయంలో ఏర్పడిన వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. ఆరోగ్యం విషయంలో మెలకువ అవసరం.

**మిథునం:** యోగాసనాలు, మెడిటేషన్ వంటి వాటిపై మక్కువ పెరుగుతుంది. తలనొప్పి ఇబ్బంది పెట్టవచ్చు.

**కర్కాటకం:** జాయింట్ ఖాతాలను, ఆర్థిక వినియోగ విషయములో శ్రద్ధ వహించండి. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** కీలక విషయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**కన్య :** భవిష్యత్తును బంగారు బాటగా మలచుకొనే ప్రణాళిక రూపొందించుకుంటారు. శుభవార్తలు అందుకుంటారు.

**తుల:** అప్పులు ఇవ్వడం, అప్పులు తీసుకోవడం రెండూ లభించవు. వృత్తిభివృద్ధిలో స్వల్పమందగమనం ఏర్పడుతుంది.

**వృశ్చికం:** విదేశీ పర్యటన అవకాశాలు ఉంటాయి. స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించండి. బంధువుల కలయిక.

**ధనుస్సు:** క్రీడారంగం యందు ఆసక్తి కలిగి ఉంటారు. దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**మకరం:** పూర్వం మీరు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవలసి రావడం, ఆర్థికంగా వెనుకబాటుకు కారణం అవుతాయి.

**కుంభం:** సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. సభ్యుల ఉన్నతికి అవిశ్రాంత కృషి చేస్తారు.

**మీనం:** ముఖ్యమైన పత్రాలపై సంతకాలు చేయునప్పుడు బాగా పరిశీలించి సంతకాలు చేయడం చెప్పదగినది. వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'విబిజి'పై సుప్రీంకు!

>> కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కార్మిక శాఖామంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పంచాయతీ రాజ్ ప్రత్యేక కార్యదర్శి దానకిశోర్ ,పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ డి.దివ్య తదితరులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఇది కేవలం ఉపాధి హామీ చట్టం సవరణ కాదని, భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను క్రమంగా కేంద్రీకరించి, గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని ఆయన ఆరోపించారు. 'తెలంగాణ రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల భవిష్యత్తును తాకట్టు పెట్టే చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం తలవంచి అమలు చేయదు. ప్రజల ప్రయోజనాలే మాకు పరమావధి' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టంలోని అనేక నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని న్యాయ నిపుణులు ఉపసంఘానికి వివరించారని తెలిపారు. అవసరమైతే ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని చెప్పారు. 'రాష్ట్రాల హక్కులను కాపాడేందుకు అవసరమైతే దేశ అత్యున్నత న్యాయస్థానం(సుప్రీంకోర్టు) తలుపులు తడతాం. తెలంగాణ ఒక్కటే కాదు... సమాఖ్య వ్యవస్థను విశ్వసించే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొన్నారు. కర్ణాటక, కేరళ ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరిపి, ఉమ్మడి న్యాయపరమైన, రాజకీయ కార్యాచరణపై చర్చించాలని ఉపసంఘం నిర్ణయించినట్లు వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న దాదాపు 20 పౌరసంఘాలు కేంద్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం స్వంత ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని వారు సూచించారని తెలిపారు. 60 రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ, ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల హామీ ఉపాధి కల్పించాలని, చట్టబద్ధ కనీస వేతనాలు చెల్లించాలని పౌరసంఘాలు ప్రభుత్వాన్ని కోరాయని మంత్రి వివరించారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్య విధానం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారం మోపే ప్రమాదం ఉందని, ఈ అంశాన్ని రాష్ట్ర న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. పనితీరు బాగున్న రాష్ట్రాలను శిక్షి స్తూ, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించేలా కేంద్రం రూపొందించిన నిధుల కేటాయింపు విధానం అన్యాయమని మంత్రి విమర్శించారు. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి సమగ్ర సూచనలు పంపినా వాటిని పూర్తిగా విస్మరించడం బాధాకరమని అన్నారు. 'తెలంగాణ ప్రజల హక్కులు, రాష్ట్ర రాజ్యాంగబద్ధ అధికారాలు, గ్రామీణ పేదల జీవనోపాధిని కాపాడటం మా బాధ్యత. కేంద్రం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే తెలంగాణ చూస్తూ ఊరుకోదు' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంపై జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. అవసరమైతే రాష్ట్ర చట్టం తీసుకురావడం, సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపట్టడం వంటి అన్ని ప్రత్యామ్నాయాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. వీబీజీ రామ్‌జీ చట్టం-2025 రాష్ట్రాల రాజ్యాంగబద్ధ హక్కులను హరించే విధంగా, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వీబీజీ రామ్‌జీ చట్టం ప్రకారం ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు 40 శాతం వరకు ఆర్థిక భారం భరించాల్సి వస్తున్నప్పటికీ, పనుల ఎంపిక, ప్రణాళిక, ఆమోదం, అమలు, పర్యవేక్షణ వంటి కీలక అంశాలన్నింటిలోనూ రాష్ట్రాలకు నిర్ణయాధికారం కల్పించకపోవడం తీవ్ర అభ్యంతరకరమని సమావేశం అభిప్రాయపడింది. నిధుల బాధ్యత రాష్ట్రాలపై మోపుతూ, అధికారాలను పూర్తిగా కేంద్రం వద్దే కేంద్రీకరించడం భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని సభ్యులు పేర్కొన్నారు. గ్రామీణ పేదల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపే 60 రోజుల ఉపాధి విరామం నిబంధన ఆచరణ సాధ్యం కాదని మంత్రులు స్పష్టం చేశారు. సమీక్ష సమావేశం అనంతరం వివిధ కార్మిక సంఘాలు, పౌరసంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులతో కేబినెట్ సబ్ కమిటీ ప్రత్యేకంగా సమావేశమైంది. వీబీజీ రామ్‌జీ చట్టంపై వారు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, సూచనలు, ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను సభ్యులు శ్రద్ధగా విన్నారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు కొనసాగించడంతో పాటు, అవసరమైతే న్యాయస్థానాలను కూడా ఆశ్రయించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది.

# నేడు బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ రాక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్27:** పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ కంచు కోటను బద్దలు కొట్టి అధికారంలోకి రావడంతో దేశ వ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తోంది. తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో సైతం ఫుల్ జోష్ నెలకొంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... తెలంగాణలో విజయఢంకా మోగించడమే బీజేపీ నెక్స్ట్ టార్గెట్ అని స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచే ఈ విజయానికి నాంది పలుకుతామని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధించి చూపెడతామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి వచ్చినా సరే.. బీజేపీని ఓడించడం ఎవరి తరం కాదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆదివారం హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. మరోవైపు వరంగల్ లో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... బీజేపీ జాతీయ నాయకత్వం మొత్తం తెలంగాణ వైపే చూస్తోందని అన్నారు. ఈనెల 29న నితిన్ నబీన్ వరంగల్‌లో పర్యటిస్తారని, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బూత్ లెవెల్ కార్యకర్తల సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. బీజేపీని కాదని కాంగ్రెస్ ను గెలిపించిన ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయిందని అన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ పర్యటన సందర్భంగా ఏర్పాట్లు చేశారు. ఆయన అధ్యక్షుని బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి మున్సిపల్ ఎన్నికల వేళ మహబూబ్‌నగర్ వచ్చారు. అక్కడ నుంచి నేరుగా ఢిల్లీకి వెళ్లారు తప్ప హైదరాబాద్‌లో అడుగుపెట్టలేదు. రెండోసారి చేసే పర్యటనలో ఆదివారం అంతా హైదరాబాద్‌లో గడపనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం చేరుకుని 4 గంటలకు రంగారెడ్డి జిల్లా కార్యాలయం చేరుకుని అక్కడి నుంచి రాష్ట్రంలో దాదాపు 9 జిల్లాల నూతన పార్టీ కార్యాలయాలను వర్చువల్ రూపంలో ప్రారంభిస్తారు. సాయంత్రం 5 గంటలకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ చేరుకుని జిహెచ్ఎంసి పరిధిలోని బూత్ అధ్యక్షులతో భేటీ అవుతారు. తర్వాత రాష్ట్ర కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశం అవుతారు. 2వ రోజు వరంగల్ పర్యటనకు వెడతారు. 3వ రోజు(30న) ఘట్‌కేసర్‌లో రాక్ ఎన్‌క్లేవ్ కన్వెన్షన్‌లో జరిగే రాష్ట్ర కార్యవర్గ, ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ప్రసంగిస్తారు. అనంతరం ఢిల్లీకి పయనమవుతారు.




నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా భువనేశ్వర్‌లో శనివారం ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# ప్రముఖుల భద్రత కట్

>> రించుకుంది. బుల్లెట్ ప్రూఫ్ కారు సౌక ర్యం తొలగించబడ్డ వారిలో బిఆర్ఎస్ నేత, విశ్రాంత ఐపిఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా వున్నారు. ఆయనతో పాటు ఈ సౌకర్య ం తొలగించబడ్డ వారిలో కొందరు మాజీ మంత్రులు, ఇతర ప్రముఖులు వున్నారు. కాగా ప్రముఖుల భద్రతకు ఇంతకాలంగా పనిచేసిన 300 మందిని అక్కడి నుంచి తొలగించడంతో వారిని ఆయా జిల్లాల ట్రాఫిక్ విభాగాల్లో పనిచేసేందుకు వీలుగా పోలీసు శాఖ ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్రంలో అన్నిచోట్ల ట్రాఫిక్ సమస్యలు ఎక్కువవడంతో అదనపు సిబ్బంది అవసరం అయినందున వీరిని వాడుకోవాలని ఆయా జిల్లాల అధికా రులను పోలీసు శాఖ ఆదేశించింది. రాష్ట్రంలో ప్రముఖుల భద్రతకు 1500 మంది వరకు గన్‌మెన్లను వాడుతున్నారు. వీరిలో ఎక్కువగా సా యుధ బలగాలకు చెందిన వారు వుంటారు. కొన్నిచోట్ల ఇతర విభాగాలకు చెందిన కానిస్టేబుళ్లు కూడా గన్‌మెన్లుగా వున్నారు. దీంతో పాటు ఎ స్కార్టు వాహనాలు, డ్రైవర్లు, అదనపు సిబ్బంది కూడా వుంటారు. ఇదంతా ఒక ఎత్తయితే బుల్లెట్ ప్రూఫ్ కార్ల కేటాయింపు మరో కీలక అంశ ంగా చెప్పాలి. నక్సలైట్లు లేదా ఉగ్రవాదుల నుంచి బెదిరింపులు ఎక్కువగా వున్న వారికి ఈ వాహనాలు ఇస్తుంటారు. ఈ వాహనాలు పోలీసు శాఖ వద్ద వందకు పైగానే వున్నాయని చెబుతారు. ఇందులో అనేకం కాలం చెల్లిన వాహనాలు అవడంతో తరచూ రోడ్డుపై మొరయిస్తుంటాయి. బిజెపి (గోషామహల్ నియోజికవర్గం) ఎంఎల్ఎ రాజాసింగ్‌కు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం పలుమార్లు ఇలాగే రోడ్డుపై ఆగిపోవడం గమనార్హం.

**అధికార పార్టీ నాయకులకు గన్‌మెన్ల నిరాకరణ**

ఇదిలావుండగా పోలీసు శాఖ తీసుకున్న మరో కీలక నిర్ణయం అధికార పార్టీ నాయకులు గన్‌మెన్ల కోసం చేసుకున్న దరఖాస్తులను తిరస్కరిం చడం. ప్రభుత్వ కార్పొరేషన్లకు ఛైర్మన్లుగా నియమితులైన వారు, మున్సిపల్ ఛైర్మన్లు గన్‌మెన్ల కోసం గట్టిగానే ప్రయత్నాలు చేయగా ఈ విష యంలో పోలీసు శాఖ నో అంది.

ఈ విషయంలో మంత్రులు, అధికార పార్టీ పెద్దలు సిఫార్సు చేసినా పోలీసు శాఖ పలు కారణాలచేత గన్‌మె న్లను ఇచ్చేందుకు నిరాకరించింది.

# 63 వేల కోట్ల నష్టం

>> అడ్డంకిగా మారాయి. తొలగించిన శిథిలాలపై మళ్లీ పెద్ద పెద్ద గోడలు పడగా పరిస్థితి ఘోరంగా తయారైంది. బుధవారం సాయంత్రం వచ్చిన భూకంపాల వల్ల ఇప్పటివరకు 920 మంది మరణించినట్లు అధికారికంగా ధృవీకరించగా, 3,360 మంది తీవ్రంగా గాయపడ్డారు. అత్యంత భయంకరమైన విషయం ఏమిటంటే, దాదాపు 50 వేల మంది ఆచూకీ గల్లంతైంది. వీరంతా కూలిపోయిన భవనాల శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని, సహాయక చర్యలు కష్టతరంగా మారాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐక్యరాజ్యసమితి తాజా అంచనాల ప్రకారం, ఈ ప్రకృతి విపత్తు వల్ల వెనిజువెలాకు సుమారు 6.7 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.63,000 కోట్లు ప్రత్యక్ష నష్టం వాటిల్లింది. పరోక్ష ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ నష్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న దేశానికి, ఇప్పుడు తోడైన ఈ భారీ ఆర్థిక భారం కోలుకోవడానికి దశాబ్దాల సమయం పడుతుందని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు వెనెజులాలో విషాదం కొనసాగుతుండగా, అటు దక్షిణ ఫిలిప్పీన్స్‌లోనూ భూకంపం కలకలం రేపింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.7గా నమోదైనట్లు అమెరికన్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూకంప కేంద్రం సముద్ర గర్భంలో ఉండటంతో భారీ విధ్వంసం తప్పినట్లు భావిస్తున్నారు. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ ప్రాంతంలో ఉండటం వల్ల ఫిలిప్పీన్స్‌లో భూకంపాలు తరచూ సంభవిస్తుంటాయని, అయినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వెనెజులాలో సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు అంతర్జాతీయ దేశాల నుంచి సాయం అందుతున్నప్పటికీ, మౌలిక సదుపాయాల కొరత పెద్ద సవాలుగా మారింది. ప్రపంచదేశాల్లో కొన్నిచోట్ల భూప్రకంపనలు కూడా సంభవించాయి. ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్‌లలో కూడా భూమి కంపించింది. వీటిప్రభావం భారత్‌లోని జమ్ముకాశ్మీర్, ఢిల్లీ రాజధాని ప్రాంతంలోకూడా కనిపించింది. ఈశాన్య ఆఫ్ఘనిస్తాన్‌లోని జర్మ్ ప్రాంతం దక్షిణాన 43 కిలోమీటర్ల దూరంలో ఈ భూమి కంపించింది. కాబూల్, ఖోస్త్, నంగర్‌హార్ ప్రాంతాల్లోను ఈప్రభావం పడింది. ఇస్లామాబాద్, స్వాత్, హందు, ఉత్తర వజీరిస్తాన్, చిత్రాల్, రావల్పిండి ప్రాంతాల్లోకూడా భూప్రకంపనలు సంభవించడంతోప్రజలు భీతిల్లిపోయారు.

# 15 నుంచి కొత్త హెల్త్‌స్కీం

>> సంబంధించిన సమగ్ర నిబంధనలను వారం రోజుల్లో విడుదల చేయనున్నారు. ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్ట్ తొలిసమావేశం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు అధ్యక్షతన శనివారం సచివాలయంలో జరిగింది. సమావేశంలో పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. అందులో భాగంగా జులై 15 నుండి నూతన ఆరోగ్య పథకం ప్రారంభించనున్నారు. వారం రోజుల్లో సమగ్రమైన నిబంధనలు విడుదల చేస్తారు. భార్య, భర్తల్లో ఒకరి నుంచి మాత్రమే చందా మినహాయింపు చేయనున్నారు. గతంలో అదనంగా మినహాయించిన మొత్తాని తిరిగి చెల్లించడానికి త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనున్నారు. వారం రోజుల్లో హాస్పిటల్ యాజమాన్య ప్రతినిధులతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ట్రస్ట్ సభ్యుల సమావేశం జరగనుంది. తదుపరి జరిగే ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్ట్ సమావేశంలో ఉద్యోగులు, పెన్షనర్లకు అందించే చికిత్సలకు సంబంధించిన ప్యాకేజి రేట్లు, హాస్పిటల్స్ జాబితాను ఫైనల్ చేయనున్నారు.

# నేడు పల్స్ పోలియో

>> వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించేలా చర్యలు తీసుకున్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయనుండగా, మిగిలిపోయిన చిన్నారులకు ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేసేందుకు ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలియో చుక్కల కోసం రాష్ట్రవ్యాప్తంగా 22,979 పోలియో బూత్‌లు, 903 మొబైల్ బృందాలు, 903 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. సుమారు 40.97 లక్షల మంది 0-5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకోసం 52.04 లక్షల బీవోపీవీ టీకా డోసులు జిల్లాలకు సరఫరా చేశారు. పోలియో చుక్కల కార్యక్రమంలో 8,393 ఏఎన్ఎంలు, 27,181 ఆశా కార్యకర్తలు, 34,442 అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు. వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

# 'సర్' ఆగదు..

>> కూడా ఎన్నికల సంఘం స్వతంత్రంగా నిర్వహించే సాధారణ పరిపాలనా ప్రక్రియ అని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కల్పించాలి. అదే సమయంలో అర్హత లేని వ్యక్తులు, చనిపోయిన వారి పేర్లు, డూప్లికేట్ పేర్లు లేదా సరైన ఆధారాలు లేని నమోదులు ఓటర్ల జాబితాలో ఉండకూడదన్నది సర్ ప్రక్రియ ఉద్దేశ్యమన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు కూడా అనేక సందర్భాల్లో స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలి. అందరూ స్వచ్ఛందంగా ఈ సర్ ప్రక్రియలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలు కావచ్చు, అసెంబ్లీ ఎన్నికలు కావచ్చు, పార్లమెంట్ ఎన్నికలు కావచ్చు, ప్రతి ఎన్నికకు సంబంధించిన ఓటర్ల జాబితా ఖచ్చితంగా ఉండాలని చెప్పారు. డూప్లికేట్ ఓట్లు లేకుండా ఉండాలి. అర్హత కలిగిన ఒక్క వ్యక్తి కూడా ఓటు హక్కు కోల్పోకూడదు.

ప్రజాస్వామ్యం సక్రమంగా నడవడానికి ఇది అత్యంత అవసరం అని చెప్పారు. సర్ ప్రక్రియ జరిగిన రాష్ట్రాల్లో పోలింగ్ శాతం కూడా పెరిగినట్లు మనం గమనించాం. ఎందుకంటే ఈ ప్రక్రియ ద్వారా ప్రతి ఓటరు చైతన్యవంతమవుతున్నారని చెప్పారు.. తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో చూసుకుంటున్నారు. అవసరమైతే ఫార్మ్‌లు నింపుతున్నారు. దీనివల్ల పోలింగ్ రోజు ఓటు వేయాలనే బాధ్యత, అవగాహన మరింత పెరుగుతోందన్నారు. బీహార్, వెస్ట్ బెంగాల్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో కూడా సర్ తర్వాత పోలింగ్ శాతం పెరిగింది. దీనికి ప్రధాన కారణం ఓటర్లలో పెరిగిన అవగాహన, చైతన్యం అని పేర్కొన్నారు.



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

వరంగల్ : fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-6-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 148 పేజీలు: 8+16 వెల: 6.50



పదేకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా రక్షణ

భద్రాద్రి పునరుద్ధరణ పనులకు శ్రీకారం 5




## 15 నుంచి కొత్త హెల్త్‌స్కీం

వారంలో నిబంధనలు విడుదల

భార్య, భర్తల్లో ఒకరికి చందా మినహాయింపు

హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 27: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నూతన ఆరోగ్య పథకం జులై 15 నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు >>2



## నేడు పల్స్ పోలియో

రాష్ట్రవ్యాప్తంగా 22,979 పోలియో బూత్‌లు

సుమారు 40.97 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు

హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 27: నేడు(ఆదివారం) రాష్ట్ర వ్యాప్తంగా పోలియో చుక్కలు వేయనున్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని వారికి ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికి వెళ్లి వేసేలా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియోకార్య క్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని >>2

## హాలో జొనాథన్ బాగున్నావా!



శనివారం సీషెల్స్ బొటానికల్ గార్డెన్‌లో జొనాథన్ అనే తాబేలుకు ఆకులు తినిపిస్తున్న ప్రధాని మోడీ

### సీషెల్స్‌లో 194 యేళ్ల వృద్ధ తాబేలును పరామర్శించిన ప్రధాని

### ఆ దేశ జాతీయ వేడుకలకు హాజరు

**విక్టోరియా, జూన్ 27:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన సెషెల్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అతిథిని కలిశారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయసు భూచర జీవిగా గిన్నిస్ రికార్డుల్లోకెక్కిన జోనాథన్ అనే తాబేలును ఆయన సందర్శించారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ, ఈ సందర్భంగా అక్కడి జాతీయ బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించి ఈ అరుదైన జీవిని చూశారు. అంతేకాకుండా ఆ తాబేలుకు పచ్చటి మొక్కను కూడా తినిపించారు. సుమారు 194 ఏళ్ల వయసున్న జోనాథన్, 1832లో జన్మించినట్లు అంచనా. ప్రస్తుతం వయసు రీత్యా కంటిచూపు మందగించడం, వాసన శక్తి తగ్గడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ, అది ఆరోగ్యంగానే ఉంది. ఈ అల్డాబ్రా జాతికి చెందిన భారీ తాబేలు సెషెల్స్‌లో పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ పర్యావరణ పరిరక్షణకు చిహ్నంగా బొటానికల్ గార్డెన్స్‌లో ఒక మొక్కను నాటారు. >>2

# ప్రముఖుల భద్రత కట్



## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సహా 17 మంది బుల్లెట్ ప్రూఫ్ కార్లు రద్దు

### 300 మంది గన్‌మన్లు ట్రాఫిక్ విధులకు మళ్లింపు

### భద్రత తొలగించిన వారిలో పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బ్యూరోక్రాట్లు

### మావోయిస్టు బెడద లేనందువల్లే పోలీసు శాఖ తాజా నిర్ణయం

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** పోలీసు శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మావోయిస్టుల సమస్య పూర్తిగా సమసిపోయినం దున నక్సల్స్ కారణంగా భద్రత పొందుతున్న ప్రముఖుల్లో అనేక మందికి గన్‌మెన్లను పూర్తిగా తొలగించడం లేదా తగ్గించడం చేశారు. దీంతో పాటు నక్సల్స్ హిట్ లిస్టులో వున్న కారణంగా సర్కారు నుంచి ఏళ్ల తరబడి బుల్లెట్ ప్రూఫ్ కార్లు పొందిన వారిలో 17 మందికి ఈ కార్లను తొలగించారు. బుల్లెట్ ప్రూఫ్ కారు తొలగించబడ్డ వారిలో విశ్రాంత ఐపిఎస్అధికారి, బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా వున్నారు. అయితే ఆయనకు నలుగురు గన్‌మెన్లతో భద్రత కొనసాగించారు. కాగా ప్రముఖుల భద్రతకు ఇంతకాలం గన్‌మెన్లుగా వున్న 300 మందిని పోలీసు శాఖ ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ విధులకు తొలిసారిగా మళ్లించింది. దీంతో పాటు రాష్ట్రంలో సర్కారు కార్పొరేషన్లకు ఛైర్మన్లుగా నియమి తులైన వారు, మున్సిపల్ ఛైర్మన్లకు గన్‌మెన్ల కేటాయింపును పోలీసు శాఖ నిరాకరించింది. ఈ విషయంలో ఛైర్మన్ల వినతిని పోలీసు శాఖసు న్నితంగా తిరస్కరించింది. రాష్ట్రంలో ప్రముఖులకు భద్రత కల్పించేందుకు సంబంధించి నిఘా విభాగం ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశంలో ఈసారి సంచలన నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటి వరకు నక్సలైట్ల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 600 మందికి పైగా పోలీసు శాఖ నుంచి గన్‌మెన్లతో పాటు బుల్లెట్ ప్రూఫ్ కార్లు, ఇంటి వద్ద మెటల్ డిటెక్టర్లు, పర్యటనల సందర్భంగా రోడ్డు బందోబస్తు కోసం ప్రత్యేకంగా కొందరు సిబ్బందిని పొందేవారు. అయితే ఆపరేషన్ కగార్‌కారణంగా నక్సలైట్ల సమస్య పూర్తిగా కనుమరుగవడంతో ఇంతకాలం మావోయిస్టుల కారణంగా భద్రత పొందిన ప్రముఖుల విషయంలో పోలీసు శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్తర తెలంగాణతో పాటు హైదరాబాద్‌లో నివసించే ఆ ప్రాంతానికి చెందిన నేతలకు భద్రతను భారీగా రద్దు చేశారు. ఇప్పటి వరకు నలుగురు గన్‌మెన్ల భద్రత వున్న వారికి ఇద్దరు, ఇద్దరు వున్న వారికి ఒకరు కేటాయించగా కొందరికి పూర్తిగా తొలగించారు. భద్రత తొలగించిన వారిలో మాజీ ఎంఎల్ఎలు, ఎంపిలతో పాటు విశ్రాంత పోలీసు అధికారులు, బ్యూరోక్రాట్లు వున్నారు. గతంలో ఎంఎల్ఎలు కానీ వారు కూడా ఇద్దరు లేదా నలుగురు గన్‌మెన్ల భద్రత పొందేవారు. ఇప్పుడు వారికి వు న్న సౌకర్యాన్ని పూర్తిగా రద్దు చేశారు. ఇక ప్రముఖుల భద్రతలో కీలకంగా వున్న బుల్లెట్ ప్రూఫ్ కార్ల విషయంలోనూ పోలీసుశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 17మందికి ఇప్పటివరకు వున్న బుల్లెట్ ప్రూఫ్ కారు సౌకర్యాన్ని ఉపసంహా >>2



వారం రోజులు

## భారీ వర్షాలు!

పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించి చాలా రోజులు అవుతున్నా ఆ స్థాయిలో మాత్రం వర్షాలు పడటం లేదు. ఫలితంగా ఎండ, ఉక్కపోత, వేడి అలాగే ఉన్నాయి. నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా విస్తరిస్తుండటంతో వర్షాలు పడటం లేదు. ఈ నేపథ్యంలోనే తాజాగా వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో వారం రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు >>2



## 500 నగరాలకు భారత్ ట్యాక్సీ విస్తరణ

### -కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**అహ్మదాబాద్, జూన్ 27:** రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో భారత్ ట్యాక్సీ దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాబోయే రెండు సంవత్సరాల్లో దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాల్లో ఈ సహకార మొబిలిటీ ప్లాట్‌ఫామ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శనివారం గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూవీలర్లు, ఆటోరిక్షాలు, ఫోర్ వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తున్న ఈ ప్లాట్‌ఫామ్, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టిందన్నారు. ఈ సంస్థ జాతీయ విస్తరణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. విస్తరణ ప్రణాళికల గురించి వివరిస్తూ రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్ల లోపు, మేము 500కు పైగా నగరాలకు చేరుకుంటామన్నారు. జులై 31వ తేదీలోగా నాగ్‌పూర్, పుణే, ముంబై, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా వంటి ఏడు కీలక నగరాల్లో సేవలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. భారత్ ట్యాక్సీ ప్రత్యేకత సహకార నమూనా అని అమిత్ షా తెలిపారు. ఇందులో డ్రైవర్లు కేవలం కాంట్రాక్టర్లుగా కాకుండా సంస్థలో వాటాదారులుగా, సభ్యులుగా ఉంటారని ఆయన >>2

# 'విబిజి'పై సుప్రీంకు!



శనివారం హైదరాబాద్‌లో జరిగిన కేబినెట్ సబ్ కమిటీ భేటీలో మంత్రులు ఉత్తమ్, సీతక్క

### కర్ణాటక, కేరళతో కలిసి ఉమ్మడి పోరాటం

### ఉత్తమ్ అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ నిర్ణయం

### జులై 2న కేబినెట్ సమావేశంలో కమిటీ సిఫారసులపై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్27:** గ్రామీణ పేదల జీవనోపాధికి వెన్నెముకగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, రాష్ట్రాల అధికారాలను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వీబీజీ రామ్‌జీ చట్టం-2025ను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ యథాతథంగా అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ రెండో సమావేశంనిర్వహించారు. రాష్ట్ర పంచాయ తీరాజ్ శాఖామంత్రి దనసరి అనసూయ సీతక్కతో పాటు వీడియో >>2



శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో హరీష్‌రావు

## నీటి మంత్రి పనికి రాడా?

### ఆయన్ని బయట కూర్చో బెట్టేంత సీక్రెట్ ఏముంది?

### తెలంగాణ నీటి హక్కులు హరిస్తుంటే చూస్తూ ఊరుకోం: హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్27:** తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన చర్చల వివరాలు ప్రజల ముందు పెట్టాలని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ముగ్గురు సీఎంల మీటింగ్‌లో ఉత్తమ్ కుమార్ రెడ్డిని బయట కూర్చోబెట్టారు. తెలంగాణ నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కూడా బయట కూర్చోబెట్టే అంత సీక్రెట్ ఏముంది దాంట్లో.. ?మన తెలంగాణ ఇంజినీర్లు, మన ఈఎన్సీని కూడా లోపలికి ఎందుకు రానివ్వలే అని ప్రశ్నించారు. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జరిగిన చర్చల వివరాలు ప్రజల ముందు పెట్టాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఇంజినీర్లను, నీళ్ల మంత్రిని బయటపెట్టి మీ ముగ్గురు సీక్రెట్‌గా గంట సేపు ఏం మాట్లాడుకున్నరో ఆ వివరాలేంటో తెలంగాణకు జరిగే ప్రయోజనం ఏంది..? తెలంగాణకు మన హక్కులు కాపాడేందుకు మీరు చేసిన కృషి ఏందో చెప్పాలని రాష్ట్ర ప్రజల పక్షాన మేం అడుగుతున్నామన్నారు. తెలంగాణకు ఆర్డీఎస్ ప్రాజెక్టుకు 15.9 టీఎంసీల నీళ్లు రావాలి కానీ రావడం లేదని హరీశ్ రావు అన్నారు. నువ్వు కర్ణాటక మీటింగ్‌లో మాకు ఆర్డీఎస్ ప్రాజెక్టు ద్వారా 15.9 టీఎంసీల నీళ్లు రావాలని కేంద్ర మంత్రిని అడిగావా లేదా రేవంత్ రెడ్డి..? ప్రశ్నించారు. తుంగభద్ర మీద కర్ణాటక కడుతున్న 3 బ్యారేజీల వల్ల తెలంగాణకు నష్టం జరుగుతుందని వాటిని అడ్డుకోవడానికి ఏమైనా స్పష్టమైన హామీ పొందావా..? చెప్పాలన్నారు. తుంగభద్ర మీద బ్యారేజీలు కడుతున్నాం దీనికి మీరు ఎలాంటి అడ్డంకి చెప్పొద్దని కర్ణాటక అడిషనల్ చీఫ్ సెక్రటరీ మన ఇరిగేషన్ కార్యదర్శికి లేఖ రాస్తే దానికి మీరు ఏం సమాధానం ఇచ్చారు. ఈ బ్యారేజీలు స్టార్ట్ చేసి సంవత్సరం అవుతున్నా ఇంతవరకి తెలంగాణ ప్రభుత్వం ఆబ్జెక్షన్ కూడా చెప్పలేదన్నారు. తెలంగాణను పోరాడి >>2



## ప్రముఖ దర్శకుడు భాగ్యరాజ్ కన్నుమూత

### బహుభాషా నటుడు, రచయితగా గుర్తింపు

### నివాళులర్పించిన తమిళ సిఎం విజయ్, సినీ పరిశ్రమ ప్రముఖులు

**చెన్నై,జూన్ 27:** భారతీయ సినీ పరిశ్రమలో అద్భుతమైన కథా రచయితగా,తమిళ సినీరంగంలో దిగ్గజదర్శకుడు, నటుడిగా గుర్తింపుపొందిన కె.భాగ్యరాజ్ శనివారం చెన్నైలో కన్నుమూశారు. >>2


'గోల్డ్‌మాన్' సూర్యభాయ్ అరెస్టు.. చంచల్‌గూడ జైలకు

6

కామారెడ్డి జిల్లాలో కులబహిష్కరణ కలకలం


# 'సర్' ఆగదు..

## దానివల్లే పోలింగ్ శాతం పెరిగింది

### గతంలో కాంగ్రెస్ కూడా చేసింది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్27:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా, విశ్వసనీయంగా మార్చే అత్యంత కీలకమైన కార్యక్రమం అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలకు పాల్పడినా సమగ్ర ఓటరు జాబితా సవరణను అడ్డుకోలేరని తేల్చి చెప్పారు. ఇది కొత్తగా మొదలైన ప్రక్రియ కాదు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా అనేకసార్లు ఈ ప్రక్రియ నిర్వహించారని, ఇది ఏ ప్రభుత్వానికో, ఏ రాజకీయ పార్టీకో సంబంధించిన అంశం కాదు. ఇది పూర్తిగా భారత ఎన్నికల సంఘం నిర్వహించే రాజ్యాంగబద్ధమైన, స్వతంత్ర ప్రక్రియ అని చెప్పారు. శనివారం ఆయన బిజెపి రాష్ట్ర కార్యాలయలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ అనేది నిరంతరం కొనసాగాల్సిన చట్టబద్ధమైన ప్రక్రియ. ప్రత్యేక విస్తృత సవరణ (సర్) >>2

# వెనెజులాకు 63 వేల కోట్ల నష్టం



### వరుస భూకంపాలతో కునారిల్లిన ప్రజలు

### అఫ్ఘాన్, పాక్, భారత్‌లోనూ కంపించిన భూమి

**కారకాస్,జూన్ 27:** తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభాలతో సతమతమవుతున్న వెనెజులా దేశాన్ని వరుస భూకంపాలు కోలుకోలేని దెబ్బతీశాయి. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం రిక్టర్ స్కేల్‌పై 4.9 తీవ్రతతో మరో భూకంపం సంభవించడంతో ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని గజగజ వణికిపోయారు. రాజధాని కారకస్, మరాకే నగరాల సమీపంలో భూమి కంపించడంతో ఇప్పటికే శిథిలాల అంచున ఉన్న భవనాలు మరింత దెబ్బ తిన్నాయి. తొలుత వచ్చిన జంట భూకంపాల విధ్వంసం వెనెజులా చరిత్రలోనే అతిపెద్ద విపత్తుగా నిలిచింది. తాజా భూకంపంతో ఆ దేశంలో పరిస్థితులు అత్యంత దయనీయంగా మారాయి. ఐక్యరాజ్యసమితి అంచనాలప్రకారం ఇప్పటికే వెయ్యిమంది మృతిచెందగా, 50 వేలమందికిపైగా గల్లంతయినట్లు బావిస్తున్నారు. దక్షిణ అమెరికా దేశానికి ఈ భూకంపాలకారణంగా సుమారు 63 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఐక్యరాజ్యసమితి అంచనావేసింది. దేశంలోని కారకస్ నగరం, లా గువేరా రాష్ట్రం ఇప్పుడు శిథిలాల దిబ్బలుగా మారాయి. రెస్క్యూ ఆపరేషన్‌కు తాజా ప్రకంపనలు >>2

ప్రపంచ వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేసేసహజ ప్రక్రియల్లో ఎల్‌నినో ఒకటి. ఈ పరిస్థితి వచ్చినప్పుడు ప్రపంచంలోని అనేక దేశాల్లో ఉష్ణోగ్రతలు, వర్షపాతం నమూనాల్లో మార్పులు సంభవిస్తాయి. రాబోయేకొద్ది వారాల్లో ప్రపంచ వాతావరణాన్ని సమూలంగా మార్చేయగల సూపర్ ఎల్‌నినో ముంచుకొస్తోందని ఐక్యరాజ్య సమితి తీవ్ర స్థాయిలో హెచ్చరించింది. ఇప్పటికే గ్లోబల్ వార్మింగ్ కారణంగా వేడెక్కిన భూ మండలంపై ఈ ఎల్‌నినో ప్రభావం మరింత వినాశకరంగా ఉండనుందని వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దశాబ్దాల కాలంలో ఎన్నడూ చూడని స్థాయిలో ఈసారి సూపర్ ఎల్‌నినో ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వాతావరణ మార్పులను తీసుకురావచ్చని ప్రపంచ వాతావరణ సంస్థ స్పష్టంచేసింది. ప్రస్తుతం భారతదేశంలో రుతుపవనాలపైదీని ప్రభావం ఎక్కువగా ఉండేఅవకాశం ఉంది. ఇప్పటికే దేశంలో ఎల్‌నినో పరిస్థితులు ప్రారంభమైనట్లు భారత వాతావరణశాఖ ధృవీకరించింది. ఈ పరిస్థితులు రాబోయే నెలల్లో (నవంబర్, డిసెంబర్) మరింత బలపడే అవకాశం ఉందనిహెచ్చరించింది. పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పుప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటేఎక్కువగా పెరగడం వల్లఏర్పడే వాతావరణ పరిస్థితి వస్తుంది. ఈ ఉష్ణోగ్రతల మార్పు ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ,వర్షపాతం,ఉష్ణోగ్రతలను ప్రభావితం చేస్తుంది. సాధారణంగా ప్రతి 2నుంచి 7॥కు ఒకసారి ఈ ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడేఅవకాశం ఉంటుందని వాతావరణ నిపుణులు చెప్తున్నారు.ఈఎఫెక్ట్‌వల్ల దేశంలో నైరుతిరుతుపవనాలు సాధారణం కంటే బలహీనంగా ఉంటాయి. దీంతో కొన్నిప్రాంతాల్లో వర్షపాతం తగ్గే సాధారణంకంటే ఎక్కువ వేడి నమోదవుతుంది.వర్షాలు తగ్గితే సాగునీటి కొరతఏర్పడి పంటల దిగుబడిపై ప్రభావం పడవచ్చు.

# ముంచుకొస్తున్న సూపర్ ఎల్‌నినో

**సిహెచ్.వి.వి.రఘుబాబు**

మధ్య పసిఫిక్ మహాసముద్రంలో కొనసాగుతున్న ఎల్‌నినో ప్రభావం కారణంగా భారతదేశంలో నైరుతి రుతుపవన కాలం ఇప్పటికే తీవ్ర లోటుతో ప్రారంభమైంది. ఈ ప్రభావం ఇప్పట్లో తొలగిపోయేలా కనిపించడం లేదు. ఈ వాతావరణ మార్పులు 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉంది. ఎల్‌నినో ఈ సుదీర్ఘ ప్రభావం మత్స్య పరిశ్రమ, బంగాళాఖాతం, అరేబియా సముద్రాల స్థితిపై ప్రభావం చూపడమే కాకుండా, తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుందనే హెచ్చరికలు జారీ అయ్యాయి. భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం (ఇన్‌కోయిస్) తన తన మొట్ట మొదటి ఎల్‌నినో బులెటిన్‌లో, ఎల్‌నినో 'జూన్ 2026నుండి ఫిబ్రవరి 2027 వరకు' ఆధిపత్యంలో కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. అయితే ఎల్‌నినో సదరన్ ఆసిలేషన్ పరిస్థితులు తటస్థ దశకు తిరిగి రావడానికి 10నుండి 30 శాతం అవకాశం ఉందని ఇన్‌కోయిస్ చెబుతోంది. ఎల్‌నినో వేసవికాలం వరకు కొనసాగడం అనేది, ఆ తర్వాత వచ్చే రుతుపవనాలకు కూడా వర్తిస్తుందని తెలిపింది. సముద్రంలోనూ, వాతావరణ వ్యవస్థలలోనూ పరిస్థితులు అంత త్వరగా మారవని, కచ్చితంగా ఏమీ చెప్పలేనప్పటికీ, 2027 రుతుపవన కాలం కూడా దెబ్బతినే అవకాశాన్ని కొట్టిపారేయలేం అని పేర్కొంది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల వల్ల ఇది చాలావరకు సంభవించే అవకాశం ఉందని వెల్లడించింది.జూన్ 2026 నుండి ఫిబ్రవరి 2027 వరకు ఉన్న అంచనా కాలంలో, ఎల్‌నినో ప్రధానమైన తీవ్ర దశగా ఉంటుందని భావిస్తున్నారు. ఎల్‌నినో కొనసాగడంవల్ల ఉత్తర హిందూ మహాసముద్రం అంతటా సముద్ర పరిస్థితులు ప్రభావితం అవుతాయని అంచనా వేసింది. దీని ఫలితంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం, పైసముద్రపు పొరల్లో ఉష్ణం అధికమవడం, పొరల విభజన బలపడటం, సముద్ర ఉష్ణ తరంగాలు సంభవించే అవకాశం పెరగడం వంటివి జరుగుతాయని స్పష్టం చేసింది. ఈ పరిస్థితులు బంగాళాఖాతం, అరేబియా సముద్రంలోని సముద్ర జీవావరణ వ్యవస్థలు, మత్స్య సంపద, తీరప్రాంత పర్యావరణాలను ప్రభావితం చేయవచ్చని పేర్కొంది. దీని ప్రభావంతో రాబోయే చేపల వేటకాలంలో బంగాళాఖాతంలో అధిక గాలులు, సముద్ర పరిస్థితులు ఏర్పడవచ్చని అంచనా వేస్తోంది. సముద్రం వేడెక్కడం వల్ల కొన్ని తీవ్రమైన వాతావరణ సంఘటనలు సంభవించవచ్చు, అదే సమయంలో తీవ్రమైన వాతావరణ పరిస్థితులలో తీరప్రాంతాలు స్థానికకోత, వరదలు, తుఫాను ఉప్పెన ప్రభావాలను కూడా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. అయితే హిందూ మహాసముద్రంలో పాజిటివ్ ఐఓడీ ఏర్పడే అవకాశాలున్నాయి. ఇదే నిజమైతే, పసిఫిక్‌లో ముంచుకొస్తున్న ఈ సూపర్ ఎల్‌నినో సృష్టించబోయే విధ్వంసాన్ని, నష్టాన్ని పాజిటివ్ ఐఓడీ కొంతవరకు అడ్డుకుని, భారతదేశానికి రక్షణ కవచంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంటోంది. పర్యవసానంగా జూలైలో సానుకూల ఐఓడీఏర్పడే అవకాశం ఉందని, ఇది దేశంలోని రుతుపవన వర్షపాతంపై సూపర్ ఎల్‌నినో చూపే ప్రతికూల ప్రభావాలను కొంతవరకు తగ్గించడంలో సహాయపడవచ్చని పేర్కొంది. రాబోయే కాలంలో పసిఫిక్, హిందూ మహాసముద్రాలలో మారబోయే ఈ వాతావరణ పరిస్థితులను నిరంతరం నిశితంగాగమనిస్తూ, ప్రతి నెలా అప్‌డేట్స్ ఇస్తామని భారత వాతావరణ శాఖ దేశ ప్రజలకు, రైతులకు స్పష్టం చేసింది.మరోపక్క దేశవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న తరుణంలో భారత వ్యవసాయ రంగాన్ని ఎల్‌నినో భయం వణికిస్తోంది. జూన్1నుంచి జూన్26 వరకు దేశవ్యాప్తంగా సాధారణం కంటే 38 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. కేరళలోకి జూన్ 4నప్రవేశించిన నైరుతి రుతు పవనాలు ఆ తర్వాత మందగించి, దేశ మధ్య భాగంలో స్తంభించిపోవడం వల్లే ఈ తీవ్రలోటు ఏర్పడింది. దేశంలో అత్యధికంగా సుమారు 60శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైంది.కొన్ని రాష్ట్రాల్లో, ముఖ్యంగా మహారాష్ట్రలో 76 నుండి 85శాతం వరకూ, గుజరాత్‌లో 84 వరకు తక్కువవర్షపాతం కురిసింది. ఈ విధంగా



మారు తున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సుమారు 9నుండి 10రాష్ట్రాలపై ఈ సారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండబోతోందన్న ముందస్తు అంచనాలతో కేంద్రం అప్రమత్తమైంది. వర్షాభావ పరిస్థితులు ఎదురైతే రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు వీలుగా ముందే ప్లాన్ బి (పత్యమ్నాయ ప్రణాళిక)ను సిద్ధం చేస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లోఎల్‌నినో కారణంగా తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉన్న 9నుండి 10రాష్ట్రాను కేంద్రం గుర్తించింది. వీటిలో తెలంగాణతో పాటు,ఆంధ్రప్రదేశ్,కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్,రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా, బీహార్ రాష్ట్రాల్లోని దాదాపు 326 జిల్లాల్లో వర్షపాతం తగ్గవచ్చని, పంట నష్టం జరగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కేంద్రం ఆయా రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. వాతావరణం అనుకూలించని పక్షంలో రైతులకు సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రత్యమ్నాయ మార్గాలను చూసే బాధ్యతను జిల్లా యంత్రాంగాలు, వ్యవసాయ శాఖలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, విస్తరణాధికారులకు అప్పగించింది. ఎల్ నినో సవాల్‌తో కూడిన ఖరీఫ్ సీజన్‌ను విజయవంతంగా అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్రాల మధ్య నిరంతర సమన్వయం అవసరమని భావిస్తోంది. క్షేత్ర స్థాయి నుండి ప్రతీ వారం నివేదికలు, రైతుల నుండి ఫీడ్‌బ్యాక్‌ను సేకరించాలని నిర్ణయించింది. వర్షపాతం తక్కువగా ఉండే ప్రాంతాల్లో నీటి పరిరక్షణ, భూమిలో తేమ నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. మల్చింగ్ పద్ధతులు, అంతర పంటల సాగు, స్థానిక వాతావరణ పరిస్థితులకు తట్టుకునే ప్రత్యామ్నాయ పంటల రకాలను ప్రోత్సహించాలని తెలిపింది. ఇదే సమయంలో భారత దేశం పప్పుధాన్యాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు పప్పుధాన్యాల స్వయం సమృద్ధి మిషన్ కింద కేంద్రం కసరత్తు చేస్తోంది. ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో దేశీయంగా పత్తి, పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా కంది, మినుము, పెసర పంటల సాగును విస్తరింప చేయాలని, పంటల మార్పిడి పద్ధతులను పెంచడతో పాటు, రైతులకు నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సహాయం అందించాలని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. ఇక వర్షాలు తక్కువగా ఉన్నప్పటికీ ఎరువుల కొరత రాకుండా కేంద్రం ముందస్తు చర్యలు చేపట్టింది. అయితే రుతుపవనాల గమనాన్ని బట్టి స్థానికంగా ఎక్కడైనా కొరత ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడికి ముందే ఎరువుల స్టాక్‌ను చేర్చే ఏర్పాట్లు చేస్తోంది. అంతేకాకుండా దేశంలోని జలాశయాల నీటి మట్టాలు, మార్కెట్ ధరలపై కూడా నిరంతర నిఘా ఉంచింది. వాతావరణ ముప్పులను ముందే అంచనా వేస్తూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించడం ద్వారా ఖరీఫ్ పంటను, రైతుల ఆదాయాన్ని కాపాడవచ్చని కేంద్ర వ్యవసాయ శాఖ భరోసా ఇస్తోంది.

---

# రామా! ఇంత స్కామా?

ఉత్తర ప్రదేశ్

**ఎ.వి.వి ప్రసాద్**

రామ రామా! సాక్షాత్తు అయోధ్య రాముడు కొలువైన పవిత్ర ఆలయంలోనే ఇంత పెద్ద కుంభకోణమా? దేశ ప్రజలందరిని నివ్వెరపరుస్తున్న ప్రశ్న ఇది. ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్ర పరిధి నుంచి పక్కకు జారుతున్నాయనే అనుమానం అందరిలో పెరుగుతోంది. ఏవోచిన్న ఆలయాల్లో కొందరు ఏవో చిల్లర పనులు చేశారంటేనే ఎంతో ఆగ్రహం కలుగుతుంది. కానీ అనంతపద్మనాభుడు, శబరిమల, ఇంద్రకీలాద్రి, తిరుమల, సింహాచలం వంటి అతిపెద్ద పుణ్య క్షేత్రాలలో సైతం అవినీతి కార్యకలాపాలేనా? అందుకు కారణమైన దోషులను ఏ 'దేవుడు' రక్షిస్తున్నాడు? విచారణలు ఎందుకు తేలడం లేదు? కల్తీ నెయ్యి కుంభకోణం నుంచి తిరుమల ఇంకా బయటపడక ముందే అయోధ్యలోకోట్లాది రూపాయల విరాళాల కుంభకోణం ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. కొన్ని శతాబ్దాల కల రెండు సంవత్స రాల క్రితం సాకారమై బాలరాముడు అయోధ్య లో కొలువుదీరినప్పుడు ప్రపంచంలోని ఆధ్యాత్మిక వాదులందరి హృదయాలు ఎంతోపులకించాయి. అప్పటినుంచి అయోధ్యకు భక్తుల ప్రవాహం పోటెత్తింది. వారి నుంచి ఆలయానికి లభించే విరాళాలు కూడా అదే స్థాయిలో వెల్లువెత్తాయి. వెండి, బంగారు ఇటుకలు, వజ్రాల హారాల వంటి అతి విలువైన కానుకలు అధిక సంఖ్యలో సమకూరాయి.నగదు విరాళాలకు ఇక లెక్కేలేదు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయ కార్యకలాపాలన్నీ సాగుతున్నాయి. రూపాయి నుంచి కోట్ల వరకు ఆదాయంవచ్చినా, ఖర్చు జరిగినా ట్రస్టు నిర్వాహకులదే బాధ్యత. అయితే నిధుల దుర్వినియోగంపై ఇన్ని ఆరోపణలు వస్తున్నా ట్రస్టు నుంచి ఇప్పటిదాకా సరైన వివరణే రాకపోవడం ఆశ్చర్యకరం. ఈనెల మొదటి వారంలో సమాజ్‌వాదీపార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ చేసిన ఆరోపణలతో కదిలిన డొంక ఇప్పుడు పలువురు కీలక వ్యక్తుల మెడకు చుట్టుకొనేట్లు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ వ్యవహారాన్ని ఒక సవాలుగా స్వీకరించి దోషులను పట్టుకొనేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. ఆ బృందం రెండు వారాల వ్యవధిలోనే ప్రాథమిక నివేదిక సమర్పించింది. దాని ప్రకారం 17 మంది నిందితులను గుర్తించి వారిలో 8 మందిని ఇప్పటి దాకా అరెస్టు చేశారు. అయితే అరెస్టయినవారందరు చిన్న 'సేవాదార్లు' మాత్రమే. అసలు 'ఇంటి దొంగలు' వేరేఉండవచ్చు. వారు సిట్ నిఘా నేత్రంలోకి వచ్చారో లేదో ఇంకా తెలియవలసి ఉంది. వందల కోట్లు చేతులు మారినట్లుగా ఆరోపణలున్న ఈ కుంభకోణంలో చాలామంది కీలక వ్యక్తులే ఉన్నారని విపక్ష నేతలు చేస్తున్న ఆరోపణలను కూడా కొట్టివేయడానికి లేదు. ట్రస్టు అధిపతిగా ఉన్న చంపత్ రాయ్‌కి చాలా సన్నిహితుడైన టిన్నూ యాదవ్ ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా చెబుతున్నారు. రామాలయంలోని విరాళాల లెక్కింపు గదిలో



అయోధ్య ఆలయం

మొదలైన చేతివాటం బ్యాంకు అకౌంట్‌లలోని డబ్బు మాయం చేసే దాకా వెళ్లిందంటే దాని వెనుక కేవలం కొందరు చిరు ఉద్యోగులే ఉన్నారనుకోలేం. సిసిటీవీ కెమెరాలకు కూడా చిక్కకుండా కథ నడిపించారంటే అది చిన్న ఉద్యోగులు చేసిన పనికాదనే అనిపిస్తుంది. ఇదంతా ఒకటి రెండు రోజుల్లో జరిగింది కూడా కాదు. 2024లో బాలరాముని దర్శనాలు ఆరంభమైనప్పటి నుంచి ఈ రాకెట్ నడుస్తోందని సిట్ చెబుతోంది. టిన్నూ యాదవ్‌తో పాటు సుభాష్ శ్రీవాస్తవ, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, అవినాశ్ శుక్లా, మనీష్ యాదవ్, కరుణేశ్ పాండేలను వివిధ నేరాల కింద అరెస్టు చేశారు. ఆలయ అంతర్భాగంలోని ఆభరణాల పెట్టెలు చాలావరకు ఇప్పటికే ఖాళీ అయ్యాయిట.కోట్లాది రూపాయల విరాళాలకు రసీదులే లేవు. రోజుకు సగటున పదిలక్షల రూపాయల విరాళాలువస్తుండగా అధికశాతం లెక్కల్లోకే రావడం లేదట. రెండేళ్ల క్రితం నిరుద్యోగులుగా చేరిన కొందరు ఇప్పుడు మిలియనీర్లయ్యారట.ఇవన్నీ సిట్ దర్యాప్తులో తేలిన అంశాలు. ఆలయ నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా దేశవిదేశాల నుంచి వెండి బంగారం కానుకలు వస్తూనే ఉన్నాయనీ, అవి ఎవరి ఇంటిలో గోడలుగా మారుతున్నాయోఇంకా తేలవలసి ఉందనీ సిట్ అధికారులేఅంటున్నారు. తవ్వేకొద్దీ ఎన్నోఅక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎంతో భక్తి విశ్వాసాలతో కొన్ని లక్షల మంది రోజూ సందర్శించే క్షేత్రం వారిలో తగినంత విశ్వసనీయతను కలిగించలేకపోతోందంటే పాలక వర్గాన్ని ఏమనాలి! దాదాపు రూ.200 కోట్ల కుంభకోణం జరిగినట్లు తెలుస్తుండగా, ఇప్పటిదాకా రికవరీ 78 లక్షలే అయిందట. నిధుల దుర్వినియోగం ఆరోపణలు వచ్చినప్పటి నుంచి ఎక్కువగా విమర్శల పాలైన వ్యక్తి ట్రస్టు చీఫ్ అయిన చంపత్ రాయ్. ఆయనకు చాలా సన్నిహితుడైన ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రా. సిట్ ఎఫ్ఐఆర్ దాఖలు చేయగానే శుక్ర వారం వారిద్దరూ రాజీనామా చేయడం కలకలం సృష్టించింది. వారి రాజీనామాలతో సమస్యకు పరిష్కారం దొరికినట్లు కాదు.మాయమైన సొమ్ముకు కొందరు సిబ్బంది బాధ్యులయినట్లుగానే, అసలు లెక్కల్లోకి రాని కొన్ని కోట్ల నగదు, కానుకల వివరాలు ట్రస్టు చీఫ్ నుంచే తెలియవలసిఉంది. యోగి ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడంపైనే విచారణ తీరు ఆధారపడి ఉంటుంది. వచ్చే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలకు యుపి సిద్ధమవుతోంది. ప్రభుత్వానికి అయోధ్య చాలా ప్రతిష్టాత్మక విషయం గనుక స్కాం దోషులను ప్రభుత్వం బోను ఎక్కించగలదనే అనుకోవాలి. మరి కొన్ని రోజుల్లో సిట్ సమర్పించే తుది నివేదికలో ఇంకెందరి జాతకాలు బయటపడతాయో, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకొంటుందో చూడాలి. ఆలయాలు భక్తుల్లో విశ్వాసాన్ని పెంపొందించే విధంగా ట్రస్టు బోర్డులు వ్యవహరిస్తేనే వాటి పవిత్రత కలకాలం నిలిచి ఉంటుందని గ్రహించాలి.

---

# బ్రిటన్ గద్దెపైనే 'ఆండీ' ఫోకస్

బ్రిటన్

**గన్ని మోహన్**

ఒకప్పుడు తన ఆధిపత్యంతో అమెరికాకు పోటీగా ప్రపంచ దేశాలను ఏలిన దేశం. రాజరిక వ్యవస్థ ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలు కుప్పకూలిపోతున్నాయి. ఐరోపా కూటమి నుంచి వైదొలిగినప్పటి నుంచి ఆ దేశానికి అన్నీ సమస్యలే. ఆర్థిక సంక్షోభం, ప్రజల్లో పెల్లుబుకుతున్న నిరసన, జీవన వ్యయ సంక్షోభం వంటి సమస్యలు ఆదేశాన్ని పట్టిపీడిస్తున్నాయి.ఒకప్పుడు దేశాలను తమ చెప్పుచేతుల్లో ఉంచుకుని ఆ దేశంపై పూర్తి పెత్తనం సాగించిన బ్రిటన్ ఇప్పుడు రాజకీయ, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఒక్క పదేళ్లకాలంలోనే ఆరుగురు ప్రధానులు రాజీనామాలు చేయాల్సి వచ్చింది. ఎన్నికల్లో గెలిచిన లేబర్ పార్టీ ప్రధాని కీర్ స్టార్మర్‌కు సైతం ఈ గండం తప్పలేదు. ఈయూ నుంచి విడిపోవాలన్న బలమైన కోరిక వెలువడినప్పటి నుంచి బ్రిటన్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తిందనే చెప్పాలి. సంక్షేమ పథకాల్లో సంస్కరణలు, ఆర్థికవిధానాలపై లేబర్ పార్టీలో కూడా అంతర్గత విభేదాలు పొడసూపాయి. అమెరికా రాయబారి నియామకం కూడా విమర్శలపాలైంది. పీటర్ మండెల్సన్‌ను నియమించడం పై కీర్‌స్టార్మర్‌పై పాలకపక్షఎంపిలే మండిపడ్డారు. దీనికితోడు స్థానిక ఎన్నికల్లో లేబర్‌పార్టీ ఘోరంగా పరాజయం పాలవడం కూడా స్టార్మర్ ప్రతిష్టను దెబ్బతీసింది. దేశంలో అంతర్గతంగా నిర్వహించిన సర్వేల్లో కూడా కీర్‌స్టార్మర్‌పై ప్రజల్లో అసంతృప్తి ఎగిసిపడుతున్నట్లు తేలింది.ప్రస్తుత ప్రధానికి 100మందికిపైగా ఎంపిల మద్దతు లేకపోవడంతో ఆయన పదవి నుంచి తప్పుకున్నారు.నిజానికి 2016లో బ్రెగ్జిట్‌పై రిఫరెండమ్ జరిగిన తర్వాత నుంచి రాజకీయ అస్థిరత ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. ఐరోపాలో కొనసాగాలని పట్టుబట్టిన కన్సర్వేటివ్‌ప్రధాని డేవిడ్ కామెరూన్ నుంచి ఈ రాజీనామాలు ప్రారంభం అయ్యాయి.ఆ తర్వాత థెరిస్సామే ఆమె తర్వాత బోరిస్ జాన్సన్ ప్రధానిగా వచ్చారు.కరోనా లాక్ డౌన్‌లో రూల్స్ అతిక్రమించి పార్టీలు నిర్వహించారన్న వివాదంతో ఆయన దిగిపోవాల్సి వచ్చింది. తదనంతరం లిజ్ ట్రస్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినా పన్నుకోతల ప్రణాళిక కల కలం రేపింది. బాండ్లపై ఒత్తిడిపెరిగి పౌండ్ విలువలు క్షీణించడంతో 50 రోజుల్లోనే రాజీనామా చేసారు. తర్వాత వచ్చిన రిషిసునక్ కూడా అధిక ద్రవ్యోల్బణం, జీవన వ్యయసంక్షోభం,వలసల కట్టడి వంటివి ఆయన్ను సతమతం చేసాయి. దీనికి తోడు ఉక్రెయిన్ యుద్ధభారం కూడా పడింది. 2024 ఎన్నికల్లో ఆయన లేబర్ పార్టీ అధినేత కీర్‌స్టార్మర్‌కు అధికారం అప్పగించాల్సి వచ్చింది. వీటన్నింటి నేపథ్యంలో బ్రిటన్ కొత్తప్రధానిగా ఆండీ ముర్రే బర్న్‌హామ్ అనే నాయకుడిపేరు ప్రభలంగా ప్రచారంలోకి వచ్చింది. ప్రత్యేక ఎన్నికల్లో విజయం సాధించిన బర్న్‌హామ్ లేబర్‌పార్టీలో బలమైన నేతగా ఎదిగి పార్టీనాయకత్వాన్ని సైతం సవాల్‌చేసే సత్తాఉన్న



ఆండీ ముర్రే బర్న్‌హామ్

నేతగా పేరు సాధించారు. రేసులో ప్రముఖంగా వినిపిస్తున్న ఆండీబర్న్‌హామ్ చాలా కాలంతర్వాత యుకె ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. మేకర్ ఫీల్డ్ ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన ఆండీ బ్రిటన్‌ప్రధాని అయ్యేందుకు తన బాటలు వేసుకున్నారు. బ్రిటన్‌లో లేబర్‌పార్టీ నేతగా కీర్ స్టార్మర్‌కు గట్టిపోటీ ఇచ్చే నాయకుడిగా భావిస్తున్నారు. అందుకు తగినట్లుగానే ఇటీవలికాలంలో నాపై ప్రజలు నమ్మకం ఉంచితే రాజకీయాలను మొత్తం మార్చేస్తా అంటూ తన ప్రధాని కాంక్షను కూడా బయటపెట్టే సంకేతాలు ఇస్తూ వ్యాఖ్యలు చేసారు. వాయవ్య ఇంగ్లండ్‌లోని మెర్సీ సైడ్‌లో ఆండి ముర్రే బర్న్‌హామ్ జన్మించారు. 2001 నుంచి 2017వరకూ ఆయన ఎంపీగా కూడా కొనసాగారు. రాజకీయాలపై ఆసక్తితో లేబర్‌పార్టీనే ఎంచుకున్న ఆండీ మాజీ ప్రధాని గార్డన్ బ్రౌన్ కేబినెట్‌లో ఆర్థిక, సాంస్కృతిక, ఆరోగ్య శాఖలు పర్యవేక్షించారు. 2015, 2017లో కూడా పార్టీ పగ్గాలకోసం ఎత్తులు వేసినా చిత్తయ్యారు.అయితే పార్టీ అధినాయకత్వాన్ని సైతం సవాల్ చేసే సామర్థ్యం ఆండీకి ఉందని లేబర్ పార్టీలో అధికశాతం మద్దతును మాత్రం కూడగట్టుకోగలిగారు. లేబర్‌పార్టీలో సుమారు 300 మందికిపైగా ఎంపిల మద్దతు ఆయనే ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. లాక్‌డౌన్‌లో ఉత్తర ఇంగ్లండ్‌కు ఆర్థికసాయం అందించడంలో కన్సర్వేటివ్‌ప్రభుత్వం విఫలం అయిందంటూ అప్పటి ప్రభుత్వంపై విమర్శలతో విరుచుకుపడిన ఆండీ బోరిస్ సర్కారును దించేవరకూ పోరాటం చేసారు. దీనికితోడు ఆయనకు సోషల్‌మీడియాలో పెద్దఎత్తున మద్దతు లభించింది.ఆండీ మద్దతు దారులు ఆయన్ను కింగ్ ఆఫ్‌ది నార్త్ అని కూడా పిలుచుకుంటారు. మాంచెస్టర్ మేయర్‌గా ప్రజారవాణాను మెరుగుపరచడం, ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే విధంగా నైపుణ్యాభివృద్ధి ప్రణాళికలు అమలు చేసారు.అందుబాటు ధరల్లోనే ఇళ్లనిర్మాణాలు ముఖ్యంగా ఆయనకు పేరుతెచ్చిపెట్టాయి. అదే పాపులారిటీ ఆండీని మళ్లీ పార్లమెంటులోకి అడుగు పెట్టేలా చేసింది. తాను ప్రధానిగా వస్తే ఆదాయపు పన్నును పెంచబోనని, జాతీయ బీమాలేదా వాట్‌ను విధించబోమని ఇప్పటినుంచే చెప్పుకొస్తున్నారు.పబ్‌లకు బిజినెస్ రేట్లను కూడా కొంతమేర కుదించేందుకు ప్రయత్నిస్తామన్నారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులను మేయర్ల పరిధిలోనే ఉండాలని చెపుతూ వచ్చారు. ఎన్నికల సంస్కరణలకోసం తాను ఒక జాతీయ కమిషన్ ఏర్పాటు చేస్తానని కూడా మాటిచ్చారు. అంతేకాకుండా లేబర్ పార్టీ మేనిఫెస్టో అంశాలు అమలుకే కట్టుబడి ఉంటామని ప్రజల్లో మరింతగా ఎదురైన అసంతృప్తిని అధిగమించేవిధంగానే తన పాలన మార్కు రాజకీయం ఉంటుందని చెపుతూ వస్తున్నారు. కేవలం కన్సర్వేటివ్‌లకే పరిమితం కాకుండా లేబర్‌పార్టీలో కూడా ఎదురవుతున్న అంతర్గత సంక్షోభం వల్ల తరచూ మారుతున్న ప్రధానులతో బ్రిటన ప్రతిష్ట ప్రపంచ దేశాల్లో మసకబారుతున్నదనడంలో ఎలాంటి సందేహంలేదు.

---

# డ్రగ్స్‌రహిత సమాజ స్థాపన సాధ్యమేనా?

**నేదునూరి కనకయ్య**

డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం ప్రపంచానికి సామాజిక సమస్యగా పరిణమించింది. దేశ అభివృద్ధిలో చోదక శక్తిగా నిలిచిన యువత డ్రగ్స్ ఆల్కహాల్ మాదక ద్రవ్యాల మత్తులో చిక్కుకొని తమ శక్తిసామర్థ్యాలు నిర్వీర్యం చేసుకుంటున్నారు. డ్రగ్స్ మాదక ద్రవ్యాల దుర్వినియోగం యువత వినాశనకరంగ మారింది. ఆశలు ఆకాంక్షలు కన్న కలలు విఛ్చిన్నమై కుటుంబాలలో ఆనందకరమైన జీవితానికి అవరోధం కావడం శోచనీయం. ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్స్ మాఫియా రాజ్యమేలుతుంది. చిన్నపట్టణాల నుంచి మెట్రోపాలిటన్ నగరాలకు డ్రగ్స్ వ్యాపారం మూడు పువ్వులు ఆరవై కాయలుగా కొనసాగుతుంది. స్కూల్ కాలేజీ యూనివర్సిటీలు డ్రగ్స్ విక్రయ కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వ్యాపారం మాఫియా యువతను నిర్వీర్యం చేస్తూ లక్షల కోట్ల చీకటి వ్యాపారం చేస్తున్నాయి. యువత మత్తుకు ఆకర్షితులై మత్తు నుండి బయట పడలేక తమ జీవితాలను బలిచేసుకుంటున్నారు. కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 269 మిలియన్ల మంది మాదక ద్రవ్యాలకు బానిస అయ్యారని నివేదికలు వెల్లడించాయి. వీరే కాకుండా ఎప్పుడైన ఒకసారి వినియోగించేవారు 5.5 శాతం మంది ఉన్నారు. దేశంలో మద్యం వినియోగించే వారు16 కోట్ల మంది గంజాయి 3.1 కోట్లు హీరోయిన్ 2.8 కోట్లు కొకైన్ ఇతర మత్తుపదార్థాలు 1.18 కోట్ల మంది వాడుతున్నారని నివేదికలు వెల్లడిస్తున్నాయి. డ్రగ్స్‌మాదక ద్రవ్యాల వినియోగం ప్రపంచవ్యాప్తంగా 2004లో 21 శాతం వాడుతుంటే నేడు 29.5 శాతం పెరిగిందని యుఎన్‌ఓడిసి విడుదల చేసిన నివేదిక తెలిపింది. ఈ నివేదిక ప్రకారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ప్రపంచవ్యాప్తంగా అర మిలియను మంది 2019లో మరణిస్తే ఇండియాలో జరిగిన ఆత్మహత్యల్లో ఎక్కువ శాతం ఈ కోవకు చెందినవేనని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రమాదకరమైన మాదకద్రవ్యాలు ఉపయోగించే వారు 0.71 శాతం ఉంటే ప్రపంచ సగటు కంటే ఎక్కువగా మన దేశంలో 2.65శాతం ఈ ప్రమాదకరమైన డ్రగ్స్ వాడుతున్నారని నివేదిక పేర్కొంది. 1985లో నార్కోటిక్ డ్రగ్స్‌అండ్ సైకో ట్రాఫిక్ సబ్ స్టాన్సెస్ చట్టం ప్రకారం మాదకద్రవ్యాలు కలిగి ఉండటం సరఫరా ఉత్పత్తి చట్టరీత్యా నేరం అయినప్పటికీ ఈరోజు మనదేశంలో విచ్చల విడిగా డ్రగ్స్‌దొరుకుతూనే ఉన్నాయి. వాడకం పెరుగుతుంది. ఇంతటి ప్రమాదకరమైన సమస్య రోజురోజుకు తీవ్రమవుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి. దీని కోసం తక్షణ పరిష్కారంకోసం ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. డ్రగ్స్‌మాదక ద్రవ్యాల దుర్వినియోగం డ్రగ్స్ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమాలు ఒక రోజు కాకుండా నిరంతరం జరగాలి. వీటివల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలి.ఈ సమస్య పరిష్కరించడానికి సమర్థవంతమైన పాలన చట్టబద్ధమైన విధానాలను రూపొందించాలి. ప్రభుత్వాలు స్థానిక సంస్థలు మహిళా సంఘాలు పౌర సమాజం స్వచ్ఛంధ సంస్థలు మాదక ద్రవ్యాలకు సంబంధించిన చట్టాలు కార్యక్రమాలు పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలి. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక సమాచారాన్ని పంచుకోవాలి. మాదకద్రవ్యాలు సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి ప్రభుత్వాలు రాజ్యాంగ వ్యవస్థలు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు విద్యావేత్తలు సమిష్టిగా కృషి చేయాలి. ఒక్కరోజు మాత్రమే దీని గురించి ఆలోచించి మర్చిపోకూడదు. అక్రమ రవాణా ఎదుర్కోవడానికి అంతర్జాతీయంగా దేశాల మధ్యన సహకారం అవసరం. వ్యక్తులు కుటుంబాలు సమాజాలపై మాదకద్రవ్యాల దుర్వినియోగం గురించి అవగాహన చైతన్యం కలిగించాలి. నివారణ చికిత్స పునరావాస కార్యక్రమాలను ప్రోత్సహించాలి. మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమాల్లో ప్రజలందరూ సంపూర్ణ భాగస్వాములై డ్రగ్స్ రహిత సమాజం ప్రాముఖ్యతను ప్రచారం చేయాలి.వర్క్‌షాపులు సదస్సులు చర్చలు ఏర్పాటు చేయాలి. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా



ప్రచారం చేసే వ్యక్తులనుసంస్థలను అవార్డులు ఇచ్చి ప్రోత్సహించాలి. పాఠశాలలు కళాశాలలో డ్రగ్స్ ప్రభావాలుగురించి సదస్సులు నిర్వహించాలి. నైతిక విద్యను పాఠ్యాంశంలో ప్రవేశపెట్టి డ్రగ్స్‌రహిత ఆరోగ్యకరమైన జీవనశైలి పెంపొందించే విద్య బోధన పాఠ్య ప్రణాళికలు అమలు చేయాలి. కాశ్మీర్ ప్రాంతంలో డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగానికి యువత బానిసలుగా మారిపోతున్నారు. జమ్ము కాశ్మీర్లో దాదాపు10లక్షల జనాభా వుంటే 8శాతం ప్రజలు గంజాయి ఓపియాయిడ్లు వంటి మాదక ద్రవ్యాలకు అలవాటుపడ్డారు. ఈ సమాచారాన్ని కేంద్ర మంత్రి పార్లమెంట్లో వెల్లడించారు. రేహాబి లేషన్‌కొరకు వచ్చే రోగులసంఖ్య ఓ10ఏళ్లకుముందు రోజుకు 10,12 డ్రగ్స్‌అడ్డిక్షన్ కేసులు వచ్చేవి ఇప్పుడు150 200 కేసులు వస్తున్నాయి. ఇది ఆందోళన కలిగించే విషయం అని సైక్రటిస్ట్ డాక్టర్ ప్రొఫెసర్ యాసిర్ రాథార్ ప్రకటించారు. దేశంలో చాలా చోట్ల డ్రగ్స్ మాదక ద్రవ్యాల వ్యాపారం విస్తరించి వుంది. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 157 దేశాల్లో గంజాయి సాగు అవుతుంది. దేశంలో అనేక రాష్ట్రాలలో ఈ సమస్య తీవ్రంగా వుంది. ఈశాన్య రాష్ట్రాలు అంతర్జాతీయ పోర్టులు, ప్రైవేట్ పోర్టులు ద్వారా ఎక్కవ సప్లయ్ అవుతుంది. కృష్ణా పట్నం పోర్టు శంషాబాద్ ఎయిర్ పోర్టులో డ్రగ్స్‌మాదక ద్రవ్యాలు పట్టుబడుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న పేద దేశాలలో ఈ వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది. ప్రపంచీకరణ కార్పొరేటీకరణ ప్రభావం వల్ల డాగ్స్‌వ్యాపారం విస్తరిస్తుంది. 2030 నాటికి మాదకద్రవ్యాల వ్యాపారం 11 పెరిగిపోతుందని ఐరాస నివేదిక పేర్కొంది. ఆకలి దారిద్రం, పేదరికం, నిరుద్యోగం, వైద్యం అందకపోవడంలాంటి అనేక సమస్యలతో సతమవుతున్న ప్రజలను కార్పొరేట్ సంస్థలు మాదకద్రవ్యాల వ్యాపారంతో దేశాన్ని దోచుకోవడంతో పాటు యువతను నిర్వీర్యం చేస్తున్నారు.మత్తుకు బానిస లైన యువత డాగ్స్‌ను పొందడం కోసం అనేక ఘాతుకాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. యువత హింసకు దోపిడీకి పాలుపడుతున్నారు. హింస పెరిగిపోతుంది. కార్పోరేట్ సంస్థల ప్రభుత్వాలు అండగా నిలవడం కరోన మహమ్మారి ప్రపంచాన్ని వనణికించిన సమయంలోను కార్పొరేట్ల దందాను ప్రభుత్వాలు అరికట్టలేకపోయాయి. ఉచిత వాక్సిన్ అందించి ప్రపంచాన్ని కాపాడుకోవాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రవర్తించి కాసులు దండుకునేందుకు దారులు వేసింది. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం యువతను శారీరకంగా మానసికంగా కుంగతీస్తుంది. తీవ్రమైన భావోద్వేగాలకు గురిచేస్తుంది. యువశక్తే దేశ శక్తి అంటున్న ప్రభుత్వాలు యువశక్తి సామర్థ్యాలను నిర్వీర్యం చేసే బలహీన పరిచే మత్తు పదార్థాల మాదక ద్రవ్యాలవైపు పయనిస్తున్న యువతను కట్టడి చేయలేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి ప్రతీక డ్రగ్స్ వినియోగం వల్ల దేశాభివృద్ధికి వెన్నెముకగా వుండ వలసిన యువత నిర్వీర్యం అవుతుంది. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగంవల్ల కలిగే భౌతిక మానసిక సామాజిక ఆర్థిక నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కలిగించాలి.నషా ముక్త్ భారత్ అభియాన్ పథకం ద్వారా 272 జిల్లాలో 13000 మంది వాలంటర్లను పెట్టి డ్రగ్స్ అరికట్టాలన్న కార్యాచరణ అమలుకు నోచుకోలేదు. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పబ్బులు, క్లబ్బులు సినీ పరిశ్రమలో పాఠశాల, కళాశాల, స్థాయిలో డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించాలి. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం అక్రమ రవాణా కేసులను విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి దోషులకు కఠిన శిక్షలు అమలు చెయ్యాలి.ఐటి పరిశ్రమలో డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం వ్యాపారాన్ని అరికట్టాలి. డ్రగ్స్‌అడిక్ట్‌గా మారిన యువతకు సమగ్ర వైద్య ఆరోగ్య పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి.కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యల మీద అవగాహన కలిగించాలి.మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడటానికి విద్య నివారణ చికిత్స చట్టాల అమలుతో కూడిన ఏకీకృత విధానం అమలు చెయ్యాలి.

## నేడు నల్లగొండలో సీఎం రేవంత్‌రెడ్డి
## హ్యామ్‌రోడ్ల పనులకు శంకుస్థాపన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 27:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నం 3.35 గంటలకు నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని కనగల్ ఏఎంసి మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హామ్) రోడ్లకు శంకుస్థాపన చేసి పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. సాయంత్రం 4 గంటలకు నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుంటారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.83 కోట్లతో డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ఫేజ్ 1కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.రూ. 13వేల కోట్ల వ్యయంతో నిర్మించే ఆర్ అండ్ బి హ్యామ్ రోడ్ల పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. సీఎం పర్యటన సందర్భంగా ఇప్పటికే అన్ని ఏర్పాట్లను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యవేక్షించారు. కాగా, బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం...అనంతరం సెల్ఫ్ హెల్ప్ (గ్రూప్ మహిళా సంఘాలకు చెక్కులు అందజేయనున్నారు.

## తమిళనాడు పిసిసి చీఫ్‌గా మాణికంతాగూర్ నియామకం



**చెన్నై, జూన్ 27:** తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) కొత్త అధ్యక్షుడిగా విరుదునగర్ లోక్‌సభ సభ్యుడు బి. మాణికం ఠాగూర్ నియమితులయ్యారు. ఈ పదవిలో ఉన్న కే. సెల్వపెరుంథగై తనను బాధ్యతల నుంచి తప్పించాలని కోరడంతో, పార్టీ అధిష్ఠానం ఠాగూర్‌ను కొత్త రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది. గత ఏడాదిగా డీఎంకే-కాంగ్రెస్ పొత్తు విషయంలో కాంగ్రెస్‌ను జూనియర్ భాగస్వామిగా చూస్తున్న తీరుపై ఠాగూర్ పలుమార్లు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలతో ఆయన తరచూ వార్తల్లో నిలిచారు. 1975న జూన్ 1న శివగంగలో జన్మించిన మాణికం ఠాగూర్, బెంగళూరు విశ్వవిద్యాలయం నుంచి బీఏ, ఎల్ఎల్‌బీ పట్టా పొందారు.1994లో ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన, 1996లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, 1997లో జాతీయ ప్రధాన కార్యదర్శి, 1999లో జాతీయ ఉపాధ్యక్షుడిగా పదోన్నతులు పొందారు.2003 నుంచి 2005 వరకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఠాగూర్, అనంతరం 2006లో సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ ఛైర్మన్, 2008లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఎన్నికల కమిషనర్గా కూడా కీలక బాధ్యతలు నిర్వహించారు. తమిళనాడు రాజకీయాల్లో మారుతున్న సమీకరణాల నేపథ్యంలో కాంగ్రెస్ హైకమాండ్ లోక్‌సభలో పార్టీ విప్, విరుదునగర్ ఎంపీని నియమించిందని తెలుస్తోంది.ఈ నియామకంతో తమిళనాడు కాంగ్రెస్‌లో తరం మార్పునకు శ్రీకారం చుట్టినట్లైంది. మాణికంఠాగూర్ (51)వరుసగా మూడు సార్లు విరుదునగర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆయన స్థానంలో ఇప్పటివరకు టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా ఉన్న కే. సెల్వ పెరుంతగై అసెంబ్లీ ఎన్నికల తర్వాత బాధ్యతలనుంచి తప్పించాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరుతూ వచ్చారు.ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ టీవీకే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. విజయ్ నేతృత్వంలోని టీవీకేతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికలు, 2029లోక్‌సభ ఎన్నికల్లోనూ పోటీచేస్తామని ఇప్పటికే ప్రకటించింది.

# సీషెల్స్‌లో ప్రధాని మోడీ

### అధ్యక్షుడితో కలిసి 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం
### ఎయిర్‌పోర్టులో సీషెల్స్ ప్రధాని, మంత్రివర్గం మోడీకి ఘనస్వాగతం



సీషెల్స్ బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటుతున్న ప్రధాని మోడీ

**విక్టోరియా, జూన్ 27:** సీషెల్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అక్కడి అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీతో కలిసి ప్రత్యేక మొక్కలునాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా సీషెల్స్ నేషనల్ బొటానికల్ గార్డెన్‌లో ఇద్దరు నేతలు కలిసి కోకో డి మెర్ మొక్కను నాటారు. సీషెల్స్‌కు మాత్రమే ప్రత్యే కమైన కోకో డి మెర్ ప్రపంచంలోనే అతిపెద్ద విత్తనం, అత్యంత బరువైన పండును ఇచ్చే అరుదైన తాటి జాతిగా గుర్తింపు పొందింది. ఈ చెట్టుకు సీషెల్స్‌లో విశేష గౌరవం ఉండటంతో పాటు దేశ జాతీయ చిహ్నంలో కూడా దీనికి స్థానం కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదికలో స్పందిస్తూ పచ్చని భూమి కోసం భారత్, సీషెల్స్ దేశాలు కలిసి పని చేస్తున్నాయని అన్నారు. జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, భావితరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించాలనే ఉమ్మడి సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. బొటానికల్ గార్డెన్ సందర్శనలో ప్రధాని మోదీ అక్కడి భారీ తాబేళ్లకు ఆహారం అందించారు. ముఖ్యంగా ప్రపంచంలోనే అత్యంత వృద్ధ భూజంతువుగా గుర్తింపు పొందిన 194 ఏళ్ల వయస్సున్న జోనాథన్ తాబేలును చూసేందుకు మోడీ ఆసక్తి కనబరిచారు. మూడు రోజుల అధికారిక పర్యటన కోసం శనివారం మధ్యాహ్నం సీషెల్స్ చేరుకున్న ప్రధాని మోడీ ఆ దేశ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

**ఎయిర్‌పోర్టుకు స్వయంగా వచ్చి మోడీకి స్వాగతం పలికిన సీషెల్స్ ప్రధాని**

ప్రత్యేక గౌరవ సూచకంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ స్వయంగా విమానాశ్రయానికి వచ్చి ప్రధాని మోడీకి స్వాగతం పలికారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు కూడా హాజరయ్యారు. సీషెల్స్‌లో నివసిస్తున్న భారతీయ ప్రవాసులు కూడా ప్రధానికి ఘన స్వాగతం అందించారు. సీషెల్స్ భారతదేశానికి అత్యంత సన్నిహిత సముద్ర భాగస్వామి, హిందూ మహాసముద్ర ప్రాంతంలో విశ్వసనీయ మిత్రదేశం. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే ఫలవంతమైన పర్యటన కోసం ఎదురుచూస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు. భారత్ సీషెల్స్ దౌత్య సంబం ధాలు ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తవుతున్నాయని గుర్తు చేశారు. పరస్పర విశ్వాసం, ప్రజాస్వామ్య విలువలు, వైవిధ్యానికి గౌరవం, ప్రజల మధ్య సన్నిహిత సంబంధాల పునాదిపై ఈ భాగస్వామ్యం మరింత బలపడిందన్నారు.ఈ పర్యటనలో అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీతో ప్రధాని మోడీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు.

సముద్ర భద్రత, అభివృద్ధి భాగస్వామ్యం, సామర్థ్యాల పెంపు, ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. సీషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించే తొలి భారత ప్రధాని మోడీ కానున్నారు. సీషెల్స్‌లోని భారతీయ ప్రవాసులతో కూడా ప్రధాని మోడీ సమావేశం కానున్నారు.

భారత్‌సీషెల్స్ మధ్య ప్రజల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేయడంలో ప్రవాస భారతీయులు కీలక వారధిగా ఉన్నారని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ పర్యటనతో భారత్‌సీషెల్స్ సంబంధాలు మరింత బలోపేతం కావడంతో పాటు, హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర భద్రత, ప్రాంతీయ సహకారం, శాంతి, సుస్థిర అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని ప్రధాని మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు.

# వేదఘోషల మధ్య భద్రాద్రి పునరుద్ధరణకు శ్రీకారం

### ఆగమశాస్త్రం ప్రకారం పనుల ప్రారంభం
### భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు
### 2027 గోదావరి పుష్కరాల నాటికి పూర్తి

**భద్రాచలం, ప్రభాతవార్త:** దక్షిణ అయోధ్యగా దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులు శనివారం వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7.30 గంటలకు వేద పండితుల ఆశీర్వచనాల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, భద్రాద్రిని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.540 కోట్ల అభివృద్ధి ప్రణాళికను రూపొందించిందన్నారు. తొలి విడతగా రూ.350 కోట్లు విడుదల కాగా, ప్రస్తుతం రూ.200 కోట్లతో పునరుద్ధరణ పనులు ప్రారంభించామని తెలిపారు. మాడ వీధులు, భక్తుల సౌకర్యాలు, ఆలయ పరిసరాల అభివృద్ధితో భద్రాద్రిని టెంపుల్ సిటీగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు.

భక్తుల దర్శనానికి ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసిన ఆయన, నిత్యకైంకర్యాలు, పూజలు, సేవలు యథావిధిగా కొనసాగుతూనే నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. 2027 జూన్‌లో ప్రారంభమయ్యే గోదావరి పుష్కరాల నాటికి మొత్తం పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించామని చెప్పారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన భద్రాచల ఆలయం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి నిలువెత్తు చిహ్నమన్నారు. ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగా, ఆలయ పవిత్రతకు ఏమాత్రం భంగం కలగకుండా ప్రతి నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనుల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, క్యూ లైన్లు, తాగునీరు, పరిశుభ్రత, భద్రత వంటి అన్ని అంశాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదరరావు, ఇరిగేషన్ ఈఈ జానీ, డిప్యూటీ తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, సర్పంచ్ పూణెం కృష్ణ, పంచాయతీ ఈవో శ్రీనివాస్, వేద పండితులు, దేవస్థానం, ఇంజినీరింగ్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు త్వరలో ఇంటర్ తరగతులు ప్రారంభం

### అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించే ప్రతిభావంతులు
### హెలెన్ కెల్లర్ జయంతి వేడుకల్లో
### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్27:** వైకల్యం విజయానికి అడ్డంకి కాదు... ఆత్మవిశ్వాసం లేకపోవడమే అసలైన అడ్డంకి. శరీరానికి పరిమితులు ఉండొచ్చు... కానీ సంకల్పానికి ఎలాంటి పరిమితులు ఉండవు" అని దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు.ప్రపంచానికి పట్టుదల, ఆత్మ విశ్వాసం, అచంచల సంకల్పానికి ప్రతీకగా నిలిచిన హెలెన్ కెల్లర్ 146వ జయంతి సందర్భంగా శనివారం దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర సంచాలకుల కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. హెలెన్‌కెల్లర్ జీవితం ప్రపంచానికి శాశ్వతస్ఫూర్తి అని పేర్కొన్నారు. తన గురువు ఆన్ సలివన్ మార్గదర్శకత్వంలో స్పర్శ ద్వారా విద్యను అభ్యసించి, దృష్టిశ్రవణ వైకల్యం ఉన్న తొలి డిగ్రీధారిణిగా చరిత్ర సృష్టించడమే కాకుండా రచయిత్రిగా, వక్తగా, సామాజిక సేవకురాలిగా కోట్లాది మంది దివ్యాంగులకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడారు."ఆమె చీకటిలో జీవించింది... కానీ ప్రపంచానికి వెలుగు చూపించింది. హెలెన్ కెల్లర్ వ్యక్తి కాదు, పట్టుదల అనే పదానికి ప్రత్యక్షరూపం"అని మంత్రి పేర్కొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
**కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం, నిర్మల్**
ప్రకటన

Rc No. B1/578/2018, తేది: 24.06.2026

నిర్మల్ జిల్లాలోని పెంబి మండలంలో మీసేవా సేవలను విస్తరించడానికి మరియు ఇంటి వద్దకే పౌర సేవలను అందించడానికి తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా, ఈ క్రింది ప్రదేశాలలో **కొత్త మీసేవా కేంద్రాలను** ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడమైనది. వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి: **క్ర.సం., మండలం పేరు, గ్రామం పేరు, మీసేవా కేంద్రం సంఖ్య:** 1,2: పెంబి, 01, 2: పెంబి-01, మందపల్లి-01. ప్రస్తుత ప్రభుత్వ/మీసేవా మార్గదర్శకాల ప్రకారం నిర్దేశించిన అర్హతా ప్రమాణాలను నెరవేర్చే అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయి.

**అర్హత షరతులు:**
i. ఏదైనా గ్రాడ్యుయేషన్ మరియు అంతకంటే ఎక్కువ
ii. కంప్యూటర్ కోర్స్ సర్టిఫికేట్
iii. వయోపరిమితి 21 సంవత్సరాల నుండి 44 సంవత్సరాల వరకు
iv. అవసరమైన మౌలిక సదుపాయాలలో పెట్టుబడి పెట్టడానికి సుముఖత
v. ఎంపికైన అభ్యర్థులకు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్
vi. స్థానిక అభ్యర్థికి మండలం ఒక ప్రమాణం.
vii. రాత పరీక్ష నిర్వహించడం
viii. ఇంటర్వ్యూ తర్వాత

**దరఖాస్తు రుసుము ::** రూ. 500/- (జిల్లా ఇ-గవర్నెన్స్ సొసైటీ ఛైర్మన్ పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో.) దరఖాస్తు ఫారమ్‌ను నిర్మల్ జిల్లా అధికారిక వెబ్‌సైట్ nirmal.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
**నోటిఫికేషన్ తేదీ:: 27.06.2026, దరఖాస్తుల చివరి తేదీ:: 06.07.2026.**
దరఖాస్తులను అన్ని అవసరమైన పత్రాలతో (విద్యార్హత ధృవపత్రాలు, ఆధార్, కుల, నివాస ధృవపత్రాలు తప్పనిసరి) పాటు గది నెం. F19 IDOC, నిర్మల్‌లో సమర్పించాలి.
సం/- భవేష్ మిశ్రా, IAS, ఛైర్మన్ DeGS & జిల్లా కలెక్టర్ నిర్మల్
DIPR.No.5064-PP/CL/Advt/1/2026-27, తేది: 27.06.2026


# డిస్కంలో డిజిటల్ డ్యాష్‌బోర్డ్ వ్యవస్థ

### పనితీరుపై రియల్ టైమ్ పర్యవేక్షణ
### విద్యుత్ సేవల్లో విప్లవాత్మక మార్పు: సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు విద్యుత్ సేవల్లో విప్లవాత్మక మార్పు తీసుకొస్తున్నట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో అత్యాధునిక కార్యాచరణ మేధస్సు, పనితీరు పర్యవేక్షణ వ్యవస్థ ఆధారిత సమగ్ర డిజిటల్ డ్యాష్‌బోర్డ్ ను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సంస్థలోని అన్ని విభాగాల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు, సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా విభాగాల వారిగా డిజిటల్ డ్యాష్‌బోర్డ్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ అత్యాధునిక కమాండ్ ఇంటర్‌ఫేస్ ద్వారా సంస్థ పరిధిలోని అన్ని సర్కిళ్లు, డివిజన్లు మరియు సెక్షన్ల యొక్క రోజువారీ కార్యకలాపాలు రియల్ టైమ్‌లో సీనియర్ మేనేజ్‌మెంట్‌తో పాటు, అందరికి అందుబాటులో ఉంటుందన్నారు. ఈ డ్యాష్‌బోర్డ్ ద్వారా సంస్థలోని ఆపరేషన్స్, ఫైనాన్స్, హెచ్‌ఆర్, ప్రాజెక్ట్స్, ఎంఆర్‌టీ, పర్చేజ్ అండ్ మెటీరియల్స్ మేనేజ్‌మెంట్ కన్స్యూమర్ కేర్ సెంటర్ తదితర విభాగాల పనితీరును ఒకే వేదికపై రియల్ టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమైన విభాగాల వారీగా డ్యాష్‌బోర్డ్ ప్రత్యేకతలు చూస్తే పర్చేజ్ మెటీరియల్స్ మేనేజ్‌మెంట్ సంస్థకు అవసరమైన విద్యుత్ పరికరాలు, మెటీరియల్ నిల్వలు, వినియోగ సరళిని సులభంగా తెలుసుకోవచ్చని చెప్పారు. అలాగే మానవ వనరుల విభాగం సంస్థలోని మొత్తం ఉద్యోగులు, ఆర్టిజన్ల వివరాలు, వారి జీతభత్యాల వ్యయం రిటైర్మెంట్ షెడ్యూల్స్, మెడికల్ క్లెయిమ్‌లు, కోర్టు కేసుల పురోగతిని ఈ సింగిల్ విండో ఇంటర్‌ఫేస్ ద్వారా పర్యవేక్షించవచ్చున్నారు. అంతేకాకుండా వినియోగదారుల సేవా కేంద్రం వినియోగదారుల నుండి వచ్చే ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు 1912 కాల్ సెంటర్ పనితీరును, సర్కిళ్ల వారీగా పెండింగ్ ఉన్న ఫిర్యాదులను విశ్లేషించేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించారు. అలాగే ప్రాజెక్ట్స్ వింగ్ కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, సివిల్ పనులు, కాంట్రాక్టర్ల పనితీరు మరియు నిధుల వినియోగాన్ని ప్రతి మైల్‌స్టోన్ వారీగా స్పష్టంగా ట్రాక్ చేస్తారని, హెల్త్ :ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు, వాటికి గల కారణాలు, పదే పదే ఫెయిల్ అవుతున్న ప్రాంతాలను గుర్తించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూసేందుకు మరియు విద్యుత్ దొంగతనాలను అరికట్టేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. ఫైనాన్స్ విభాగంలో కూడా డిమాండ్, కలెక్షన్ పనితీరు, బిల్లింగ్, పెండింగ్ వర్క్ ఆర్డర్లు, సాధారణ సేవల తనిఖీల పురోగతి వంటి అంశాలపై సమగ్ర సమాచారం లభిస్తుందని వెల్లడించారు.

# పెట్టుబడి సాయంపై కొత్త రైతులకు భరోసా

### పట్టాదార్ పాస్‌పుస్తకాలొచ్చిన వారికి ఛాన్స్
### 15లోపు భూముల రిజిస్ట్రేషన్ తప్పనిసరి
### జులై 5 వరకూ దరఖాస్తుకు అవకాశం

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** రైతు భరోసాకు సంబంధించి రాష్ట్రంలోని రైతాంగానికి రేవంత్‌రెడ్డి సర్కార్ కీలక నిర్ణం తీసుకుంది. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న కొత్త రైతులకు లబ్ధి చేకూర్చనుంది. ఇందుకు గాను దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించింది. చాలా రోజులుగా భూములు కొనుగోలు చేసి లేదా వారసత్వంగా పొంది, కొత్తగా పట్టాదార్ పాసు పుస్తకాలు తెచ్చుకున్న రైతులకు ఈ నిర్ణయం పెద్ద ఊరటనివ్వనుంది. అర్హత కలిగిన రైతులందరూ తమ మండల కేంద్రాల్లో లేదా క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ అధికారులను కలిసి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. సంబంధిత అధికారవర్గాల వివరాలు ప్రకారం కొత్త రైతులు దరఖాస్తు చేసుకోవడానికి జులై 5 ఆఖరి గడువుగా నిర్దేశించింది. అయితే ఈ విడత పెట్టుబడి సాయం పొందాలనుకునే కొత్త రైతులు ఈ నెల 15వ తేదీ లోపు భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి, చేతికి పాస్ పుస్తకాలు వస్తేనే అర్హత కలుగుతుంది. రైతులు మాత్రమే ఇప్పుడు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఒకవేళ ఏ కారణం చేతనైనా జులై 5 లోపు దరఖాస్తు చేసుకోకపోతే, ఈ విడతలో వచ్చే రైతు భరోసా నిధులు ఆయా అకౌంట్లలో జమ కావు. ఆ తర్వాత దరఖాస్తు చేసుకునే వారికి తదుపరి విడతలోనే అవకాశం కల్పించనుందని వెల్లడించాయి. ఈ రైతు భరోసా కొత్త దరఖాస్తుల ప్రక్రియ పూర్తిగా ఆఫ్‌లైన్ విధానంలోనే సాగుతోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఎక్కడా లేదు. రైతులు నేరుగా తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి లేక క్లస్టర్ ఆఫీసర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. వారి దగ్గర లభించే ప్రత్యేక దరఖాస్తు ఫారమ్‌ను తీసుకొని, అందులో అడిగిన వివరాలన్నీ తప్పులు లేకుండా నింపాలి. ఆ ఫారమ్‌తో పాటు, కొన్ని ముఖ్యమైన పత్రాలను జత చేసి అధికారులకు ఫిజికల్‌గా అందజేయాలి. ఆ తర్వాత క్షేత్రస్థాయి పరిశీలన ముగిశాక అధికారులు వారి పేరును లబ్ధిదారుల లిస్టులో చేర్చుతారు. దరఖాస్తుదారుడి గుర్తింపు కార్డు కాపీ, కొత్తగా వచ్చిన పట్టాదార్ పాసుబుక్ జిరాక్స్, అలాగే డబ్బులు జమయ్యేందుకు వీలుగా బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీని దరఖాస్తు ఫారమ్‌కు జత చేయాలి. ఈ పత్రాలన్నింటినీ ఏఈఓలు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. అందులో పేర్కొన్న భూమి వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు అన్నీ సరిగ్గా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే, సదరు దరఖాస్తును జిల్లా స్థాయి అధికారుల ఆమోదం కోసం పంపిస్తారు. అయితే, సాగుకు పనికిరాని బీడు భూములు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిన ప్లాట్లు, కాలువలు, రాళ్ల రప్పలతో నిండిన భూములకు ఎలాంటి రైతు భరోసా సాయం వర్తించదని అధికారవర్గాలు స్పష్టం చేశాయి. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాత లబ్ధిదారులతో పాటు, కొత్తగా జులై 5 లోపు దరఖాస్తు చేసుకునే అర్హులైన రైతులందరి ఖాతాల్లోకి జూన్ 30వ తేదీ నుంచి విడతల వారీగా నిధులు విడుదల కానున్నాయి. మొదట ఒక ఎకరం భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేయడం ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఎక్కువ భూమి ఉన్న రైతులకు ప్రాధాన్యత ఇస్తారు. కేవలం పది రోజుల్లోనే అర్హులైన రైతులందరి బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ అయ్యేలా ఆర్థిక, వ్యవసాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి అధికారవర్గాలు పేర్కొన్నాయి.

# 10 ఎకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా రక్షణ

### హస్మత్‌పేటలో 750 కోట్ల విలువైన భూమికి ఫెన్సింగ్

**హైదరాబాద్, జూన్ 27,ప్రభాతవార్త:** హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టి హస్మత్ పేటలో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. మేడ్చల్ మల్కాజగిరి జిల్లా బాలానగర్ మండలం హస్మత్ పేటలో శనివారం ఈ భారీ ఆపరేషన్‌ను హైడ్రా నిర్వహించింది. సర్వే నంబరు 01లో ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. మార్కెట్లో దీని విలువ రూ. 750 కోట్ల వరకు ఉంటుందని అంచనా. హస్మత్ పేట సర్వే నంబర్ 01 లో మొత్తం 108 ఎకరాలుండగా ఇప్పటికే 98 ఎకరాలు కబ్జాకు గురయింది. ఎవరికి వారు కబ్జాలు చేసి అక్కడ వంద గజాల బిట్టుల మాదిరి అమ్మేయగా.. కొంతమంది ఇళ్లు కట్టుకున్నారు. అక్కడ ఇళ్ళ నిర్మాణాలు జరిగిపోయాయి.

ఇప్పటికే నివాసాలు ఉంటున్న ఇళ్ల జోలికి వెళ్లకుండా హైడ్రా ఈ ఆపరేషన్‌ను నిర్వహించింది. రెవెన్యూ అధికారుల లేఖ మేరకు హైడ్రా ఈ భూములను కాపాడింది. రెవెన్యూ అధికారుల సమక్షంలో.. భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా శనివారం 10 ఎకరాలను కాపాడుతూ ఫెన్సింగ్ వేసింది. ప్రీకాస్ట్ ఇటుకల ప్రహరీలు వేసి కబ్జాలు హస్మత్ పేట సర్వే నంబరు 01లో మొత్తం 108 ఎకరాలుండగా.. అక్కడ కబ్జాలు కాకుండా మిగిలింది కేవలం 10 ఎకరాలే. ఈ 10 ఎకరాల్లో ప్రీకాస్ట్ ఇటుకలతో కబ్జాదారులు ప్రహరీలు నిర్మించి ఆక్రమణలకు పాల్పడ్డారు. కొన్ని ప్రహరీల్లో చిన్న గదులు నిర్మించారు. కాంపౌండ్లు నిర్మించి తాత్కాలిక షెడ్డులు వేసి ఆక్రమణలకు పాల్పడిన కబ్జాదారులు.. వారి సొంత మనుషులను పెట్టి కాపలాకు ఉంచారు. ప్రీకాస్ట్ వాల్స్ తో పాటు తాత్కాలికంగా వేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది. వంద గజాలకో ప్లాటు మాదిరి అక్కడ కబ్జాదారులు తెగనమ్మారు. ఇలా కబ్జాలకు హైడ్రా చెక్ పెట్టింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.




ప్రభుత్వం భూమిగా పేర్కొంటూ హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డు


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)**
AU SMALL FINANCE BANK - A SCHEDULED COMMERCIAL BANK
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001(CIN:L36911RJ1996PLC011381)
అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" ఏప్రిల్ 01, 2024 నుండి "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకం చేసిన వ్యక్తి "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడిన సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు, క్రింద ఇవ్వబడిన పట్టికలో ఇవ్వబడిన వివరాల ప్రకారం, ఆ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలి.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారుపేరు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (Loan A/C No.) 23660000150606, బొమ్మిశెట్టి ఎల్లమ్మ (రుణగ్రహీత) బొమ్మిశెట్టి సోమయ్య (సహ-రుణగ్రహీత) | 16-ఆగస్టు-24 రూ.7,53,134/-, ఏడు లక్షల యాభై మూడు వేల ఒక వంద ముప్పై నాలుగు రూపాయలు మాత్రమే 12-ఆగస్టు-24 నాటికి | 22-జూన్-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, దివిటిపల్లి గ్రామంలోని వర్ధన్నపేట రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఆస్తి వివరాలు: అసెస్‌మెంట్ నం. 58 మరియు జి.పి.హెచ్. G.P.H. నం. 1-53/2 కలిగిన, 164.40 చదరపు గజాలు 137.40 చదరపు మీటర్లకు సమానం విస్తీర్ణం గల స్థలంలో ఉన్న ఇల్లు. ఇందులో RCC పైకప్పుతో కూడిన ఇంటి విస్తీర్ణం ప్లింత్ ఏరియా 524.30 చదరపు అడుగులు మరియు GI షీట్ పైకప్పుతో కూడిన ఇంటి విస్తీర్ణం 150.00 చదరపు అడుగులు. దీని సరిహద్దులు: తూర్పున-శివరాత్రి ఎల్లస్వామి వారి ఖాళీ స్థలం; పడమరన-బొమ్మిశెట్టి బిక్షపతి గారి ఇల్లు; ఉత్తరాన-కోరం వీరారెడ్డి గారి ఖాళీ స్థలం; దక్షిణాన- గ్రామ పంచాయతీ సి.సి.రోడ్డు. | | |
| (Loan A/C No.) 23660002372413, బానోత్ రమేష్, (రుణగ్రహీత), బానోత్ మమత, (సహ-రుణగ్రహీత) | 08-అక్టోబర్-25 రూ.6,86,010/-, ఆరు లక్షల ఎనభై ఆరు వేల పది రూపాయలు మాత్రమే 08-అక్టోబర్-25 నాటికి | 22-జూన్-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: వరంగల్ జిల్లా, నెక్కొండ మండలం, రెడ్లవాడ రెవెన్యూ గ్రామం, మహబూబ్‌నాయక్ తండా గ్రామం మరియు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఆస్తి. ఇది వార్డు నం. 4లో, ఇంటి నం. 4-200A/19 కలిగి ఉంది, 237.33 చదరపు గజాల లేదా 198.43 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఖాళీ స్థలంతో సహా మరియు 374.53 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో భవన నిర్మాణ విస్తీర్ణంతో ఉంది. ఈ ఆస్తి వరంగల్ రిజిస్ట్రేషన్ జిల్లా మరియు నర్సంపేట జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోకి వస్తుంది. దీని సరిహద్దులు: తూర్పున-బానోతు మిట్టు ఇల్లు మరియు ఖాళీ స్థలం; పడమరన-బానోతు రెడ్యా భూమి; ఉత్తరాన-బానోతు బిచ్య ఇల్లు మరియు 12 అడుగుల వెడల్పు గల ప్రతిపాదిత రహదారి; దక్షిణాన-బానోతు రెడ్యా భూమి. | | |
| (Loan A/C No.) 24660000114794, మలోతు రమేష్ (రుణగ్రహీత) మలోతు వినోద, (సహ-రుణగ్రహీత) | 04-ఫిబ్రవరి-26 రూ.7,68,174/-, ఏడు లక్షల అరవై ఎనిమిది వేల ఒక వంద డెబ్బై నాలుగు రూపాయలు మాత్రమే 03-ఫిబ్రవరి-26 నాటికి | 22-జూన్-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం, లింగగిరి గ్రామం తోపనగడ్డ తండా గ్రామ పంచాయతీ పరిధిలో, నర్సంపేట జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉన్న ఆస్తి. ఇది 211.94 చదరపు గజాల లేదా 177.20 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, 506.25 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా నిర్మాణ విస్తీర్ణం కలిగి, ఇ.నం.4-49ఎ, ఆర్.సి.సి. పైకప్పుతో కూడిన ఇల్లు మరియు ఖాళీ స్థలాన్ని కలిగి ఉంది. దీని సరిహద్దులు: తూర్పున గ్రామ పంచాయతీ రోడ్డు, పడమరన మలోతు రమేష్ గారి ఖాళీ స్థలం, ఉత్తరాన మలోతు సంతోష్ గారి ఇల్లు, దక్షిణాన మలోతు వాలు గారి ఇల్లు. | | |
| (Loan A/C No.) 24660002761210, పసులాడి ప్రభుసాగర్, (రుణగ్రహీత) పసులాడి యాకమ్మ (సహ-రుణగ్రహీత) | 12-ఫిబ్రవరి-26 రూ.5,28,709/-, ఐదు లక్షల ఇరవై ఎనిమిది వేల ఏడు వందల తొమ్మిది రూపాయలు మాత్రమే 11-ఫిబ్రవరి-26 నాటికి | 22-జూన్-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: GWMC పరిధిలోని వరంగల్ నగరం, ఖిలా వరంగల్ మండలం, ఉరుసు రెవెన్యూ గ్రామం, కరీమాబాద్‌లో ఉన్న ఆస్తి GWMC ఇంటి నం. 17-2-169, (PTIN నం. 1116125740). ఇది 63.20 చదరపు గజాలు లేదా 52.84 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 274.00 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో సహా విస్తరించి ఉంది. ఇందులో ప్రస్తుతం A.C. షీట్ పైకప్పుతో ఉన్న ఇల్లు మరియు ఖాళీ స్థలం ఉన్నాయి. దీని కొలతలు: తూర్పు నుండి పడమరకు 18.9 నుండి 19.2 అడుగులు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 30.0 నుండి 30.0 అడుగులు. మొత్తం విస్తీర్ణం 274.00 చదరపు అడుగులు అందులో ఉన్న ప్రస్తుత మరియు భవిష్యత్తు నిర్మాణాలతో సహా. సరిహద్దులు: తూర్పున లతిమా ఇల్లు, పడమరన సి.సి. రోడ్డు, ఉత్తరాన Ch. మల్లేశం ఇల్లు, దక్షిణాన ఇంటి నం. 17-2-169/1. | | |
| (Loan A/C No.) 23630000089291 & 23630000107169, పెద్దపల్లి క్రిష్ణ, (రుణగ్రహీత), పెద్దపల్లి సుప్రజ, (సహ-రుణగ్రహీత) | 08-అక్టోబర్-25 రూ.13,94,918/-, పదమూడు లక్షల తొంభై నాలుగు వేల తొమ్మిది వందల పద్దెనిమిది రూపాయలు మాత్రమే & రూ.5,45,791/- ఐదు లక్షల నలభై ఐదు వేల ఏడు వందల తొంభై ఒకటి మాత్రమే 08-అక్టోబర్-25 నాటికి | 24-జూన్-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: GWMC పరిధిలోని వరంగల్ నగరం మరియు అర్బన్ జిల్లా, వరంగల్ ఫోర్ట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధికి చెందిన హంటర్ రోడ్, ఖిల్లా కోట ప్రాంతంలో ఉన్న ఉరుసు గ్రామం, సర్వే నంబర్ 660లో గల ఆస్తి ఇది. దీనిలో GWMC ఇంటి నంబర్ 12-8-217/24/1 కలిగిన RCC పైకప్పు గల ఇల్లు మరియు ఖాళీ స్థలం ఉన్నాయి. దీని విస్తీర్ణం 110.00 చదరపు గజాలు లేదా 91.97 చదరపు మీటర్లు. ఈ ఆస్తి సరిహద్దులు: తూర్పున- V. శారదాదేవి గారి స్థలం, పడమరన-V. శారదాదేవి గారి స్థలం, ఉత్తరాన-శ్రీ కృష్ణధామ్ ప్లాట్, దక్షిణాన-20 అడుగుల వెడల్పు గల రహదారి. | | |
| (Loan A/C No.) 23660000694042 & 24660000754898, మాలోతు సుధాకర్, (రుణగ్రహీత), మాలోతు రమాదేవి (సహ-రుణగ్రహీత) | 29-అక్టోబర్-25 రూ.11,65,002/-, పదకొండు లక్షల అరవై ఐదు వేల రెండు రూపాయలు మాత్రమే & రూ.1,75,885/- ఒక లక్ష డెబ్బై ఐదు వేల ఎనిమిది వందల ఎనభై ఐదు మాత్రమే 28-అక్టోబర్-25 నాటికి | 23-జూన్-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: సూర్యానాయక్ తండా గ్రామం మరియు గ్రామ పంచాయతీ, కొప్పుల రెవెన్యూ గ్రామం, శ్యాంపేట మండలం, హనుమకొండ జిల్లా పరిధిలో వరంగల్ రిజిస్ట్రేషన్ జిల్లా మరియు పరకాల జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉన్న ఆస్తి. ఇది G.P.H. నం. 1-145/2 కలిగి, 119.45 చదరపు గజాలు 99.87 చదరపు మీటర్లకు సమానం విస్తీర్ణంలో మరియు 487.65 చదరపు మీటర్ల RCC రూఫ్ ప్లింత్ ఏరియాతో కూడిన ఇల్లు మరియు ఖాళీ స్థలం. దీని సరిహద్దులు: తూర్పున - G.P. రోడ్డు, పడమరన-మలోతు భాస్కర్ గారి ఖాళీ స్థలం, ఉత్తరాన- G.P. రోడ్డు, దక్షిణాన- G.P. రోడ్డు. | | |

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు (చట్టం 2002) నిబంధన 8తో చదువబడే అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకం చేసిన వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8(6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించబడ్డాడు".
ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.
తేది: 26/06/2026 ప్రదేశం : వరంగల్, తెలంగాణ సం/- అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.



## ప్రొబేషనరీ డిఎస్‌పిలకు మహిళల భద్రతపై అవగాహన సదస్సు

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు అకాడమిలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డిఎస్‌పిలకు మహిళల భద్రతకు సంబంధించి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. హిమాయత్‌సాగర్‌లో గల పోలీసు అకాడమిలో జరిగిన ఈ సదస్సుకు సిఐడి చీఫ్ చారుసిన్హా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రాంతాలలో భద్రతాపరంగా ఎదర్కొంటున్న సమస్యలు అనేకం వున్నాయని తెలిపారు. దీనికి సంబంధించి దేశ వ్యాప్తంగా అనేకచోట్ల ఉద్యోగాలు చేస్తున్న మహిళలు తాము ఎదుర్కొంటున్న ఇప్పుడిప్పుడే ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయాలను ఆమె వివరించారు. ఈ క్రమంలో పని ప్రదేశాలలో మహిళలకు మరింత భద్రత అవసరమని ఆమె అన్నారు. ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో చాలా మంది లైంగిక వేధి ంపులు వున్నాయని, దీని నివారణకు వున్న చట్టం గురించి చారు సిన్హా శిక్షణలో వున్న డిఎస్‌పిలకు వివరించారు. లైంగిక వేధింపులతో పాటు ఇతరత్రా వేధింపులు కూడా మహిళా ఉద్యోగులు ఎదర్కొంటున్న సమస్యల్లో ముఖ్యమైనవిగా ఆమె తెలిపారు. వృత్తిపరంగా మహిళలకు అనేక సవాళ్లు వుంటాయని, ఇందుకోసం మహిళలకు రక్షణ కల్పించే చట్టాలు కొత్తగా అందుబాటులో వచ్చాయని, వీటిని పోలీసు అధికారులంతా కచ్చి తంగా తెలుసుకుని అమలు చేయాల్సిన అవసరం వుందని ఆమె వెల్లడించారు. మహిళలకు ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయం జరగాల్సిందేదనని ఆమె చెప్పారు. మహిళలపై జరిగే దాడులు, అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల్లో నిందితులకు కచ్చితంగా శిక్షలు పడాలని ఆమె పేర్కొన్నారు. మహిళలకు పనిచేసే ప్రదేశాలలో మంచి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఆయా సంస్థలదేనని ఆమె తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శిక్షణలో వున్న డిఎస్‌పిలు ఇప్పటి వరకు నేర్చుకున్న అంశాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శిక్షణార్థుల ప్రతి భను సిఐడి చీఫ్ ప్రశంసించారు. ఈ సదస్సులో అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో కుల బహిష్కరణ కలకలం

### దేవుడి నైవేద్యం ఇవ్వలేదని కులపెద్దల ఏకపక్ష నిర్ణయం

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా తాడ్వాయి పోలీసు స్టేషన్ పరిధిలో గిరిజన కుటుంబాల్లో కుల దైవం పూజ అనంతరం నైవేద్యం విషయంలో తలెత్తిన వివాదం కారణంగా కుల పెద్దలు మూడు కుటుంబాలను కుల బహిష్కరణ చేయడం కలకలం రేపింది. దీనిపై ఫిర్యాదు అందుకున్న తాడ్వాయి పోలీసులు కుల పెద్దలతో పాటు బహిష్కరణకు గురైన కుటుంబాలతో మాట్లాడి వివాదం సమసిపోయేలా చేస్తు న్నారు. వివరాలు ఇలావున్నాయి. తాడ్వాయి మండలం సోమారం తాండకు చెందిన సభావత్ దరి, అతని అన్న కుమారులు రాజు, రవిలు మూడు రోజుల క్రితం తాముండే ప్రాంతంలో కుల దైవానికి పూజచేసి రెండు మేకలను బలిఇచ్చారు. అనంతరం మేకల మాంసాన్ని నైవేద్యంగా పంపిణీ చేసే విషయంలో కొందరితో వివాదం తలెత్తింది. తమకు నైవేద్యం అందలేదని తాండకు చెందిన కొందరు కుల పెద్దలకు ఫిర్యాదు చే యడంతో సభావత్ దరితో పాటు రాజు, రవి కుటుంబాలను కుల బహిష్కరణ చేసి, వారితో తాండాకు చెందిన వారు ఎవరూ మాట్లాడరాదని ఆదేశించారు. ఈ విషయం తాండాలో వివాదంగా మారింది. దీనిపై దరి, రాజు, రవి తమను కుల బహిష్కరణ చేయడంపై తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొత్తం ఎనిమిది మందిపై వారు ఫిర్యాదు చేశారు. తమను అకారణంగా కుల బహిష్కరణ చేశారని, నైవేద్యం విషయంలో అంతా కుల కట్టుబాట్లకు అనుగుణంగానే వ్యవహరించామని వారు తమ ఫిర్యాదులో తెలిపారు. ఈ ఫిర్యాదుపై తాడ్వాయి పోలీసులు వెంటనే రంగంలో దిగి వివాదం పెద్దది కాకుండా ఇరువర్గాల వారితో మాట్లాడి వివాదం పరిష్కరించేందుకు చర్యలు చేబట్టారు. ఈ వివాదం ఒ కటి రెండు రోజుల్లో పరిష్కారం అవుతుందని తాడ్వాయి ఎస్ఐ మహేష్ తెలిపారు.

## సోమవారం నుంచి డిఇఇసెట్ 3వ విడత కౌన్సెలింగ్

### 30న వెబ్‌ఆప్షన్లు.. జులై 4న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యు కేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజిడీఈఈ సెట్)-2026 అర్హత సాధించిన వారికి సోమవారం నుంచి 3వ విడత కౌన్సె లింగ్‌ను నిర్వహించనున్నారు. 2026-27 విద్యా సంవత్సరం కోసం తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్స్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ (డీఈఎల్.ఈడీ) (మైనారిటీ, నాన్‌మైనారిటీతో సహా)లో రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి డీఈఈ సెట్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. డీఈఈ సెట్-2026 ద్వారా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్.ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ)లో ప్రవేశాలను తీసుకోనున్నారు. పరీక్షకు 32,592 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 25,054 మంది హాజరయ్యారు. అందులో 21,137 మంది(84.36శాతం) అర్హత సాధించారు. ఈ నెల 2 నుంచి రాష్ట్రంలోని 10 డైట్ కాలేజీల్లో కౌన్సె లింగ్ ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటికే రెండు విడతల్లో కౌన్సె లింగ్ నిర్వహించగా.. సోమవారం నుంచి 3వ విడత కౌన్సె లింగ్‌ను నిర్వహించనున్నట్లు డీఈఈ సెట్-2026 కన్వీనర్ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఈ సెట్‌లో అర్హత సాధించి మొదటి, రెండవ విడతల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరు కాని అభ్యర్థులు సోమవారం హాజరు కావాలని సూచించారు. ఈ నెల 30న వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి జులై 4న సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన అభ్యర్థులు జులై 4 నుంచి 6 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో చేరాలని కన్వీనర్ సూచించారు.

## అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

### ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శికి ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా అద్దెభవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గురుకుల కార్యదర్శి శారదాను రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రజనీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కిరణ్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం. మమత కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం రజనీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అనేక గురుకులాలు ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 'యంగ్ ఇండియా గురుకులాలు' పేరుతో ప్రకటనలు చేస్తున్నప్పటికీ, ఆచరణలో కొత్త భవనాల నిర్మాణం చేపట్టడం లేదన్నారు. ఇప్పటికీ విద్యార్థులకు కొత్త యూనిఫాంలు అందించకపోవడంతో గత యేడాది యూనిఫాంలనే వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, లెక్చరర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

# ముందుకు మూడు అడుగులు.. చుట్టూ ఒక అడుగే

### ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై పరిమితులు

### ఇళ్ల స్లాబు 500 నుంచి 750 చదరపు అడుగులు

### ఉత్తర్వులు జారీ చేసిన గృహ నిర్మాణ శాఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 27:** ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ విస్తీర్ణంపై ప్రభుత్వం శనివారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇందిరమ్మ ఇళ్ల స్లాబు 750 చదరపు అడుగులకు మించరాదని గృహ నిర్మాణ శాఖ స్పష్టం చేసింది. ముందు వైపు 3 అడుగులు, మిగతా వైపు ఒక అడుగు మాత్రమే ముందుకు రావాలని తెలిపింది. ఇంట్లోకి ఎండ, వర్షం రాకుండా అవసరమైతే సజ్జలు నిర్మించుకోవాలని సూచించింది. స్లాబ్ ఎక్కువ వేసి ఖర్చు పెరగడంతో లబ్దిదారులు అనవసర అప్పులు చేస్తున్నట్లు గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు గృహ నిర్మాణ శాఖ వెల్లడించింది. కొత్త వాటితో పాటు ప్రస్తుతం రూఫ్ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఇందిరమ్మ ఇళ్ల స్లాబు ఇక నుంచి ఇష్టం వచ్చిన సైజులో నిర్మించడానికి వీల్లేదు. స్లాబు ఎంత విస్తీర్ణం ఉండాలో ప్రభుత్వం విధివిధానాలు వెల్లడించింది. స్లాబు 700 చదరపు అడుగులకు మించరాదని స్పష్టం చేస్తూ గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు లక్ష ఇందిరమ్మ ఇళ్లు పూర్తి కాగా, మరో లక్ష ఇళ్లు ఈ సెప్టెంబర్ నాటికి పూర్తవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు రెండో విడత ఇళ్ల కేటాయింపునకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.స్థలం ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తోంది. అయితే ఖర్చు ఎక్కువ వుతోందని కొందరు మధ్యలో నిర్మాణాలు ఆపడం, మరికొందరు ప్రారంభించక పోవడాన్ని గుర్తించిన హౌసింగ్ కార్పొరేషన్ వ్యయంపై అధ్యయనం చేసింది. చాలా మంది స్లాబ్ ఎక్కువ సైజులో నిర్మిస్తున్నట్లు గుర్తించింది. కొంతమంది గోడల కన్నా సుమారు 8 అడుగుల వరకు ముందుకున్నట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. పెద్ద స్లాబు నిర్మించడం వల్ల ఖర్చు పెరిగి, కొందరు లబ్ధిదారులు అప్పులు చేయాల్సి వచ్చి నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేస్తున్నట్లు గుర్తించారు. దానివల్ల పేదలు ఇళ్ల నిర్మాణం కోసం సబ్సిడీ నిధుల ఇచ్చే ప్రధాన లక్ష్యమే దెబ్బతింటోందని ప్రభుత్వం పేర్కొంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని స్లాబ్ విస్తీర్ణంపై పరిమితులు విధించాలని హౌసింగ్ కార్పొరేషన్ కోరడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటి ముందు వైపు గోడ కన్నా 3 అడుగులు, మిగతా వైపు ఒక అడుగు మాత్రమే స్లాబ్ ఉండాలని జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉదాహరణకు 400 చదరపు అడుగుల ఇంటికి 500 చదరపు అడుగుల వరకు, 600 ఎస్ఎఫ్టీ ఇంటికి 750 చదరపు అడుగుల వరకు మాత్రమే స్లాబు ఉండాలని పరిమితి విధించింది. ఇంట్లోకి ఎండ, వాన రాకుండా ఉండేందుకు స్లాబు పెంచడానికి బదులుగా తలుపులు, కిటికీల పైన సజ్జలు, సన్‌షేడ్‌లు నిర్మించేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని హౌసింగ్ కార్పొరేషన్ అధికారులకు ప్రభుత్వం తెలిపింది. ఎండ రాకుండా ఆర్‌సీసీ స్లాబు పెంచే బదులుగా అవసరమైతే రేకులు వేసుకునేలా లబ్ధిదారులకు వివరించాలని పేర్కొంది. కొత్తగా నిర్మించే ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇప్పుడు బేస్‌మెంట్, రూఫ్ లెవెల్‌లో ఉన్న నిర్మాణాలకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని ప్రభుత్వం వెల్లడించింది. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బంది ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించింది.

## ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీ అమలు

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టీసీ) కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. ఆర్‌టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క నేతృత్వంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుతోపాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, ఆర్‌టీసీ ఎండీ నాగిరెడ్డితోపాటు ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తు చేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్‌టీసీ యాజమాన్యం పరిధిలో ఉన్నాయని, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కా రానికి ఈడిల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్‌టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్‌టీసీ ప్రభుత్వంలో విలీనం ఉన్నాయన్నారు. అందులో పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జులై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందన్నారు.

ఆర్‌టీసీ విలీనానికి సంబం ధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి గుర్తు చేశారు. ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే ప్రక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన ప్రక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

## విద్యారంగ సమస్యలపై తపస్ నిరసన ధర్నాలు

### జులై 14న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు

### 22న హైదరాబాద్‌లో మహాధర్నా

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆందోళన బాట పట్టనుంది. జులై 4 నుంచి 22 వరకు ఆందోళన, నిరసన కార్యక్రమాలను చేపట్టిలని నిర్ణయించినట్టు సంగం రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య తెలిపారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)-2020 అమలు చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యా రంగ, ఉపాధ్యాయ సమస్యలకు పరిష్కారం కోరుతూ జులై 4న మండల, కాంప్లెక్స్ స్థాయిలో, జులై 14న జిల్లా స్థాయిలో ధర్నా చేయనున్నట్టు తెలిపారు. జులై 22 రాష్ట్ర స్థాయి ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు. పిఆర్‌సి కమిషన్ రిపోర్ట్‌ను తెప్పించుకొని 51 శాతం ఫిట్‌మెంట్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల పెండింగ్ బిల్లులను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డిఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. 317 జీవో బాధితులకు ఉపశమనం కలిగించేలా తీసుకొచ్చిన 190 జీవో ప్రకారం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులందరికీ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ తరహాలో పాత పెన్షన్ పథకం వర్తింప జేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సిపిఎస్‌ను రద్దుచేసి అందరికీ పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలన్నారు. కేజీబీవీ మహిళా ఉపాధ్యాయుల 29 రోజుల సమ్మె కాలపు జీతాన్ని చెల్లిస్తూ, వారికి మినిమం టైం స్కేలు వర్తింపజేయాలన్నారు. మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని, పాఠశాల మౌలిక వసతుల కల్పనలో భాగంగా పాఠశాల గ్రాంట్స్‌లను జూలై మొదటి వారంలోనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అమ్మ అదర్శ పాఠశాల నిధులను విడుదల చేయాలన్నారు. గిరిజన, ఆశ్రమ, బిసి, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్, సాధారణ, ఏయిడెడ్ లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల, గురుకుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణను విడుదల చేయాలన్నారు.

## గోల్డ్‌మాన్ సూర్యభాయ్ అరెస్టు.. చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో గోల్డ్ మ్యాన్‌గా పేరొందిన పాతబస్తీకి చెందిన పల్లపు సురేష్ కుమార్ అలియాస్ సూర్య ఊరఫ్ సూర్య భాయ్‌ను నారాయణగూడ పోలీసులు చీటింగ్ కేసులో శనివారం అరెస్టుచేసి రిమాండుకు తరలించారు. తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని నమ్మించి అమాయకుల నుంచి 30 లక్షల రూపా యలకుపైగా తీసుకుని వారిని మోసం చేసిన ఘటనలో మొదట అత్తా పూర్ పోలీసు స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు కాగా ఆ తరువాత దీనిని నారాయణగూడ పోలీసు స్టేషన్‌కు బదిలీ అవడం తెలిసిందే. ఈ కే సులో సూర్యను విచారణకు రావాలని పోలీసులు కోరగా అతను స్పందించలేదు.

ఇదే సమయంలో అతను అత్తాపూర్‌లోని తన ఇంటికి తాళం వేసి షాద్‌నగర్ వైపు పారిపోతుండగా అక్కడ పోలీసులు అతన్ని పట్టుకుని నారాయణగూడ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

శుక్రవారం అత్తాపూర్‌లోని అతని ఇంటి వద్ద హైడ్రామా చోటుచేసుకోవడం తెలిసిందే. హిమాయత్‌నగర్‌కు చెందిన 30 మంది నుంచి తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని నమ్మించిన సూర్య 30 లక్షల రూపాయలకు పైగా తీసుకుని మోసం చేయడంతో వారంతా అతని ఇంటి వద్ద ఆందోళనకు దిగడం విదితమే. తనకు సిఎం రేవంత్ రెడ్డి తెలుసునని, సిఎం కార్యాలయంలో చాలా మంది తెలుసునని ఇంటివద్ద ఆందోళనకు దిగిన వారిని నమ్మి ంచేందుకు యత్నించినా వారు వినిపించుకోలేదు.
తమ డబ్బులు వెంటనే ఇవ్వాలని వారు కోరడంతో తన వద్ద వున్న రెండు సెల్‌ఫోన్లను, 20 లక్షల రూపాయల చెక్కు ఇచ్చాడు. దీని తరువాత బాధితులు అక్కడి నుంచి వెళ్లిపోగా సూర్య నేరుగా అత్తాపూర్ పోలీసులకు ఫోన్ చేసి తన ఇంటి వద్దకు కొందరు వచ్చి తనపై దాడిచేసి సెల్‌ఫోన్లను లాక్కుని వెళ్లారని ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలో దిగిన పోలీసులు సూర్య ఇంటి కి వెళ్లిన వారిని అత్తాపూర్ పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా అసలు విషయం రట్టయ్యింది. దీంతో పోలీసులు మొదట జిరో ఎఫ్ఐఆ ర్ నమోదు చేసి సూర్య గోల్‌మాల్‌పై నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేయాలని అత్తాపూర్ పోలీసులు బాధితులను కోరారు. దీంతో పాటు తమ వద్ద నమోదైన జిరో ఎఫ్ఐఆర్‌ను నారాయణగూడ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. దీని తరువాత నారాయణగూడ పోలీసులు రంగంలో దిగి నిందితుడిని అరెస్టుచేసి సూర్య అక్రమాలు నిజమేనని నిర్ధారించి శనివారం సాయంత్రం రిమాండుకు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా సూర్య తరపు న్యాయవాదులు కొద్దిసేపు పోలీసు స్టేషన్‌లో పోలీసులతో పాటు బాధితులతో వాగ్వివాదానికి దిగడంతో హైడ్రామా చోటుచేసుకుంది.

## అష్టోత్తర శతవైణిక నాదయజ్ఞం

### ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జూన్ 27, ప్రభాతవార్త :** నేత్రపర్వంగా వీనులవిందు చేసిన నేటి అష్టోత్తర శతవైణిక నాదయజ్ఞం వేళ మహామహోపాధ్యాయ పద్మశ్రీ ఈమని శంకరశాస్త్రిని తప్పక స్మరించు కోవాల్సిన అవసరముందని, ఆ మహానుభావుడు వీణావాద విద్వాం సుడుగా ఒక నాదయోగిగా ఎంత పేరుతెచ్చుకున్నాడో ఆయన్ను ఆద ర్శంగా తీసుకుని అతని వారసులుగా ఈరోజు ప్రఖ్యాత జాతీయ కళామందిర వేదికను పునీతం చేస్తూ 108 మందికిపైగా విభిన్న వయస్కుల మహిళామూర్తులు మేమూ వీణా విద్వాంసులుగా ఉన్నా మని అద్భుత ప్రదర్శనతో చాటుకొని విశ్వవిఖ్యాతి గాంచడం ఆనందదాయకమని ప్రభుత్వ మాజీ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు.

వీణానాదంలో గొప్పకళుందని, గాయకులకు గొంతు కంఠంలో ఉంటే ఈ వీణావాద విద్వాంసుల గొంతు వీణ తీగల్లో ఉంటుందని చమత్కరించారు. శ్రీమానస ఆర్ట్ థియేటర్స్ 45వ వార్షికోత్స వాలను పురస్కరించుకుని దివ్యసాయి వీణా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం ప్రఖ్యాత వీణానాద విద్వాంసురాలు డా. కళ్యాణి హేమలత నేతృత్వంలో 108మంది ప్రఖ్యాత వీణావాద్య కళాకారిణుల అష్టోత్తర శతవైణిక నాదయజ్ఞంలో వీణావాద్య మాధుర్యంతో హోరెత్తించి సభికులను భక్తిరస సంగీతలోకంలో ఓలలాడించారు. దివ్యసాయి వీణా అకాడమీ అధ్యక్షుడు పి.వరప్రసాద్ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా. కె.వి.రమణాచారి విచ్చేసి విశిష్ట అతిథులు సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, డా. ఝాన్సీ రామ్, ఇంటర్నేషనల్ వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్, మీనాక్షి శ్రీనివాస్, గోవిందరాజన్, హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ ఎడిసిపి రామదాస్ తేజావత్, రామచంద్రరావు, రఘుశ్రీ, డా. కళ్యాణి హేమలత తదితరులు పాల్గొని డా. కె.వి.రమణాచారి, పుష్పలత దంపతులను, వీణానాద కళాకారు లను, గురువులు, సంగీత ప్రముఖులను ఘనంగా సత్కరించారు. చివరిగా 108 మంది వీణానాద కళాకారిణులు అష్టోత్తర శతవైణిక నాదయజ్ఞాన్ని ఇంటర్నేషనల్ వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్‌లో నమోదు చేసి నట్లు సంస్థ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ రికార్డ్ నమోదు పత్రాన్ని డా. కె.వి.రమణాచారి చేతులమీదుగా వీణా అకాడమీ వ్యవస్థాపకురాలు డా. కళ్యాణి హేమలతకు అందజేశారు.




ఇంటర్నేషనల్ వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను డా. కళ్యాణి హేమలతకు అందజేస్తున్న డా. రమణాచారి, నరేందర్‌గౌడ్, దైవజ్ఞశర్మ, వరప్రసాద్, రామచంద్రరావు, రఘుశ్రీ తదితరులు

## నాకు భద్రత తగ్గించినా ప్రశ్నించడాన్ని ఆపను

### బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్27:** తనకు భద్రత తగ్గించినా ప్రశ్నించడాన్ని ఆపను అని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తేల్చిచెప్పారు. తనపై ఇప్పటివరకు మూడుసార్లు హత్యాయత్నం జరిగిం దని.. అయినా తనకు సెక్యూరిటీని తగ్గించారని అన్నారు. తన డ్రైవర్‌కు ఫోన్ చేసి కార్ తీసుకుని రమ్మన్నారని.. రేవంత్‌రెడ్డి సోదరుడికి నలుగురు గన్‌మెన్లు ఇచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతిరెడ్డి ఏమైనా తెలంగాణ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసరా..? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తనను కాంగ్రెస్ పార్టీలోకి రమ్మన్నారని చెప్పారు. తనకు టిజిపిఎస్సి చైర్మన్ ఇస్తానంటే వద్దు అన్నానని.. ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ పదవి వద్దని చెప్పానని పేర్కొన్నారు. తాను బిఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని స్పష్టం చేశారు. తాను ఆధారాలతోనే మాట్లాడతాను అని తెలిపారు. బండి భగీరథ్ అంశంలో సిఎం చేసిన తప్పును బయటపెట్టాను అని చెప్పారు. తాను మాట్లాడే అంశాలను రేవంత్ రెడ్డి తట్టుకోలేకపోతున్నారని ఆరోపించారు. రాష్ట్ర గురుకులాల్లో రూ.2 వేల కోట్ల కుంభకోణం జరుగుతున్నదని ఆరోపించారు. మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్‌కు స్క్రిప్టు ఇచ్చి తమపై మాట్లాడించారని మండిపడ్డారు. ఫైల్స్ సంబంధిత శాఖ మంత్రుల వద్దకు వెళ్లడం లేదని.. వాటిపై సిఎం సంతకం చేస్తున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలన అని బాకాలు ఊదుతున్న సిఎం... ట్రంక్ బాక్సుల కాంట్రాక్టు డ్రగ్స్ సప్లయిర్ నిరంజన్ జైన్‌కు ఇచ్చారని ఆరోపించారు. ట్రంక్ బాక్సుల పేరుతో పిల్లలకు డ్రగ్స్ సప్లై చేయరని గ్యారెంటీ ఏముందని ప్రశ్నించారు. మఫత్లాల్‌కు వేం నరేందర్‌రెడ్డికి సంబంధం ఏంటని నిలదీశారు. టెస్కో రాజేష్ అగర్వాల్ అనే వ్యక్తికి బట్టల సప్లై కాంట్రాక్టు ఇచ్చారన్నారు. జులై 2వ తేదీన ఉదయం 11 గంటలకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్ వస్తామని.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ప్రభుత్వ పెద్దలకు జైవీర్‌రెడ్డి, రమేష్ జైన్, నిరంజన్ జైన్ గన్నీ బ్యాగుల్లో డబ్బులు పంపుతున్నారని ఆరోపిం చారు. బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే అన్నింటిపైనా విచారణ చేస్తామని హెచ్చరించారు.

## కొండెక్కిన కోడి

### భారీగా రూ.300కు చేరిన చికెన్

### గుడ్డు ధర రూ.8

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త :** అసలే వీకెండ్ ఆపై కమ్మేసిన మబ్బులు. వాతావరణం చల్లగా ఉండటంతో నాన్ వెజ్‌తో ఎంజాయ్ చేద్దామనుకునే వారికి బ్యాడ్ న్యూస్. ఇప్పటికే మటన్ రూ.వెయ్యికి దగ్గరలో ఉంది. చికెన్ ధర కూడా చుక్కలనంటింది. ఇక కోడిగుడ్డుతో అయినా సరిపెట్టుకుందామంటే దాని ధర సైతం భారీగా పెరుగుతున్నది. ఇక కూరగాయల గురించి అయితే ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. మొన్నటి వరకు రూ.250కే దొరికిన కేజీ బాయిలర్ చికెన్ ఇప్పుడు రూ.300కు చేరింది. రెండు మూడు వారాల వ్యవధిలోనే రూ.50 పెరిగింది.

హైదరాబాద్‌లో కిలో స్కిన్ లెస్ చికెన్ రూ.292 వద్ద కొనసాగుతోండగా, డ్రస్స్‌డ్ చికెన్ రూ.259కి చేరుకుంది. ఇక ఎక్స్ ఫారం లైవ్ బర్డ్ రూ.140, రిటైల్ లైవ్ బర్డ్ రూ.167గా ఉంది. అలాగే సామాన్యుడి అందుబాటు ధరల్లో ఉండే ఎగ్ ధర కూడా పెరిగింది. చికెన్ ధరలకు కోడి గుడ్డు కూడా తోడయింది.

ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్క గుడ్డు రూ.8కి అమ్ముతున్నారు. ఏప్రిల్‌లో రూ.4గా ఉన్న ఒక్కో గుడ్డు ధర మే నాటికి రూ.5కి చేరుకుంది. ఇక జూన్ మొదటివారంలో రూ.6గా ఉండగా, ప్రస్తుతం రూ.8కి పెరిగింది. తొందరలోనే ఒక్క ఎగ్ ధర రూ.10కి చేరుకోవచ్చని పౌల్ట్రీ నిపుణులు చెబుతున్నారు. వేసవిలో ఎండ తీవ్రతతో 10 శాతం కోళ్లు చనిపోయాయని, దీంతో ఉత్పత్తి తగ్గిందని, వీటికితోడు కోళ్ల మేత, మందుల ధరలు కూడా పెరగడంతో గుడ్ల ధరలు పెరుగుతున్నాయని అంటున్నారు.

## ఫర్టిలైజర్ యాప్‌లో సాంకేతిక లోపాలు

### మొరాయిస్తోన్న యూరియా బుకింగ్

### పలు జిల్లాల్లో కనిపించని యాప్.. ఆందోళనలో రైతాంగం

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో ఎరువుల పంపిణీ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ క్షేత్రస్థాయిలో తీవ్ర సాంకేతిక లోపాలు, సర్వర్ సమస్యలతో మొరాయిస్తోంది. దీంతో యూరియా తదితర ఎరువులు లభ్యం కాక రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. యాప్ ద్వారా యూరియా బుక్ చేసే సమయంలో ఓటీపీ సకాలంలో రాకపోవడం, ఆలస్యంగా వచ్చి సమయం ముగిసి పోవడం జరుగుతోందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కౌలు రైతులకు ఇది పెద్ద సమస్యగా మారింది. అలాగే యాప్‌లో రోజువారీ ఎరువుల నిల్వలు అప్‌డేట్ అయిన 10 నుండి 15 నిమిషాల్లోనే స్టాక్ అయిపోతున్నట్లు చూపిస్తుండటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. యాప్ సరిగ్గా ఓపెన్ కాకపోవడం, లాగిన్ సమస్యలు, జిల్లాల పేర్లు కనిపించకపోవడం వంటి సాంకేతిక సమస్యలు ఉన్నాయి. బుకింగ్ సమయంలో ఇతర ప్రాంతాల్లో ఉన్న రైతులు తమ మండలంలో ఎరువులు బుక్ చేసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. వీటికి తగినట్లుగా వానాకాలం సాగు పనులు ఊపందుకుంటున్న తరుణంలో ఈ యాప్‌లో పలు జిల్లాలు కనిపించకుండా పోతున్నాయి. ఇందులో భాగంగా ఫర్టిలైజర్స్ యాప్‌లోని జిల్లాల జాబితా నుంచి రంగారెడ్డి, మల్కాజిగిరి జిల్లాలు పూర్తిగా కనిపించకుండాపోయాయి. దీంతో ఆయా జిల్లాల పరిధిలోని వేలాది మంది రైతులు యూరియాను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోలేక అష్టకష్టాలు పడుతున్నారు. పంటలకు యూరియా వేయాల్సిన కీలకమైన సమయంలో యాప్‌లో సాంకేతిక సమస్య తలెత్తడం, డీలర్లు యాప్ బుకింగ్ ఉంటేనే స్టాక్ ఇస్తామని తెగేసి చెప్పడంతో సొసైటీల చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఉట్నూర్ నుంచి బెంగళూరు వరకు పల్లె యువతకు ప్రపంచస్థాయి భవిష్యత్తు

## అత్యాధునిక శిక్షణతోనే ఎంఎన్‌సిల్లో ఉద్యోగాలు

## ఏటిసిలకు మహత్తర స్పందన: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 27:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు) రాష్ట్ర యువత జీవితాలను మార్చేస్తున్నాయి. నైపుణ్యంతోనే భవిష్యత్తుకు పునాదనే యోచనతో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయం శనివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ప్రభుత్వ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) సాధించిన విజయం యావత్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది. గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు చెందిన యువతకు ప్రపంచ స్థాయి సాంకేతిక నైపుణ్యాలు అందించి, ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఉట్నూర్ ఏటీసీ ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. ఈ కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థుల్లో ఏకంగా 99 మంది ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం విశేషం. తెలంగాణలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు సరైన దిశలో సాగుతున్నాయనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టి, పరిమిత వనరులతో చదువుకున్న విద్యార్థులు నేడు అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం వెనుక రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అందించిన ఆధునిక శిక్షణ, పరిశ్రమలకు అనుగుణంగా రూపొందించిన కోర్సులు, నిపుణుల మార్గదర్శకత్వం కీలక పాత్ర పోషించాయి. ప్రతిభకు అవకాశం కల్పిస్తే పల్లె యువత కూడా ప్రపంచ స్థాయిలో సత్తా చాటగలరని ఉట్నూర్ విద్యార్థులు మరోసారి నిరూపించారు. పక్కా గ్రామీణ ప్రాంతమైన ఉట్నూర్ ఏటీసీలో శిక్షణ పొందిన విద్యార్థులను ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మల్టీ నేషనల్ కంపెనీలు నేరుగా ఎంపిక చేశాయి. ష్నైడర్ ఎలక్ట్రిక్ 47 మందికి, టాటా మోటార్స్ (పుణె) 36 మందికి ఉద్యోగాలు ఇచ్చింది. అలాగే బెంగళూరులోని ఫాక్స్‌కాన్ ఆపిల్ ఐఫోన్ డివిజన్ 14 మంది యువతులను ఎంపిక చేసింది. మంచి వేతన ప్యాకేజీలతో ఉద్యోగాలు రావడంతో వారి కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. పల్లె నుంచి బెంగళూరు వరకు యువత ప్రయాణం సాధ్యమవుతుందనే నమ్మకాన్ని ఈ విజయగాథ కల్పించింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి నిర్వహిస్తున్న ఏటీసీలలో విద్యార్థులకు ఇండస్ట్రీ 4.0, సీఎన్‌సీ మెషినింగ్, రోబోటిక్స్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ వెహికల్స్, అడ్వాన్స్‌డ్ సిమ్యులేషన్ టెక్నాలజీ వంటి ఆధునిక కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ స్థాయి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలనే బోధించడం వల్ల ప్రముఖ కంపెనీలు నేరుగా క్యాంపస్‌కు వచ్చి నియామకాలు చేపడుతున్నాయి. పరిశ్రమ అవసరాలు, శిక్షణ మధ్య ఉన్న అంతరాన్ని ఏటీసీలు సమర్థంగా తగ్గిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఏటీసీల్లో కోర్సులను అభ్యసించి ఉద్యోగం సాధించిన, ఈ విజయం కేవలం ఉద్యోగాలకే పరిమితం కాదు. పల్లె లేదా గిరిజన ప్రాంతంలో జన్మించడం భవిష్యత్తుకు అడ్డంకి కాదని, సరైన అవకాశాలు, నాణ్యమైన శిక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే ప్రపంచ స్థాయి కంపెనీల్లో కూడా ఉద్యోగాలు సాధించవచ్చని ఉట్నూర్ విద్యార్థులు నిరూపించారు. ప్రతిభకు ప్రాంతం అడ్డంకాదని, నైపుణ్యమే అసలు అర్హత అని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణను దేశంలోనే స్కిల్ క్యాపిటల్ గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యానికి ఉట్నూర్ ఏటీసీ తొలి విజయగాథగా నిలిచింది.

**తెలంగాణ రైజింగ్ విజన్‌కు ప్రపంచ దిగ్గజ కంపెనీల మద్దతు: ఎక్స్ వేదికగా సిఎం రేవంత్‌రెడ్డి**

తమ ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' విజన్ దేశీయ, అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో శిక్షణ పొందిన యువతకు ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని వివరించారు. ఈ మేరకు సీఎం ఎక్స్‌వేదికగా పోస్టు పెట్టారు. ఇటీవల జరిగిన నియామకాల్లో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థలో 47 మంది యువకులు ఉద్యోగాలు పొందారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పుణెలోని టాటా మోటార్స్ యూనిట్‌లో 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పుకొచ్చారు. అలాగే ఫాక్స్‌కాన్ సంస్థకు చెందిన ఆపిల్ ఐఫోన్ విభాగంలో 14 మంది మహిళా విద్యార్థినులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. బ్లూ కాలర్ ఉద్యోగాల రంగంలో తెలంగాణను దేశానికి కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందిస్తూ, ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు.



ఉట్నూర్ ప్రభుత్వ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో శిక్షకుడితో విద్యార్థులు

# దేశానికి దిశానిర్దేశం చేసిన నాయకుడు పివి

## ఢిల్లీలో 105జయంతి సందర్భంగా ప్రదర్శన: ఎన్వీ సుభాష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 27:** ఢిల్లీలో పీవీ 105వ జయంతి సందర్భంగా 'ఏ స్టేట్స్‌మెన్స్ జర్నీ' ప్రదర్శన ప్రారంభించామని, మాజీ ప్రధానమంత్రులకు గౌరవం కల్పించేందుకే ప్రధాని సంగ్రహాలయం ఏర్పాటు చేసినట్టు తెలంగాణ బిజెపిమీడియా ఇన్‌చార్జి ఎన్వీ సుభాష్ తెలిపారు. సాధారణ కుటుంబం నుంచి దేశాన్ని నడిపించిన మహానేత పీవీ అని పేర్కొన్నారు. భారత ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన నాయకుడు పీవీ నరసింహారావు, నేటి బలమైన భారత ఆర్థిక వ్యవస్థకు పీవీ సంస్కరణలే కారణం అని పేర్కొన్నారు. సంఖ్యాబలం తక్కువైనా దేశ ప్రయోజనాల కోసం కీలక నిర్ణయాలు తీసుకున్న నేత పీవీ అని చెప్పారు. దేశం ముందు, పార్టీ, కుటుంబం తర్వాతే అన్న సిద్ధాంతంతో పనిచేసిన నాయకుడు పీవీ అని చెప్పారు. పీవీకి భారతరత్న ఇవ్వడం ద్వారా తగిన గౌరవం ప్రధాని మోదీ కల్పించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం జీవితాంతం పనిచేసిన పీవీని... కాంగ్రెస్ అవమానపరిచిందే, ప్రధాని మోదీ రాజకీయాలకు అతీతంగా తగిన గుర్తింపు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రధానిగా పీవీ దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్లే ప్రధాని మోదీ అంతర్జాతీయంగా మన దేశానికి తగిన గుర్తింపు తీసుకువస్తున్నారని చెప్పారు. యువత పీవీ జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని సుభాష్ పిలుపునిచ్చారు. భారతదేశ భవిష్యత్తును నిర్ధారించేది కేవలం భారతీయ జనతా పార్టీ మాత్రమేనని చెప్పారు. దేశభక్తి, జాతీయ భావాలు కలిగిన పార్టీ భారతీయ జనతా పార్టీ, ఎంతో భవిష్యత్తు కలిగిన యువతకు బిజెపి మాత్రమే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తూ విశ్వ గురువుగా నిలిపారని పేర్కొన్నారు.



శనివారం సచివాలయంలో పెండింగ్ ప్రాజెక్టుల పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క

# ములుగు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

## అధికారులను ఆదేశించిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 27:** ములుగు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు శాశ్వత సాగునీరు అందించేలా చర్యలు వేగవంతం చేయాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్, పొట్లాపూర్ ప్రాజెక్టుతో పాటు జిల్లాలో కొనసాగుతున్న అన్ని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండా అభివృద్ధి పనులను పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు న్యాయం చేస్తూనే ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ములుగు నియోజకవర్గ పరిధిలోని నీటిపారుదల శాఖ అభివృద్ధి పనులపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఇరిగేషన్ ఈఎన్‌సీ రమేష్ బాబు, ములుగు ఆర్‌డీవో కృష్ణవేణి, సంబంధిత చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్‌కు అవసరమైన భూసేకరణపై అధికారులు సమగ్ర నివేదికను మంత్రులకు ప్రజంటేషన్ చేశారు. కాసిందేవిపేట, ఇంచెర్ల, రామచంద్రాపూర్ గ్రామాల పరిధిలో ఈ ప్రాజెక్టుకు మొత్తం సుమారు 244.23 ఎకరాల భూమి అవసరమవుతుందని తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 201.03 ఎకరాలకు మాత్రమే అవార్డులు జారీ అయినప్పటికీ భూసేకరణ పూర్తికాలేదని వివరించారు. భూసేకరణకు సంబంధించి 2020-21లో జారీ చేసిన అవార్డుల ప్రకారం ఎకరాకు రూ.2.47 లక్షల నుంచి రూ.8.26 లక్షల వరకు మాత్రమే పరిహారం నిర్ణయించారని, ప్రస్తుతం భూముల మార్కెట్ విలువలు గణనీయంగా పెరగడంతో ఆ ధరలకు రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించడం లేదని అధికారులు వివరించారు. పాత అవార్డులో నిర్ణయించిన పరిహారం ప్రస్తుత పరిస్థితులకు ఏమాత్రం అనుగుణంగా లేదని, అందువల్ల రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రైతులు ప్రస్తుత భూముల ధరలకు అనుగుణంగా న్యాయమైన పరిహారం చెల్లిస్తే భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారని, అయితే పాత ధరలతో భూసేకరణ కొనసాగించడం వల్ల కేసులు పెండింగ్‌లో ఉండిపోయాయని అధికారులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో పాత అవార్డులను ఉపసంహరించి ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా కొత్త భూసేకరణ ప్రక్రియ చేపట్టడమే సరైన మార్గమని అధికారులు అభిప్రాయపడ్డారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి సీతక్క రైతుల ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకుండా భూసేకరణ చేపట్టాలని స్పష్టం చేశారు. 2020-21లో జారీ చేసిన పాత భూసేకరణ అవార్డును ఉపసంహరించి, తాజా మార్కెట్ విలువల ఆధారంగా కొత్త అంచనాలు రూపొందించి వెంటనే తాజా భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.

# సాంకేతికతతో విద్యుత్ రంగంలో నూతన యుగం

## విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** విద్యుత్ రంగంలో సాంకేతికత చోటు చేసుకోవడం నూతన యుగమని విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన విడియో కాన్ఫెరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ విద్యుత్ పునరుద్ధరణ వేగవంతం చేసేలా 108 వాహనంలా ఆర్టీ వాహనాలు త్వరితగతిన సమస్య ఉన్న స్థలానికి చేరుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు అమర్చాలని అన్నారు. సబ్ స్టేషన్‌ల రియల్ టైం ఫీడర్ మానిటరింగ్, ట్రాన్స్ఫార్మర్ల డిజిటలైజేషన్ పూర్తి కావాలని స్పష్టం చేశారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు వినూత్న సాంకేతిక పరిజ్ఞానాలను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వరుణ్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇందులో సోలార్ విద్యుత్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, డేటా ఆధారిత డిజిటల్ డ్యాష్‌బోర్డుల అమలుపై వివరించారు. దామెర 33 కేవీ సబ్‌స్టేషన్‌ను నమూనాగా తీసుకుని రూపొందించిన సోలార్, బ్యాటరీ నిల్వ సామర్థ్య అంచనాలను గురించి తెలిపారు. విద్యుత్ డిమాండ్‌ను పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా తీర్చడంతో పాటు సాయంత్రం పీక్ సమయాల్లో బ్యాటరీల ద్వారా విద్యుత్ సరఫరా అందించే విధానాన్ని చెప్పారు. అలాగే ఆటోమేటిక్ మీటర్ రీడింగ్, స్మార్ట్ మీటరింగ్ వ్యవస్థల అమలుపై ప్రత్యేకంగా చర్చించారు.

ప్రస్తుతం అమలు చేస్తున్న ఏఎంఆర్ వ్యవస్థతో పాటు, ద్విముఖ కమ్యూనికేషన్, రిమోట్ ఆపరేషన్స్, ప్రీపెయిడ్ ఫీచర్లు, టైమ్‌ఆఫ్‌డే టారిఫ్, పవర్ క్వాలిటీ మానిటరింగ్ వంటి అధునాతన సౌకర్యాలు కలిగిన స్మార్ట్ మీటర్ల ప్రయోజనాలను వివరించారు. సంస్థలోని అన్ని విభాగాల పనితీరును ఒకే వేదికపై పర్యవేక్షించేందుకు రూపొందించిన డిజిటల్ ఆధారిత డ్యాష్ బోర్డులను కూడా ప్రదర్శించారు. డేటా అనలిటిక్స్ ఆధారంగా సమస్యలను ముందుగానే గుర్తించడం, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం, వనరుల సమర్థ వినియోగం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం, విద్యుత్ సరఫరా విశ్వసనీయత పెంపొందించడం వంటి అంశాల్లో ఈ డిజిటల్ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయని సీఎండీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్‌రావు, వి. తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల చట్టం-2023ను అమలుచేయాలి

## రాష్ట్ర కూటమి నిర్వహించిన సమావేశంలో వక్తల డిమాండ్

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** చట్టసభలలో మహిళా రిజర్వేషన్ల చట్టం 2023(ఎస్సీ, ఎస్టీ మహిళలతో సహా)ను అమలు చేయాలని పలు మహిళా సంఘాలు, మహిళా సంఘాల నేతలు, మేధావులు డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు అనే అంశంపై మహిళా రిజర్వేషన్ల రాష్ట్ర కూటమి శనివారం మహిళా రిజర్వేషన్ల చట్టం 2023ను జనాభా లెక్కలు, నియోజకవర్గ పునర్విభజన నుండి వేరు చేసి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హిమాయత్ నగర్‌లోని మగ్దూం భవన్‌లోని రాజబహదూర్ గౌర్ హాల్‌లో మహిళా సంఘాలు, వివిధ పార్టీలకు చెందిన మహిళా నేతలతో సమావేశం నిర్వహించింది. మెగసెసే అవార్డు గ్రహీత శాంతా సిన్హా అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పలు మహిళా సంఘాలు, వివిధ పార్టీల నేతలు, మేధావులు పాల్గొన్నారు. సమావేశంలో శాంతా సిన్హా మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, పేదరికం, అవిద్య, అనారోగ్యం వంటి సమస్యల పరిష్కారంలో గళాన్ని విప్పాలని, పోరాడి సాధించుకోవటానికి సిద్ధం కావాలన్నారు. ప్రొఫెసర్ రమా మేల్కొటే మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లను అమలు చేయటం ద్వారా సమాజ మార్పుకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిర్ణయా భాగస్వామ్యం చేయటం ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించటానికి అవకాశం ఉందన్నారు.

సిపిఐ జాతీయ నాయకు రాలు పశ్య పద్మ మాట్లాడుతూ.. 1996లో మహిళా బిల్లుపై వేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీకి అధ్యక్షత వహించిన సిపిఐ జాతీయ నాయకురాలు గీతా ముఖర్జీ దేశవ్యాప్తంగా పర్యటించి మూడు నెలల సమయంలో నివేదిక తయారు చేసి పార్లమెంటరీ సంయుక్త కమిటీలు ఏకాభిప్రాయాన్ని సాధించి పార్లమెంటుకు నివేదించారని గుర్తు చేశారు. చట్టమైన మహిళా రిజర్వేషన్లను 2024 సంవత్సరంలోనే అమలు చేయటానికి ఉన్న అవకాశాన్ని పూర్తిగా ధ్వంసం చేసి.. 2026 ఏప్రిల్ 18న పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు జన జనగణన, నియోజకవర్గాల పునర్విభజనకు లింకు పెట్టి బిజెపి పాలకులు ప్రవేశపెట్టారన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు చేయటంలో ఎలాంటి సంకల్పంలేని బిజెపి కుయుక్తులను, కుట్రలను ప్రతిపక్ష పార్టీలన్నీ భగ్నం చేశాయన్నారు. సిపిఎం నాయకురాలు మల్లు లక్ష్మి మాట్లాడుతూ .. బిజెపి పాలకుల అసలు నైజాన్ని అర్థం చేసుకోవడానికి మహిళలు చైతన్యవంతంగా ముందుకు రావాల న్నారు. టిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత, సిపిఐ ఎంఎల్ నాయకురాలు సంధ్య, కాంగ్రెస్ నాయకురాలు శారద, టిజెఎస్ నాయకురాలు ఐ లక్ష్మి రాగులపల్లి మాట్లాడుతూ .. 30 సంవత్సరాలకు పైగా మహిళ రిజర్వేషన్ల సాధనకు మహిళలు పోరాడుతుంటే మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టం చేసి కూడా అమలు చేయటానికి అనేక రకాల అడ్డంకులను కల్పించడం వెనుక పురుషాధిక్య ప్రభావంతో పాటు బిజెపి కుట్రలు కుతంత్రాలు ఉన్నాయన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టం 2023ను అమలు చేసేంతవరకు పోరాడి, విజయం సాధిద్దామనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# ట్రీ ప్రూనర్ల కొనుగోళ్లలో అక్రమాలు లేవు

## దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి జితేష్

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** వర్షాకాలంలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ క్లియరెన్స్ పనులు, విద్యుత్ సరఫరా వ్యవస్థ నిర్వహణను మరింత వేగవంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు కొనుగోలు చేసిన ప్రూనర్లు తదితర యంత్రాల్లో ఎటువంటి అక్రమాలు జరగ లేదని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ వి పాటిల్ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, అన్ని నిబంధనలను పాటిస్తూ నిర్వహించబడిందన్నారు. ఆధునిక బ్యాటరీ ఆధారిత ట్రీ ప్రూనర్లు, పోల్ ప్రూనర్లు, చైన్ సా యంత్రాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే వీటి కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కొనుగోలు చేసిన పరికరాలు విద్యుత్ పంపిణీ సంస్థల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఇండస్ట్రియల్ గ్రేడ్ పరికరాలని తెలిపింది. ఈ పరికరాలు శబ్ద కాలుష్యం లేకుండా, వాయు కాలుష్యాన్ని కలిగించకుండా వేగవంతంగా చెట్ల కొమ్మల తొలగింపు పనులను నిర్వహిస్తున్నాయని తెలిపారు. పెట్రోల్ ఆధారిత యంత్రాలతో పోలిస్తే తక్కువ శబ్దంతో పనిచేయడం, పర్యావరణ హితంగా ఉండటం మరియు అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన సేవలు అందించగలగడం వల్ల మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. అదేవిధంగా, ఈ పరికరాలను మధ్యవర్తులు లేకుండా నేరుగా తయారీ సంస్థ నుంచే కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈ కొనుగోలుపై చెల్లించిన జీఎస్‌టీ మొత్తాన్ని సంస్థ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉండటంతో, సంస్థపై పడే వాస్తవ ఆర్థిక భారం మరింత తగ్గుతుందని పేర్కొన్నారు. అలాగే ఈ పరికరాలు వర్షాకాల పరిస్థితులను తట్టుకునేలా ప్రత్యేక ప్రమాణాలతో రూపొందించబడ్డాయని, పెట్రోల్ ఆధారిత యంత్రాల్లో కనిపించే కార్బ్యురేటర్ సమస్యలు, స్టార్టింగ్ ఇబ్బందులు వీటిలో ఉండవన్నారు.

# గంజాయి విక్రయ ముఠా అరెస్ట్

## నలుగురికి జ్యుడీషియల్ రిమాండ్, ముగ్గురు పరార్

**హైదరాబాద్ (సంజీవరెడ్డినగర్), జూన్ 27, ప్రభాతవార్త:** ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయానికి పాల్పడుతున్న ముఠాపై పోలీసులు దాడులు నిర్వహించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపూనగర్ ప్రాంతంలో కొందరు యువకులు గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఆయన ఆదేశాలపై సబ్ ఇన్‌స్పెక్టర్ పి. సుధీర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు. అరెస్టు అయిన నిందితులు పేరం వివేక్ సిద్ధి అలియాస్ బన్నీ (23), బండారి హరికృష్ణ (25), సైనిసాయి కిరణ్ (24), ముంజి అఖిల్‌కుమార్ (22). విచారణ అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. ఈ కేసులో అనిల్ (మంచిర్యాల), గగన్ (కరీంనగర్), ప్రణయ్ (ఎల్‌బీ నగర్) పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడిగా వేముల శ్రీకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్27:** తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ సాంకేతిక, పరిపాలనా సభ్యుడిగా ఐఆర్ఎస్ మాజీ అధికారి వేముల శ్రీకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 1995 బ్యాచ్‌కు చెందిన శ్రీకర్ 26 యేళ్ల పాటు ఆదాయపు పన్ను శాఖలో వివిధ హోదాల్లో సేవలందించారు. ఇంజనీరింగ్ డిగ్రీ తర్వాత ఎంబిఏ,ఎంఏతో పాటు ఎల్ఎల్‌బి పూర్తి చేశారు. ట్రిబ్యునల్ కార్యాకలాపాల్లో చట్టపరమైన అంశాలకు అధిక ప్రాధాన్యం ఉండటంతో ఆయన న్యాయ విద్య,అప్పిలేట్ వ్యవహారాల్లోని అనుభవం ఉపయోగపడనుంది. పన్ను ఎగవేత కేసుల దర్యాప్తులో విశేషప్రతిభ కనబరిచిన శ్రీకర్ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు.

# రాయదుర్గం భూముల వేలం వివాదం కేసు వెనక్కి తీసుకుంటామన్న ఎస్‌బిఐ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్27:** రాయదుర్గం భూముల వేలం వివాదంపై సీఎస్ రామకృష్ణారావు, టీజీఐఐసీ అధికారులతో ఎస్‌బీఐ బృందం చర్చలు జరిపింది. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ భూములు తీసుకునేందుకు ఎస్‌బీఐ అంగీకారం తెలిపింది. బోర్డు ఆమోదం తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్‌బీఐ ప్రతినిధులు తెలిపారు. అలాగే హైకోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకుంటామని కూడా ఎస్‌బీఐ ప్రతినిధులు ప్రకటించారు.

# కొత్త రెవెన్యూ భవనాలకు రూ.263.25 కోట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్27:** అద్దె, శిథిల భవనాల్లో ఉన్న 10 రెవెన్యూ డివిజనల్ ఆఫీసులు, 107 తహశీల్దార్ల కార్యాలయాలకు కొత్త భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. రూ.263.25 కోట్లు మంజూరు చేస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. ప్రతి భవనానికి రూ.2.25 కోట్ల చొప్పున నిధులు కేటాయించినట్లు ఉత్తర్వులో ప్రభుత్వం పేర్కొంది. నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ కు అప్పగిస్తున్నట్లు జీవోలో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో జగిత్యాల, గద్వాల, ఆసిఫాబాద్, మంచిర్యాల, మల్కాజిగిరి, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో 10 ఆర్డీవో కార్యాలయాలు నిర్మించనున్నారు. 107 తహశీల్దార్ కార్యాలయాలు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నిర్మించనున్నారు.

# రూ.21 వేల కోట్ల రుణ సమీకరణ

## రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ఇండెంట్

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలోని జూలై నుండి సెప్టెంబరు వరకూ కలిగిన రెండవ త్రైమాసికంలో రూ.21,000 కోట్ల విలువైన ఓపెన్ మార్కెట్ రుణాలను సమీకరించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించే రాష్ట్ర అభివృద్ధి రుణాల వేలం ద్వారా జూలై 1న మొదటి విడతగా రూ.7వేల కోట్లను సమీకరించనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ఇండెంట్ పంపించింది. ఈ నెల 30న ఖమ్మంలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధుల విడుదలను లాంఛనంగా ప్రకటించిన తర్వాత, జూలై మొదటి వారంలో రైతుల బ్యాంకు ఖాతాలకు రైతు భరోసా పథకం పెట్టుబడి సాయం జమ కానున్న నేపథ్యంలో ఇందుకు అవసరమైన నిధులు సమీకరించడమే ఈ కొత్త రుణ సేకరణ లక్ష్యంగా ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.

# రూఫ్‌టాప్ సోలార్‌కు అడ్డుపడుతున్న డిస్కంలు

## వెయ్యి మెగావాట్లు కూడా చేరని ప్లాంట్లు

## నాలుగు వేల మెగావాట్ల గ్రిడ్ కనెక్టెడ్ లక్ష్యం

## రాష్ట్రంలో 32,650 మాత్రమే ఇన్‌స్టాలేషన్‌లు

**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** రూఫ్‌టాప్ సోలార్ వినియోగాన్ని అందుబాటులోకి తేవడంలో తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు మోకాలడ్డుతున్నాయి. దీంతో రాష్ట్రంలో రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ల ఏర్పాటుకు అనుకున్నంత మేర ముందుకు రాక వెనుకబడిపోయింది. రాష్ట్రంలో తమ ఆదాయం పడిపోతుందనే ఉద్దేశ్యంతో విద్యుత్ పంపిణీ సంస్థలు అడ్డుపుల్లలు వేయడం, బ్యాంకులు రుణాలు మంజూరు చేయకపోవడంతో పాటు, సౌర విద్యుత్ పట్ల తగినంత ప్రచారం లేకపోవడం, ప్రజల్లో అవగాహన కల్పించడంలో వైఫల్యం చెందడం తదితర కారణాలతో రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ల ఏర్పాటు పట్ల ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు బాధ్యతలను తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (రెడ్కో)కు ప్రభుత్వం అప్పగించింది. రాష్ట్ర అధికారవర్గాల వివరాల ప్రకారం పీఎంకుసుమ్ పథకం కింద, తెలంగాణలో 500 కిలోవాట్ల నుండి 2 మెగావాట్ల వరకు సామర్థ్యం గల 4,000 మెగావాట్ల గ్రిడ్‌కనెక్టెడ్ సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రాష్ట్రంలో ఇప్పటివరకు వెయ్యి మెగావాట్లు కూడా దాటక పోవడం విశేషం. రూఫ్‌టాప్ సోలార్‌ను ప్రోత్సహించడానికి ఫిబ్రవరి 2024లో ప్రారంభించిన పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద తెలంగాణలో ఇంత వరకూ కేవలం సుమారు 32,600 ఇన్‌స్టాలేషన్‌లు మాత్రమే నమోదయినట్లు సమాచారం. దీనికి భిన్నంగా, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో 1.1 లక్షలకు పైగా సోలార్ రూఫ్ టాప్ ఇన్‌స్టాలేషన్లు చేయగా, బెంగళూరు, చెన్నైలలో చెరో నాలుగు లక్షలకు పైగా ఇన్‌స్టాలేషన్‌లు జరిగాయి.

ఇతర రాష్ట్రాల్లో కొత్త సౌరశక్తి డిమాండ్‌లో 50 నుండి 60 శాతం వరకు ఇప్పుడు నివాస గృహాల విభాగం నుండే వస్తోంది. వాణిజ్య సంస్థల వాటా 25 నుండి 30 శాతం వరకు ఉండగా, పెద్ద సిస్టమ్ సామర్థ్యాలతో కూడిన పారిశ్రామిక సంస్థలు 10 నుండి 15 శాతం వరకు వాటాను అందిస్తున్నాయి. రూఫ్ టాప్ సోలార్‌తో ఆర్థిక ప్రయోజనాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, ప్రచారం లేకపోవడం ఒక ప్రధాన లోపంగా మిగిలిపోయిందని చెబుతున్నారు. 3 కిలోవాట్ల రూఫ్ టాప్ సిస్టమ్ రోజుకు సుమారు 15 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలదు. దీనివల్ల ఏసీ ఉన్న గృహాలకు వేసవిలో విద్యుత్ బిల్లులు రూ.1,800 నుండి రూ. 2,000 వరకు, ఇతర సీజన్లలో రూ.200 నుండి రూ.500కు తగ్గుతాయి. అంతే కాకుండా గృహాల్లో విని యోగించే సోలార్ విద్యుత్ పోను మిగిలిన దానిని అమ్ము కోవడం ద్వారా అదనపు ఆదాయం సమకూరు తుంది. గ్రిడ్‌కు ఎగుమతి చేసే అదనపు విద్యుత్‌పై యూనిట్‌కు 58 పైసల చొప్పున ఆదాయం వస్తుంది.

దీనివల్ల సోలార్ కేవలం పర్యావరణానికే కాకుండా ఆర్థికంగా కూడా ప్రయోజనకరంగా ఉంటుందని అధికార వర్గాలు వెల్లడిస్తు న్నాయి. ఇక రూఫ్ టాప్ సోలార్ ప్యానల్ ఏర్పాటుకు కేంద్రం గణనీయ సబ్సిడీని అందిస్తోంది. నివాస గృహాలకు 2 కిలోవాట్ వరకూ రూ.30 వేలు, అదనపు సామర్థ్యంపై కిలో వాట్‌కు రూ.18 వేల చొప్పున గరిష్టంగా రూ.78 వేల వరకూ సబ్సిడీని ఇస్తోంది. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు విద్యుత్ పంపిణీ సంస్థలు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కరెంట్ విని యోగం ద్వారా బిల్లుల కింద వచ్చే ఆదాయం కోల్పో తామనే ఉద్దేశ్యంతో పంపిణీ సంస్థలు అడ్డుపడు తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్ర తలు, అధికమవుతున్న విద్యుత్ వినియోగంతో గృహాలకు స్పష్టమైన ఆర్థిక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో ఇంటి పైకప్పులపై సౌర ప్లాంట్ల ఏర్పాటు ముందుకు సాగకపోవడం విశేషం.



# దాయాది పాకిస్థాన్‌ను 7-1 గోల్స్‌తో చిత్తు చేసిన భారత్

**లండన్, జూన్ 27:** భారత హాకీ వీరులు... నాలుగు రోజుల వ్యవధిలో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను మరోసారి చిత్తుచేసింది. లండన్‌లో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ పురుషుల ప్రొ హాకీ లీగ్ టోర్నీలో శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లోభారత్... 7-1 గోల్స్ తేడాతో పాక్‌పై ఘనవిజయం సాధించింది. ఈ వారం మొదట్లో 4-3తో నెగ్గిన భారత్... ఈసారి కూడా మరీ చిత్తుగా ఓడించింది.

మ్యాచ్ ఆరంభం నుంచి భారత్ హాకీ ప్లేయర్లు దూకుడుగా ఆడితే తొలి క్వార్టర్‌లో పాక్ ఆధిక్యం ప్రదర్శించింది. తొమ్మిదో నిమిషంలోనే భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించగా, దాన్ని హార్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలచడంలో విఫలమయ్యాడు. మరో నాలుగు నిమిషాలకే పాక్ షాకిచ్చింది. 13వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను అబూ అహ్మద్ గోల్‌గా మలిచి పాక్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. మ్యాచ్ మొత్తంలో పాక్ సాధించిన ఏకైక గోల్ ఇదే.

తొలి క్వార్టర్ పాక్ ఆధిక్యం చాటగా.. ఆ తర్వాత లీడ్ అంతా భారత్‌దే. 20వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను సుఖ్‌జీత్ సింగ్ గోల్‌గా మలచగా, మరో ఆరు నిమిషాలకు లభించిన పెనాల్టీ కార్నర్‌ను హార్మన్‌ప్రీత్ సింగ్ గోల్ చేశాడు. మొత్తంమీద తొలి 30 నిమిషాల్లోనే భారత్‌కు ఆరు పెనాల్టీ కార్నర్లు లభించగా, రెండింటిని మాత్రమే గోల్‌గా మలిచింది.

ఇక మూడో క్వార్టర్ నాలుగో నిమిషంలో లభించిన మరో పీసీని వైస్ కెప్టెన్ హార్దిక్ సింగ్ గోల్‌గా మలిచాడు. మరో నిమిషం తర్వాత సుఖ్‌జీత్ అందించిన పాస్‌ను రివర్స్ ఫ్లిక్‌తో అభిషేక్ అద్భుతంగా గోల్ సాధించాడు. ఇక 44, 54 నిమిషాల్ల లభించిన బ్యాక్ టు బ్యాక్ పెనాల్టీ కార్నర్లను రాజ్‌కుమార్ పాల్, దిల్‌ప్రీత్ సింగ్ గోల్ చేశారు. దీంతో భారత్ తిరుగులేని 7-1 గోల్స్‌తో దాయాది పాక్‌పై విజయం అందుకుంది. ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు 15 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాయి. 17 పాయింట్లతో భారత్ 7వ స్థానంలో ఉండగా... ఆడిన 15 మ్యాచ్‌ల్లోనూ ఓడిన పాక్ అట్టడుగుస్థానంలో కొనసాగుతోంది. భారత్ తమ చివరి మ్యాచ్‌ను నేడు ఇంగ్లండ్‌తో ఆడనుంది.

# జర్మనీకి ఈక్వెడార్ షాక్

న్యూయార్క్, జూన్ 27: ఫిఫా ప్రపంచకప్ 2026లో సంచలనం నమోదైంది. నాలుగు సార్లు ప్రపంచ ఛాంపియన్ జర్మనీకి ఈక్వెడార్ షాకిచ్చింది. గ్రూప్-ఈలో భాగంగా జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఈక్వెడార్ జట్టు 2-1 గోల్స్ తేడాతో జర్మనీపై విజయం సాధించింది. ఈ గెలుపుతో ఈక్వెడార్ నాకౌట్‌కు దూసుకెళ్లింది. జర్మనీ ఇప్పటికే నాకౌట్‌కు అర్హత సాధించింది.

మ్యాచ్ ప్రారంభమైన తర్వాత జర్మనీ మెరుపు దాడికి దిగింది. రెండో నిమిషంలోనే జర్మనీ ఆటగాడు ఫ్లోరియన్ విర్ట్జ్ అందించిన అద్భుతమైన పాస్‌ను లెరాయ్ సనే గోల్‌గా మలిచాడు. జర్మనీ ప్రపంచకప్ చరిత్రలోనే ఇది రెండో అత్యంత వేగవంతమైన గోల్. అయితే, ఈక్వెడార్ ఏమాత్రం వెనకడుగు వేయలేదు. 9వ నిమిషంలో మిడ్‌ఫీల్డ్‌లో బంతిని అందుకున్న ఈక్వెడార్ యువ ఆటగాడు నిల్సన్ అంగులో సుదూరం నుంచి ఒక అద్భుతమైన లాంగ్‌రేంజ్ షాట్ కొట్టాడు. అది నేరుగా నెట్‌లోకి దూసుకెళ్లింది. దీంతో ఫస్టాఫ్ ముగిసే సరికి ఇరు జట్లు 1-1తో సమానంగా నిలిచాయి.

రెండో అర్ధభాగంలో జర్మనీ వేగానికి ఈక్వెడార్ బ్రేకులు వేసింది. 77వ నిమిషంలో లభించిన కార్నర్ కిక్‌ను ఈక్వెడార్ చక్కగా వినియోగించుకుంది. కెవిన్ గాల్లోకి లేచి బంతిని ఫ్లిక్ చేయగా అక్కడ సిద్ధంగా ఉన్న గొంజాల్లో ప్లాటా మెరుపు వేగంతో స్పందించి బంతిని గోల్ పోస్ట్‌లోకి నెట్టాడు. దీంతో ఈక్వెడార్ 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. చివరి నిమిషాల్లో గోల్స్ సమం చేయడం కోసం జర్మనీ సర్వశక్తులూ ఒడ్డింది. కానీ, ఈక్వెడార్ డిఫెండర్లు చక్కగా ఆడుకున్నారు. జర్మనీ ప్రయత్నాలన్నింటినీ తిప్పికొట్టి 2-1తో చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈక్వెడార్ ప్రపంచకప్ గ్రూప్ స్టేజ్ దాటి నాకౌట్ చేరడం ఇది కేవలం రెండో సారి. 2006 మొదటిసారి నాకౌట్ కు అర్హత సాధించింది.





# చరిత్ర సృష్టించిన కాబో వెర్దే

**హ్యూస్టన్, జూన్ 27:** చిన్న దేశం పెద్ద ఆటతో అదరగొడుతున్న కాబో వెర్దే.. ఫిఫా ప్రపంచకప్ 2026లో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒక్క మ్యాచ్‌కూడా గెలవకుండానే.. ఆడుతున్న తొలి సాకర్ వరల్డ్ కప్‌లోనే నాకౌట్‌లో ప్రవేశించింది. స్పెయిన్, ఉరుగ్వేలతో మ్యాచ్‌లను డ్రా చేసిన కాబో వెర్దే... సౌదీ అరేబియాతో జరిగిన మూడో మ్యాచ్‌ను కూడా డ్రాగా ముగించింది. మూడు పాయింట్లతో స్పెయిన్ తర్వాత రెండో స్థానంతో గ్రూప్-హెచ్ నుంచి నాకౌట్ చేరింది. ఈ క్రమంలో ఫిఫా ప్రపంచ కప్‌లో నాకౌట్ దశకు అర్హత సాధించిన అత్యంత చిన్న దేశంగా కాబో వెర్దే రికార్డు కొట్టింది.

**తొలి ఫిఫాలోనే సంచలనం!**

సాకర్ వరల్డ్‌కప్‌లో ఆడుతున్నతొలిసారే కాబో వెర్దే అద్భుత ప్రదర్శన కనబరిచింది. స్పెయిన్, ఉరుగ్వే, సౌదీ అరేబియా వంటి జట్లున్న గ్రూప్-హెచ్‌లో అజేయంగా నిలిచింది. ఇప్పటికే స్పెయిన్, ఉరుగ్వే లాంటి బలమైన జట్లను నిలువరించిన కాబో వెర్దే తాజాగా సౌది అరేబియాతో మ్యాచ్‌ను కూడా డ్రా చేసుకుంది. ఈ మ్యాచ్ గోల్ లెస్ డ్రాగా ముగిసింది. ఒక్క మ్యాచ్‌లో కూడా విజయం సాధించకుండానే నాకౌట్‌కు చేరిన జట్టుగానూ కాబో వెర్దే అరుదైన ఘనత సాధించింది. ఇలాంటి సందర్భాలు ఫిఫా చరిత్రలో చాలా అరుదుగా నమోదు అయ్యాయి. 1958లో వేల్స్, 1990లో ఐర్లాండ్, నెదర్లాండ్స్ అలాగే 1998లో చిలీ జట్లు 3 పాయింట్లతో నాకౌట్ దశకు చేరుకున్నాయి.

**గ్రూప్-హెచ్ నుంచి రెండే**

ఈ గ్రూప్‌లో స్పెయిన్ టాప్‌లో నిలిచింది. మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, ఒక డ్రాతో ఏడు పాయింట్లు సాధించింది. దీంతో నాకౌట్‌కు దూసుకెళ్లింది. ఆ తర్వాత స్థానంలో ఉన్న కాబో వెర్దే కూడా రౌండ్ 32కు క్వాలిఫై అయ్యింది. దీంతో ఈగ్రూప్ నుంచి స్పెయిన్, వెర్దే జట్లు నాకౌట్‌కు వెళ్లగా, రెండు సార్లు ఛాంపియన్ ఉరుగ్వే, సౌది అరేబియా ఇంటిబాట పట్టాయి.



# యుఎస్ ఓపెన్‌లో భారత్ షట్లర్ల జోరు

**కాలిఫోర్నియా, జూన్ 27:** యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు జోరు చూపుతున్నారు. యువ షట్లర్ రౌనక్ చౌహాన్ సంచలనం సృష్టించాడు. కిడాంబి శ్రీకాంత్ తో కలిసి పురుషుల సింగిల్స్ విభాగంలో సెమీస్‌కు దూసుకెళ్లాడు. మహిళల సింగిల్స్‌లోనూ దేవికా సిహాగ్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 18 ఏళ్ల యువ షట్లర్ రౌనక్ చౌహాన్ సంచలనాల మోత మోగిస్తున్నాడు. ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్, 6వ ర్యాంకర్ టియెన్ చెన్‌ను వరుస గేమ్‌ల్లో ఓడించిన రౌనక్.. క్వార్టర్స్‌లోనూ అదే దూకుడు చూపాడు. కేవలం 38 నిమిషాల్లోనే ఇజ్రాయెల్ టాప్ ప్లేయర్ మిషా జిల్బెర్‌మన్‌ను చిత్తు చేశాడు. వరుస గేమ్‌ల్లో 23-21, 21-11 తేడాతో విజయం సాధించి తొలిసారి మెగా టోర్నీ సెమీస్‌లో అడుగు పెట్టాడు.

ఇక ఏస్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ మూడు సెట్ల హోరాహోరీ పోరులో చైనీస్ తైపీ ఆటగాడు లియావో జైఫుపై గెలుపొందాడు. తొలి గేమ్‌ను నెగ్గిన శ్రీకాంత్... రెండో గేమ్‌లో తలపడబడ్డాడు. ఇదే అదనుగా లియావో 21-12తో నెగ్గి సమవుజ్జీగా నిలిచాడు. ఇక ఫలితం తేల్చే మూడో గేమ్‌ను 21-18తో ముగించి... నాలుగో సీడ్ ఒకిమోటో(జపాన్)తో సెమీస్ పోరుకు సిద్ధమయ్యాడు. మహిళల సింగిల్స్‌లో దేవిక మరోసారి నిలకడైన ప్రదర్శనతో జపాన్ క్రీడాకారిణి రికో గుంజిని 22-20, 21-19 తేడాతో ఓడించింది. సెమీఫైనల్లో డెన్మార్క్ క్రీడాకారిణి లైన్ క్రిస్టోఫర్సన్‌తో తలపడనుంది.

## ఆసియా క్రీడలకు సిద్ధమవుతున్న నీరజ్ చోప్రా

**న్యూఢిల్లీ, జూన్ 27:** భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా... జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో బరిలోకి దిగనున్నాడు. ఈ మేరకు భారత అథ్లెటిక్స్ సమాఖ్య సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ అదిల్లే సుమరివాలా ధృవీకరించారు. ఈ ఆసియా క్రీడలు సెప్టెంబర్‌లో జపాన్‌లో జరగనున్నాయి. గత ఏడాది టోక్యో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ముందు నీరజ్ చోప్రా గాయపడ్డాడు. అప్పటినుంచి పోటీలకు దూరంగా ఉన్నాడు. గాయం నుంచి కోలుకుని ఇటీవలే దోహా డైమండ్ లీగ్ బరిలోకి దిగిన నీరజ్ చోప్రా మెడల్ సాధించడంలో విఫలమయ్యాడు. అతను 85.69 మీటర్లు త్రో విసిరి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. నీరజ్ చోప్రా గాయం నుంచి పూర్తి స్థాయిలో కోలుకున్నాడని, ఆసియా క్రీడల్లో మరోసారి పతకంతో మెరుస్తాడని సుమరివాలా ఆశాభావం వ్యక్తం చేశాడు.

## శ్రీలంకపై భారత్-ఏ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

**గాలే, జూన్ 27:** గాలేలో జరుగుతున్న మొదటి అనధికారిక టెస్ట్‌లో భారత బౌలర్లు జోరు చూపారు. శ్రీలంక-ఏ తొలి ఇన్నింగ్స్‌ను 330పరుగులకే కుప్పకూల్చారు. యువ బౌలర్ అకీబ్ నబీ 4 వికెట్లు తీసి శ్రీలంక పతనాన్ని శాసించాడు. దీంతో భారత్-ఏకు 160 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్-ఏ మూడో రోజు ఆటముగిసేసరికి వికెట్ నష్టపోకుండా 48 పరుగులు చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్(7) రిటైర్డ్‌హర్ట్ కాగా.... ఆయుష్ పాండే(20 నాటౌట్), దేవ్‌దత్ పడిక్కల్(20 నాటౌట్) క్రీజ్‌లో నిలిచారు.

ఓవర్ నైట్ స్కోర్ రెండు వికెట్లకు 113 పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక-ఏను యశ్ ఠాకూర్(2/51) దెబ్బకొట్టాడు. అర్ధశతకంతో విసిగించిన నువనిందు ఫెర్నాండో(84)ను ఔట్ చేసిన ఠాకూర్ వికెట్ల వేటకు తెరతీశాడు. మరో ఎండ్‌లో అంజల బండార(70)ను వెనక్కి పంపిన అకీబ్ నబీ.. లోయర్ ఆర్డర్ పనిపట్టాడు. నబీ ధాటికి శ్రీలంక-ఏ తొలి ఇన్నింగ్స్‌లో330 పరుగులకే ఆలౌటైంది. శ్రీలంక ఇన్నింగ్స్‌లో ఫెర్నాండో 84 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. బండారా, అరాచిగే అర్ధసెంచరీతో రాణించడంతో శ్రీలంక-ఏ ఫాలోఆన్ తప్పించుకుంది. భారత బౌలర్లలో నబీ 58 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. యష్ ఠాకూర్, హర్ష్ దూబే చెరో రెండు వికెట్లు తీశారు.

# ఎఫ్టీయేల జోష్‌తో టెక్స్‌టైల్ రంగం




# ఐపిఒలతో 500కోట్ల సమీకరణకు రెడీ

**న్యూఢిల్లీ, జూన్ 27:** భారత్ వివిధ దేశాలతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ఎఫ్‌టీఏలు, పోటీ దేశమైన బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ, సామాజిక అస్థిరతతో దేశీయ టెక్స్‌టైల్ పరిశ్రమకు కొత్త ఊపు లభించింది. విస్తరణ, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు, ఆధునికీకరణ కోసం టెక్స్‌టైల్ కంపెనీలు భారీగా మూలధనం సమీకరించేందుకు స్టాక్ మార్కెట్‌కు వస్తున్నాయి. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ఇప్పటికే ఐదు టెక్స్‌టైల్ కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.500 కోట్లకు పైగా సమీకరించేందుకు దరఖాస్తులు సమర్పించాయి. వీటిలో 3 కంపెనీలు ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో, మరో రెండు కంపెనీలు ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌లో లిస్టింగ్‌కు సిద్ధమవుతున్నాయి. ఆల్పైన్ టెక్స్‌వర్ల్డ్, ఆస్థా స్పిన్‌టెక్స్, టీసీ టెర్రీ టెక్స్‌టైల్ కంపెనీలు ఐపీఓలు తీసుకురానుండగా శ్రీధర్ స్పిన్నర్స్, శ్రీరామ్ ట్విస్టెక్స్ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌లో లిస్టింగ్ కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా టెక్స్‌టైల్ రంగానికి ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు, మూలధన సబ్సిడీలు, ఉపాధి కల్పనకు ప్రత్యేక ప్రోత్సాహక పథకాలు అమలు చేస్తున్నాయి. భారత్ టెక్స్‌టైల్ మార్కెట్ పరిమాణాన్ని 2030 నాటికి 350 బిలియన్ డాలర్లకు పెంచాలని కేంద్రలక్ష్యంగా ఉంది.

ఇందుకు ఎగుమతులు వార్షికంగా 22 శాతం, దేశీయ డిమాండ్ 10 శాతం చొప్పున పెరుగుతాయని అంచనా వేస్తోంది. ప్రపంచ వస్త్రఎగుమతుల్లో భారత్ వాటా కేవలం 4 నుంచి 5శాతం మాత్రమే ఉండటంతో, చైనాపై ఆధారాన్ని తగ్గించాలనుకుంటున్న అంతర్జాతీయ బ్రాండ్ల నుంచి భారత్‌కు మరింత వ్యాపార అవకాశాలు లభించే అవకాశం ఉందని అంచనా. ఎఫ్‌టీఏలతో కొత్త ఆశలుయూకే, యూరోపియన్ యూనియన్, అమెరికాతో ప్రతిపాదిత ఎఫ్‌టీఏలుఅమల్లోకి వస్తే భారత టెక్స్‌టైల్ రంగానికి దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలు మెరుగుపడతాయని నిపుణులు భావిస్తున్నారు.

గత ఐదేళ్లుగా యూరప్, యూకే మార్కెట్లలో 9 నుంచి 12 శాతం దిగుమతి సుంకాల కారణంగా భారత టెక్స్‌టైల్ రంగం ఇబ్బందులు ఎదుర్కొంది. తాజా ఎఫ్‌టీఏలతో పరిస్థితి పూర్తిగా మారింది. స్వతంత్ర మార్కెట్ విశ్లేషకుడు అరుణ్ కేజ్రీవాల్ మాట్లాడుతూ.. గుజరాత్‌కు చెందిన టెక్స్‌టైల్ కంపెనీలు సోలార్ ప్రాజెక్టులు, మూలధన పెట్టుబడులపై పన్ను రాయితీల వంటి ప్రభుత్వ ప్రోత్సాహకాలతో లాభపడుతున్నాయని తెలిపారు. బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న సామాజిక అశాంతి, ఆర్థిక మందగమనం భారత టెక్స్‌టైల్ కంపెనీలకు ప్రపంచ మార్కెట్లో తమ వాటాను పెంచుకునే అవకాశంగా మారిందన్నారు. చైనాలో తయారీ వ్యయాలు పెరగడం, ఎగుమతులపై ఆంక్షలు ఉండటంతో భారత ఎగుమతిదారులకు అదనపు ప్రయోజనం కలుగుతోందని, దీంతో అనేక కంపెనీలు మరింత వ్యవస్థీకృతంగా ఎదిగి స్టాక్ మార్కెట్ లోకి అడుగుపెడుతున్నాయని పేర్కొన్నారు.

# ఎంఎస్ఎంఇ రంగానికి 25 లక్షల కోట్ల రుణపరపతి లోటు



## డెల్లాయిట్ అధ్యయన నివేదిక


**న్యూఢిల్లీ, జూన్ 27:** భారత ఎంఎస్ఎంఈ రంగంలో రుణాల లోటు సుమారు రూ.25 లక్షల కోట్లుగా అంచనా వేసినట్లు డెల్లాయిట్ అధ్యయన నివేదిక తెలిపింది. ఈ రంగం దేశ జీడీపీలో చేస్తున్న వాటా, అవసరమైన క్రెడిట్‌టుజీడీపీ నిష్పత్తిని పరిగణనలోకి తీసుకుంటే ఈ లోటు రూ.50 లక్షల కోట్లకు మించి ఉండే అవకాశం ఉందని పేర్కొంది భారత్ ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా కొనసాగుతున్న నేపథ్యంలో, దీర్ఘకాలిక వృద్ధిని సాధించాలంటే ఆర్థిక సేవల విస్తరణతో పాటు చిన్న వ్యాపారాలకు రుణాల కేటాయింపును పెంచడం అత్యంత అవసరమని డెలాయిట్ అభిప్రాయపడింది.

డిజిటల్ చెల్లింపుల్లో భారీ పురోగతిదేశంలో ఆర్థిక సేవల విస్తరణలో గణనీయమైన పురోగతి నమోదైందని నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం దేశంలోని 89 శాతం మంది పెద్దలకు బ్యాంకు ఖాతాలు ఉండగా, యూపీఐ ద్వారా ప్రతి నెల 20 బిలియన్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగే రియల్‌టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో దాదాపు సగం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయని పేర్కొంది. దేశంలో 16 శాతం బ్యాంకు ఖాతాలు క్రియాశీలంగా లేవని, కేవలం 15 శాతం మంది మాత్రమే అధికారిక రుణాలను వినియోగిస్తున్నారని తెలిపింది. ప్రపంచ సగటు 24 శాతం కాగా, భారతదేశంలో ఈ సంఖ్య చాలా తక్కువగా ఉందని పేర్కొంది. బీమా విస్తరణ జీడీపీలో 3.7 శాతంగా ఉండగా, ఇది ప్రపంచ సగటులో సగానికి సమానమని వెల్లడించింది. ఎంఎస్ఎంఈలకు నగదు ప్రవాహం ఆధారిత రుణాలపై దృష్టిఆర్థిక సమ్మిళితతను మరింత బలోపేతం చేయాలంటే విధానపరమైన సంస్కరణలు అవసరమని నివేదిక సూచించింది. అకౌంట్ అగ్రిగేటర్ వ్యవస్థ ద్వారా నగదు ప్రవాహం ఆధారిత ఎంఎస్ఎంఈ రుణాలను విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొంది.

చిన్న వ్యాపారులు, దుకాణదారులు, కాంట్రాక్టర్లు, కళాకారులు తదితరులకు రుణాలు సులభంగా, తక్కువ ఖర్చుతో లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. రుణాల ప్రాప్యతను పెంచడం, బీమా సేవలను విస్తరించడం, ఆర్థిక అవగాహనను పెంపొందించడం, డిజిటల్ సేవల ఉన్న అంతరాలను తగ్గించడం వంటి చర్యలు తీసుకుంటేనే ఆర్థిక సమ్మిళితత నిజమైన ఆర్థిక భాగస్వామ్యం, స్థిరమైన వృద్ధి, ఆర్థిక భద్రతకు దోహదపడుతుందని డెలాయిట్ నివేదిక స్పష్టం చేసింది. గ్రామీణ, అర్ధపట్టణ, వెనుకబడిన ప్రాంతాల్లో ఆర్థిక సేవలను విస్తరించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త వృద్ధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంది.

# ఇండియా కమర్షియల్ ప్రాజెక్టులపైనే ఇన్వెస్టర్ల ఫోకస్

## నైట్‌ఫ్రాంక్ ఇండియా సర్వే నివేదిక




**ముంబయి, జూన్ 27:** దేశీయ రియల్ ఎస్టేట్ రంగంలో ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులు ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో తగ్గినప్పటికీ రియాల్టీలో బలహీనతకు సంకేతం కాదని, ప్రపంచ ఆర్థిక పరిస్థితుల ప్రభావమేనని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో రియల్ ఎస్టేట్ రంగంలో మొత్తం 1.13 బిలియన్ డాలర్ల ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన 1.47 బిలియన్ డాలర్లతో పోలిస్తే 23 శాతం తగ్గుదల కనిపించింది. ఈ తగ్గుదలకు ప్రపంచవ్యాప్తంగా అధిక వడ్డీ రేట్లు, ద్రవ్య లభ్యత తగ్గడం, అభివృద్ధి చెందుతున్న దేశాలు అభివృద్ధి చెందిన దేశాల మధ్య రాబడుల వ్యత్యాసం తగ్గడం వంటి అంశాలు కారణమని నైట్ ఫ్రాంక్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శిశిర్ బైజాల్ వెల్లడించారు. పెట్టుబడిదారుల దృష్టి ప్రధానంగా ఆఫీస్ విభాగంపైనే కేంద్రీకృతమైంది. మొత్తం పెట్టుబడుల్లో 89 శాతం వాటా కార్యాలయ భవనాలకే దక్కింది. ఈ విభాగంలో పెట్టుబడులు గత ఏడాదితో పోలిస్తే 33 శాతం పెరిగి దాదాపు 998 మిలియన్ డాలర్లకు చేరాయి.

గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, బహుళజాతి సంస్థలు, దేశీయ కంపెనీల నుంచి కార్యాలయ స్థలాలకు పెరుగుతున్న డిమాండ్ ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. ఇప్పటికే నిర్మాణం పూర్తయి అద్దె ఆదాయం అందిస్తున్న కార్యాలయ భవనాలపైనే పెట్టుబడిదారులు ఎక్కువ ఆసక్తి చూపారు. మొత్తం కార్యాలయ పెట్టుబడుల్లో 75 శాతం పూర్తయిన ఆస్తులకే వెళ్లగా, గత ఏడాది ఇదే వాటా 53 శాతంగా ఉంది. స్థిరమైన ఆదాయం, తక్కువ రిస్క్ కలిగిన ఆస్తులపై పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారని నైట్‌ఫ్రాంక్ తెలిపింది. నివాస గృహాల విభాగంలో మాత్రం పెట్టుబడులు గణనీయంగా తగ్గాయి. 2025 తొలి అర్ధభాగంలో 297 మిలియన్ డాలర్లు పెట్టుబడులు నమో దవగా, ఈ ఏడాది అదే కాలంలో అవి 128 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గృహాల డిమాండ్ బలంగానే ఉన్నప్పటికీ, నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులపై పెట్టుబడిదారులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది.

నగరాల వారీగా చూస్తే ఢిల్లీఎన్‌సీఆర్ ప్రాంతం 411 మిలియన్ డాలర్ల పెట్టుబడులతో తొలి స్థానంలో నిలిచింది. తర్వాత పుణె, చెన్నై నగరాలు నిలిచాయి. మొత్తంగా చూస్తే, రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్టర్ల వ్యూహం స్థిరమైన ఆదాయం, నాణ్యమైన ఆస్తులు, తక్కువ రిస్క్ ఉన్న ప్రాజెక్టుల వైపు మళ్లినట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక స్పష్టం చేసింది.

## రికార్డు స్థాయికి ఐటిసి వ్యాపారం

**ముంబయి, జూన్ 27:** నాన్‌సిగరెట్ ఎఫ్ఎంసీజీ వ్యాపారంలో ఐటిసి మరో రికార్డు సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈకేటగిరీ కంపెనీ ఉత్పత్తులపై కస్టమర్లు చేసిన మొత్తం ఖర్చు 37వేల కోట్లను దాటింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 9 శాతం పెరుగుదలగా సంస్థ వెల్లడించింది. ఐటిసి నివేదిక ప్రకారం సంస్థకు చెందిన 30కి పైగా స్వదేశీబ్రాండ్లు దేశవ్యాప్తంగా దాదాపు 28 కోట్ల కుటుంబాలకు చేరుతున్నాయి. ఈ బ్రాండ్లపై వినియోగదారుల వార్షిక వ్యయం 37వేల కోట్లకు పైగా నమోదైందని తెలిపింది. ఆశీర్వాద్, బింగో, సన్‌ఫీస్ట్, యిప్పీ, మంగళదీప్ వంటి ప్రముఖ బ్రాండ్లతో కూడిన నాన్‌సిగరెట్ ఎఫ్ఎంసీజీ విభాగం గత ఆర్థిక సంవత్సరంలోనే దాదాపు 100 కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, వ్యక్తిగత సంరక్షణ, సౌకర్యవంతమైన వినియోగం, ప్రీమియం ఉత్పత్తుల విభాగాల్లో ఈ కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టినట్లు ఐటీసీ తెలిపింది. సంస్థ లైఫ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ సెంటర్ పరిశోధనలు, ఉత్పత్తుల అభివృద్ధి బృందాల సహకారంతో ఈ ఆవిష్కరణలు జరిగాయని వెల్లడించింది.

## అనిల్ అంబాని సెటిల్‌మెంట్ దరఖాస్తు తిరస్కరించిన సెబీ

**ముంబయి, జూన్ 27:** పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు మరో షాక్ తగిలింది. రూ.6,526కోట్ల నిధుల మళ్లింపువ్యవహారంలో సెటిల్‌మెంట్ కోరుతూ దాఖలు చేసిన దరఖాస్తులను సెబీ తిరస్కరించింది. ఇంజినీరింగ్ కాంట్రాక్టర్ సీఎల్ఈ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన రూ.6,526కోట్ల ఆర్థిక ఎక్స్‌పోజర్ కేసులో ఈనిర్ణయం తీసుకుంది. ఇతర దర్యాప్తు సంస్థలు కూడా ఇదే అంశంపై విచారణ జరుపుతున్నందున ప్రస్తుతం సెటిల్‌మెంట్‌కు అవకాశం లేదని సెబీ స్పష్టం చేసినట్లు సమాచారం.

ఈ వ్యవహారంలో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిస్టింగ్ నిబంధనలు, మోసపూరిత మరియు అన్యాయ వాణిజ్య పద్ధతుల నిబంధనలు,



సంబంధిత పార్టీ లావాదేవీలకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించిందని సెబీ ఆరోపిస్తోంది. కంపెనీ నిధులను దుర్వినియోగం చేశారనే అభియోగాలు కూడా ఉన్నాయి. 2025 సెప్టెంబరులో సెబీ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. 2018 నుంచి వసూలు కాకుండా ఉన్న రూ.6,526కోట్లను వడ్డీతో సహా కంపెనీకి తిరిగి చెల్లించాలని ఆనోటీసులో పేర్కొంది. వడ్డీతో కలిపితే మొత్తం రికవరీ మొత్తం దాదాపు రెట్టింపయ్యే అవకాశముందని తెలుస్తోంది. దాదాపు పదేళ్ల కాలంలో సీఎల్ఈకు సుమారు 17,670కోట్లు మళ్లించారని, అందులో కనీసం రూ.11,200 కోట్లు రిలయన్స్ ఏడీఏ గ్రూప్‌కు చెందిన సంస్థల్లో పెట్టుబడులుగా పెట్టినట్లు సెబీ ఆరోపించింది. సీఎల్ఈ పూర్తిగా స్వతంత్ర సంస్థేనని రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గతంలో స్పష్టం చేసింది. ఈ ఏడాది ప్రారంభంలో బాంబే హైకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రంలో సీఎల్ఈతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది.

## కోటక్ బ్యాంకు సిఇఒగా తప్పుకుంటున్న వాస్వానీ

**ముంబయి, జూన్ 27:** కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రస్తుత ఎండీ, సీఈఓ అశోక్ వాస్వానీ తన ప్రస్తుత పదవీకాలం ముగిసిన తర్వాత మరోసారి బాధ్యతలు చేపట్టబోనని బోర్డుకు తెలియజేశారు. ఆయన ప్రస్తుత పదవీకాలం 2026 డిసెంబర్ 31తో ముగియనుంది. వ్యక్తిగత కారణాల వల్ల తిరిగి నియామకం కోరుకోవడం లేదని వాస్వానీ వెల్లడించినట్లు బ్యాంక్ శనివారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు ఇచ్చిన నివేదికలో తెలిపింది. ఆయన నిర్ణయాన్ని గౌరవించిన బోర్డు, కొత్త మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎంపిక కోసం వారసత్వ ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించినట్లు వెల్లడించింది. నియంత్రణ సంస్థల నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా కొత్త సీఈఓ నియామక ప్రక్రియను పూర్తి చేస్తామని బ్యాంక్ స్పష్టం చేసింది. వాస్వానీ పదవీకాలం ముగియడానికి ఇంకా ఆరు నెలలకుపైగా సమయం ఉండటంతో, వారసుడి ఎంపికకు బ్యాంక్‌కు తగినంత సమయం లభించనుంది. ఈ ప్రకటన నేపథ్యంలో సోమవారం కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు మార్కెట్లో పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించే అవకాశం ఉంది. గత 52 వారాల్లో ఈ షేరు రూ.345.50 నుంచి రూ.453.20 మధ్య ట్రేడైంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.